మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ

RNI NO:TGTEL/25/A5443

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY




| రాజన్న సిరిసిల్ల | మంగళవారం | 25.08.2026 | సంపుటి : 01 | సంచిక : 236 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | TUESDAY | 25.08.2026 | Volume : 01 | Issue : 236 | Pages : 12 | Cost : 2/- |

# తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**అమెరికా పర్యటనకు అనుమతిపై రేవంత్ తీవ్ర ఆగ్రహం**

**ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్య**

**విదేశాల్లో స్పందిస్తే దేశద్రోహి అనేవారని వెల్లడి**

**అమెరికాకు తెలంగాణ అధికారులను పంపినట్లు ప్రకటన**

**ఆక్స్‌ఫర్డ్‌తో తెలంగాణ ఒప్పందం చేసుకోనుందని వెల్లడి**



**హైదరాబాద్, ఆగస్టు 24 :** అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి నిరాకరించడంపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తనకు జరిగిన అవమానం కాదని.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానమని అన్నారు. కేంద్రం తీరు ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని విమర్శించారు. బ్రిటన్ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు.

మిగతా 2లో...



# స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

## ఏలూరు జిల్లా ముసునూరులో కొత్త మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉపరాష్ట్రపతి



**ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రశంసలు**

**రాష్ట్ర ప్రగతిని కాంక్షించే జాతీయవాది అంటూ కితాబు**

**రైతులే దేశానికి వెన్నెముక అని స్పష్టం చేసిన రాధాకృష్ణన్**

**ఒక రైతు విజయాన్ని ఉదాహరణగా చూపుతూ తన అనుభవాన్ని పంచుకున్న వైనం**

**ఏలూరు ఆగస్టు 24 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు మిగతా 2లో...

## కళ్యాణ లక్ష్మీ కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**దివ్యాంగ వధువులకు సాయాం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం**




**హైదరాబాద్, ఆగస్టు 24 :** తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి

మిగతా 2లో...

# శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**ఆయా వర్గాల అభివృద్ధికి కమిటీలు కృషి చేయాలి**

**బడ్జెట్ కేటాయింపులు సమీక్షించుకోవాలి**

**శాసనమండలి కమిటీల సమావేశంలో గుత్తా, గడ్డం ప్రసాద్**

**హైదరాబాద్, 24 :** ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని,ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం మానిటరింగ్ చేస్తూ, ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక మిగతా 2లో...



## ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**ఏపీలో స్థానిక ఎన్నికలంటూ ప్రచారం.. ఎస్ఈసీ హెచ్చరిక**

**సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఫేక్ అని వెల్లడి**

**అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని ప్రజలకు ఎన్నికల సంఘం సూచన**

**100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభం**

**కొత్తగా 33.33 శాతం బీసీ రిజర్వేషన్ల ప్రతిపాదన**

**అమరావతి 24 :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ అంటూ సోషల్ మీడియా, వాట్సాప్‌లలో విస్తృతంగా ప్రచారమవుతున్న సమాచారం పూర్తిగా అవాస్తవమని, నకిలీదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ఈ ఫేక్ షెడ్యూల్‌ను ప్రజలు నమ్మవద్దని, ఇతరులకు ఫార్వార్డ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిపై కఠినమైన సైబర్ చట్టాల కింద చర్యలు తీసుకుంటామని మిగతా 2లో...






# ఫీజు బకాయిల రగడ..

**హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష**

**రూ. 15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల విద్యార్థులకు నష్టమని ఆరోపణ**

**రాంచందర్ రావుది రాజకీయ డ్రామా అని కొట్టిపారేసిన మంత్రి పొన్నం**

## తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**జీవో 97ను వ్యతిరేకిస్తూ ఏబీవీపీ ఆందోళన**

**రాష్ట్రవ్యాప్తంగా పాలిటెక్నిక్ కాలేజీల బంద్‌కు పిలుపు**

**జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్**




**హైదరాబాద్, ఆగస్టు 24 :** తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 97పై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నేడు (మంగళవారం) రాష్ట్రవ్యాప్త పాలిటెక్నిక్ కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చింది. పాలిటెక్నిక్ కళాశాలలను మిగతా 2లో...

# పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం**

**జల్ జీవన్ మిషన్, అమరజీవి జలధారల కింద సుమారు రూ. 280 కోట్ల కేటాయింపులు**

**‹96 శాతం ఓవరాల్ ప్రాజెక్టు పనులు.. 99 శాతం పైప్‌లైన్ నిర్మాణం పూర్తి**

**తుది అంకానికి నీటి శుద్ధి ప్లాంట్ పనులు**

**పులివెందుల పట్టణం, గ్రామీణం, సింహాద్రిపురం మండలాల్లో 100 శాతం పూర్తయిన పనులు**

**లింగాల మండల పరిధిలో 24 ఆవాసాలకు తాగునీటి సరఫరా**

2లో.



# స్వదేశీ విత్తనాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**మొదటిపేజీ తరువాయి**

ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఓ హై ఎక్స్‌పాన్షన్ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. "రెండు నెలల క్రితం 'దినమలర్' అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను" అని వివరించారు. ఆ తర్వాత పట్టాభి రామారావు తనను కలిసి పాప్‌కార్న్‌ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు.



ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నారు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో పట్టాభి ఇచ్చిన పాప్‌కార్న్‌ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు.

రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించారు. జీడీపీ, అభివృద్ధి గురించి మనం మాట్లాడక ముందే తరతరాలుగా ఈ నాగరికతకు అన్నం పెట్టింది రైతేనని అన్నారు. "మన పండుగలు, పంచాంగాలు, కాలగమన భావన సైతం విత్తనం వేయడం నుంచి పంట కోయడం వరకు సాగిన వ్యవసాయ చక్రం ఆధారంగానే రూపుదిద్దుకున్నాయి. జనవరి 14న దేశమంతటా ఆంధ్రప్రదేశ్‌లో మకర సంక్రాంతి, పంజాబ్‌లో లోహ్రీ, తమిళనాడులో పొంగల్, అసోంలో బిహు అంటూ పంటల పండుగను జరుపుకుంటాం. ఇంతటి వైవిధ్యభరితమైన మన దేశాన్ని వ్యవసాయం ఏకం చేస్తోంది" అని ఆయన వివరించారు. ప్రస్తుత ధరల ప్రకారం దేశ స్థూల విలువ జోడింపులో వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా దాదాపు ఐదో వంతు ఉందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, కోర్టెవా పాప్‌కార్న్‌కా ఎండీ ఎస్పీబీ పట్టాభి రామారావు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి, ముఖ్యమంత్రి కలిసి కొత్త వంగడాన్ని ఆవిష్కరించి, పలువురు రైతులను సత్కరించారు.

# శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యం

**మొదటిపేజీ తరువాయి**

సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలతో పాటుగా, అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూల్ కులాలకు సంబంధించిన పథకాల అమలులో లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ...తాను కూడా 2008 లో షెడ్యూల్ కులాల కమిటీ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించానన్నారు. తెలంగాణ ఎప్పటినుంచో 'గంగా- జమున తెహజీబ్'కు ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తోంది. హిందువులు, ముస్లిములు, క్రిష్టియన్లు మరియు ఇతర మైనారిటీ సోదరులు తరతరాలుగా ఒకే కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ, పండుగలు, భాషలు, ఆహారం, సంస్కృతులను పంచుకుంటూ, అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమ, విశ్వాసాలతో ముందుకు సాగుతున్నారన్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్ కులాల జనాభా ఉన్నారు. ఈ కమిటీ షెడ్యూల్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కొరకు పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో కలిసికట్టుగా పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో శాసనమండలి మైనారిటీల సంక్షేమ కమిటీ,షెడ్యూల్ కులాల సంక్షేమ కమిటీ సమావేశమయ్యింది. శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ , డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ లు హాజరయ్యారు. మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతా రావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్ కూడా హాజరయ్యారు. శాసనమండలి ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం , సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్యలు, శాసన పరిషత్ కార్యదర్శి డా. వి నరసింహా చార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు కూడా హాజరయ్యారు. ముందుగా నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు పుష్ప గుచ్ఛాలతో చైర్మన్, స్పీకర్, మరియు సెక్రటరీలు అభినందనలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ చొరవతో తీరుతున్న పులివెందుల దాహార్తి

**అమరావతి ఆగస్టు 24 :**

జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్లక్ష్యం చేసిన పథకాలకు సైతం ప్రత్యేక ప్రాధాన్యమిచ్చి ముందుకు తీసుకువెళు న్నారు. వైఎస్సార్ కడప జిల్లా, పులివెందుల నియోజకవర్గంతోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చేపట్టిన మెగా వాటర్ గ్రిడ్ పథకం నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తి చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులను తిరిగి గాడిలో పెట్టి వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. దాదాపు రూ. 426 కోట్ల విలువైన 96 శాతం పనులు పూర్తి చేసి నిబద్ధత చాటుకున్నారు.

ఏడు మండలాల పరిధిలో ఐదున్నర లక్షల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ. 480 కోట్ల అంచనా వ్యయంతో జల్ జీవన్ మిషన్ కింద ప్రారంభమైన పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పథకం పనులు గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ పనులను ముందుకు తీసుకువెళ్లే అంశంలో శ్రద్ధ



చూపలేదు. చేపట్టిన పనుల్లో కడా నాణ్యత లేదు. కటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జల్ జీవన్ మిషన్ పనుల మీద జరిగిన తొలి సమీక్షలోనే పవన్ కళ్యాణ్ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన పథకాలను సైతం ప్రాధాన్య క్రమంలో ముందుకు తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. 2024లో కటమి ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి జల్ జీవన్ మిషన్ గడువు కడా పూర్తి కావడంతో, కేంద్రం వద్ద ఉన్న మిగులు నిధులు ఖర్చు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఉప ముఖ్యమంత్రివర్యులు, కటమి నాయకులు చేసిన ప్రయత్నాల ఫలంగా జల్ జీవన్ మిషన్‌ను మరో 4 ఏళ్ల పాటు పొడిగించేందుకు కేంద్రం అంగీకారం తెలపడంతో పులివెందుల మెగా తాగునీటి సరఫరా పథకం తిరిగి ఊపిరి పోసుకుంది.

అప్పటి నుంచి పవన్ కళ్యాణ్ గారి ప్రత్యేక చొరవతో దాదాపు రూ. 280 కోట్లు ఒక్క పులివెందుల పథకానికే కేటాయించి వేగంగా పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో అరకొర పైప్‌లైన్లు వేయడం మినహా పెద్దగా పనులేమీ పూర్తి కాలేదు. కటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 96 శాతం పనులు పూర్తి చేశారు. అందులో పులివెందుల, సింహాద్రిపురం మండలాలకు ఇప్పటికే ఈ పథకం ద్వారా తాగునీరు అందుతోంది. పులివెందుల పట్టణానికి సంబంధించిన పనులు కడా 100 శాతం పూర్తయ్యాయి. లింగాల మండలం పరిధిలో 27 ఆవాసాలకు గాను 24 ఆవాసాలకు త్వరలో తాగునీరు అందుతోంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో కీలకమైన ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు పూర్తి కాగా, 65 మిలియన్ లీటర్ల నీటి శుద్ధి ప్లాంట్లు కడా అందుబాటులోకి వచ్చాయి. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. ఓవర్‌హెడ్ ట్యాంకులు, గ్రౌండ్ లెవల్ రిజర్వాయర్ల నిర్మాణం కడా దాదాపు తుది దశకు చేరింది. కటమి ప్రభుత్వం తాగు నీరు వంటి ప్రజల ప్రాథమిక అవసరాలు తీర్చేందుకు రాజకీయాలకు అతీతంగా ముందుకు వెళ్లాలని పవన్ కళ్యాణ్ చేసిన నిర్దేశం మేరకు పులివెందుల మెగా వాటర్ గ్రిడ్ పనులను గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు వేగంగా ముందుకు తీసుకువెళ్తున్నారు.

# తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించింది

**మొదటిపేజీ తరువాయి**

టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా



అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనేమీ అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. ఈ ప్రెస్‌మీట్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి కేసులో ప్రభుత్వానికి స్వల్ప ఊరట

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# ఫేక్ సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన సైబర్ చర్యలు

**మొదటిపేజీ తరువాయి**

సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించారు.

ఎన్నికల కమిషన్ అధికారిక చిహ్నాలు, లోగోలను దుర్వినియోగం చేసి కొందరు ఉద్దేశపూర్వకంగా ఈ నకిలీ షెడ్యూల్‌ను సృష్టించి ప్రచారం చేస్తున్నారని పునేతా తెలిపారు. ఈ షెడ్యూల్‌పై స్పష్టత కోరుతూ తమ కార్యాలయానికి అనేక ఫోన్ కాల్స్ వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి సమాచారమైనా అధికారిక పత్రికా ప్రకటనల ద్వారా లేదా మీడియా సమావేశాల ద్వారా మాత్రమే వెల్లడిస్తామని, ప్రజలు అనధికారిక వార్తలను ఏమాత్రం పట్టించుకోవద్దని సూచించారు. ఖచ్చితమైన సమాచారం కోసం ఎస్ఈసీ అధికారిక వెబ్‌సైట్‌ను మాత్రమే సంప్రదించాలని కోరారు.

మరోవైపు, రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఆగస్టు 19న జీవో జారీ చేసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం సన్నాహాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే, న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల మరో 23 మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. త్వరలోనే అధికారికంగా షెడ్యూల్ విడుదల చేస్తామని, అప్పటివరకు వదంతులను నమ్మవద్దని అధికారులు స్పష్టం చేశారు.

# తెలంగాణలో నేడు పాలిటెక్నిక్ కాలేజీల బంద్

**మొదటిపేజీ తరువాయి**

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను ఏబీవీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సింది పోయి, ఈ నిర్ణయం ద్వారా వాటిని ప్రైవేటీకరించే కుట్ర జరుగుతోందని ఆరోపించింది.

ఈ నూతన విధానం వల్ల పాలిటెక్నిక్ విద్యార్థులు బీటెక్‌లో లాటరల్ ఎంట్రీ ద్వారా ప్రవేశం పొందే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రేపు చేపట్టనున్న బంద్‌ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ విద్యార్థులకు పిలుపునిచ్చింది.

# ఫీజు బకాయిల రగడ..

## హైదరాబాద్‌లో బీజేపీ నేత రాంచందర్ రావు 48 గంటల దీక్ష

**హైదరాబాద్, ఆగస్టు 24** :ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం హైదరాబాద్‌లో 48 గంటల నిరాహార దీక్షను ప్రారంభించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు.

ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని, తద్వారా వారు ఉన్నత విద్యకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇదే విద్యార్థులు త్వరలో ప్రభుత్వాన్ని గద్దె దించుతారని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే, తెలంగాణకు వచ్చి బకాయిలు విడుదల కోసం చొరవ చూపాలని సవాల్ విసిరారు.

**రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే ఈ డ్రామా: పొన్నం ప్రభాకర్**

రాంచందర్ రావు దీక్షపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే రాంచందర్ రావు ఈ తరహా డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. చేతనైతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన బకాయిలను సైతం తమ ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తోందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు బ్యాంకుల ద్వారా అడ్వాన్స్‌గా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. అలాగే, సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులను విడుదల చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇటువంటి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలవుతోందా అని ఆయన ప్రశ్నించారు.

# ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసు.. సాదిక్ ఖాన్‌కు రిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 24**



రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన కాకినాడ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడు సాదిక్ ఖాన్‌కు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఘటన జరిగిన నాటి నుంచి తప్పించుకు తిరుగుతున్న అతడిని ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు, సోమవారం కాకినాడకు తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచారు. సాదిక్ ఖాన్ వేధింపుల కారణంగానే నూకరాజు కుటుంబం బలవన్మరణానికి పాల్పడిందని కాకినాడ ఎస్పీ బిందుమాధవ్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.కేసు దర్యాప్తు వివరాలను ఎస్పీ వెల్లడిస్తూ.. రెండు ఆత్మహత్య లేఖలు ఈ కేసులో కీలక ఆధారాలుగా నిలిచాయని తెలిపారు. నూకరాజు రాసిన లేఖతో పాటు, ఆయన కుమార్తె సౌజన్య స్కూటీలో లభించిన మరో లేఖలోనూ సాదిక్ ఖాన్ పేరు స్పష్టంగా ఉందని చెప్పారు. అతని వేధింపులు భరించలేకే ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారని, ఈ ఆధారాలతోనే దర్యాప్తును ముమ్మరం చేశామని వివరించారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న ఇతర లేఖల గురించి తాము ఇప్పుడేమీ చెప్పలేమని, పక్కా ఆధారాలతోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని స్పష్టం చేశారు.

ఘటన అనంతరం సాదిక్ తన ఫోన్లను స్విచాఫ్ చేసి పోలీసులకు చిక్కకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకునేందుకు 10 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి, ఐదు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. చివరకు మీరట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అనంతరం సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్పీ, ఐదుగురు సీఐలతో కూడిన బృందం సాదిక్‌ను విచారించింది. వైద్య పరీక్షల అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో అతడిని కాకినాడ సబ్ జైలుకు తరలించారు.మరిన్ని వివరాలు రాబట్టేందుకు మంగళవారం కస్టడీ పిటిషన్ దాఖలు చేస్తామని, కస్టడీ విచారణలో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. సాదిక్ నిర్వహిస్తున్న షూటింగ్ అకాడమీపైనా పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు కీలక సూచన చేసిన ఎస్పీ.. వేధింపులు ఎదురైనప్పుడు ప్రాణాలు తీసుకునే బదులు ధైర్యంగా పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచి, వారికి పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కేసులో నూకరాజు కుటుంబం ముందుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొనడం గమనార్హం.

# రేషన్ కార్డులపై ప్రధాని మోదీ ఫోటో ముద్రించాలి

● బీజేపీ నేత సోమిశెట్టి నాగరాజు డిమాండ్






**కొనరావుపేట:- ఆగస్టు 24 ప్రజావాణి :**రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పంపిణీ చేస్తున్న నూతన రేషన్ కార్డులపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి ఫోటోను ముద్రించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు సోమీశెట్టి నాగరాజు డిమాండ్ చేశారు,కేంద్ర ప్రభుత్వం వన్ నేషన్--వన్ రేషన్ కార్డ్ విధానం ద్వారా దేశవ్యాప్తంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలకంగా పనిచేస్తోందని పేర్కొన్నారు రేషన్ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం 5 కిలోల బియ్యాన్ని అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో బియ్యని అందిస్తున్నది అని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సహకారం మరియు పథకాల వివరాలను ప్రజలకు తెలియకుండా చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తన పథకాలుగా ప్రచారం చేసుకోవడం మానుకోవాలని సూచించారు,ప్రజలకు పంపిణీ చేస్తున్న రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి ఫోటోతో పాటు కేంద్ర ప్రభుత్వ ఆహార భద్రతా పథకాల వివరాలను కూడా స్పష్టంగా ముద్రించాలని డిమాండ్ చేశారు,ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలకు అతీతంగా పారదర్శకత పాటించి, కేంద్ర ప్రభుత్వ పాత్రను కూడా ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# వర్షాలకు దెబ్బతిన్న కుటుంబాలకు అండగా నిలిచిన డాక్టర్. ఎం.ఏ.హాకీమ్.



**కోటగిరి/ప్రజావాణి:**-వర్షాల వల్ల ఇళ్లు దెబ్బతిని ప్రమాద కరంగా మారిన పోతంగల్ మండలంలోని హంగర్గ గ్రామానికి చెందిన హనుమాన్,వడ్ల చారి కుటుంబాలకు సామాజిక సేవకులు డాక్టర్.ఎం.ఏ.హాకీమ్ అండగా నిలిచారు.సర్పంచ్ ఉదయ భాస్కర్ సమాచారంతో సోమవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన శిథిలమైన ఇళ్లను పరిశీలించారు. ప్రాణాపాయం కలగకుండా బాధితులను వెంటనే అద్దె ఇళ్లలోకి తరలించి వారికి తన సొంత నిధుల నుంచి ఆర్థిక సహాయం అందించారు.ఆపదలో ఆదుకున్న డాక్టర్ హకీమ్ ను సర్పంచ్ ఉదయ భాస్కర్,గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,నాయకులు యూసుఫ్, ముత్యాల పండరి,వడ్ల చారి,రమేష్,ఉమర్ఖాన్,బాగయ్య, గ్రామ యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# కళ్లేపల్లిలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేసిన



● సర్పంచ్ బిగుల్లా మోహన్

**బెజ్జంకి, ఆగస్టు 24 (ప్రజావాణి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని కళ్లేపల్లి గ్రామపంచాయతీలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సర్పంచ్ బిగుల్లా మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శేషి వినీత్, జీపీఓ నిరోషా, వార్డు సభ్యులు మంకాళి మోహన్, బుర్ర పద్మ, మాజీ సర్పంచ్ వేగ్గాలం శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ పర్శ సంతోష్, రేషన్ డీలర్ కాంగర్ల మోహన్, రవి శంకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నేరడుగుంట సర్పంచ్ ఒగ్గు సాయి కిరణ్



**మన సమగ్ర ప్రజావాణి ఆగష్టు 24 (నేరేడుగుంట ) సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** తన పుట్టినరోజు సందర్భంగా నేరడుగుంట గ్రామ సర్పంచ్ ఒగ్గు సాయి కిరణ్ తిరుమల తిరుపతి దేవస్థానాన్ని సందర్శించి శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని నేరడుగుంట, మక్తగూడెం గ్రామాల ప్రజలు సుభిక్షంగా, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలందరి ఆశీస్సులతో మరింత బాధ్యతగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# పాత బిల్లుల విడుదలకై ప్రజావాణిలో మాజీ సర్పంచ్ వినతి.




**కోటగిరి/ప్రజావాణి:-**తాను చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ కోటగిరి మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ సోమవారం మండల కేంద్రంలో జరిగిన ప్రజావాణిలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.2018--2024 పదవీ కాలంలో కోటగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిహెచ్సి భవనం రిపేర్లు,డ్రెయినేజీల పారిశుధ్య పనులను సొంత ఖర్చులతో పూర్తి చేశానని,వీటి నిమిత్తం పంచాయతీలో తీర్మానాలు చేసి ఎంబి రికార్డు నమోదు చేసినట్లు తెలిపారు.స్పెషల్ ఆఫీసర్ పాలన బాధ్యతలు స్వీకరించినప్పుడు కూడా ఈ రికార్డులను వారికి అప్పగించి నట్లు చెప్పారు.అయితే ఈ నిధులు రాకపోవడంతో బిల్లుల చెల్లింపు జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం నూతనంగా ఎన్నికైన సర్పంచ్ రాజకీయ కక్షతోనే తన బిల్లులను నిలిపివేశారని ఆరోపించారు.అధికారులు వెంటనే స్పందించి ఈ ఎంబి రికార్డులు,తీర్మానాలను పరిశీలించి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం ద్వారా కోరామని అన్నారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రజావాణిలో బీజేపీ వినతి

- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం.పోతంగల్లో పాఠశాలల సమస్యలపై ఫిర్యాదు.
- పోతంగల్ మండల కేంద్రంలో బీజేపీ నిరసన కార్యక్రమం.






**కోటగిరి/ప్రజావాణి:**-పోతంగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల లేమిపై బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.అనంతరం సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాఠశాలల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని కోరుతూ వారు అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా పోతంగల్ మండల బిజెపి పార్టీ అధ్యక్షులు భజరంగ్ (హన్మండ్లు) మాట్లాడుతూ. పోతంగల్ జెడ్పీహెచ్ఎస్లో బాలికల కోసం కనీసం మరుగు దొడ్లు కూడా లేవనీ.ఆడపిల్లలు పాఠశాలకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఉందని.వెంటనే బాలికల కోసం మరుగు దొడ్లు నిర్మించాలన్నారు.అదేవిధంగా పాఠశాలకు పీఈటీ లని నియమించాలన్నారు.పాత పోతంగల్ ప్రైమరీ పాఠశా లకు ప్రహరీ గోడ లేదు. ఊరి చెరువు ఆనుకొని ఉండడం చేత ప్రమాదాలు జరగకుండా వెంటనే పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలన్నారు.అక్కడే ఉన్న పాత భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిలో ఉందని.విద్యార్థుల ప్రాణాలకు ముప్పు రాకముందే పాత భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించాలన్నారు.అలాగే ఉర్దూ పాఠశాల భవన నిర్మాణం,ప్రహరీ గోడ,ఆబాది పాఠశాలకు కూడా ప్రహరీ గోడ నిర్మించాలన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుడుమల శంకర్,కిసాన్ మోర్చా అధ్యక్షులు ఓమన్న పటేల్,జిల్లా ఓబీసీ అధ్యక్షులు ఎస్.మ క్కయ్య,గంధపు హన్మండ్లు,శంకర్ గణేష్ గౌడ్,కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్కౌట్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్- 2026...

**ఆగస్టు 24 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి** పియం శ్రీ కేంద్రీయ విద్యాలయ భువనగిరి వేదికగా తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్-2026-27 (స్కౌట్స్) ఘనంగా ప్రారంభమైంది. కేంద్రీయ విద్యాలయ సంఘటన్ హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో నిర్వ హిస్తున్న ఈ మూడు రోజుల శిబిరం ఆగస్టు 24 నుండి 26, 2026 వరకు కొనసాగుతుంది. హైదరాబాద్ రీజియన్ కు చెందిన వివిధ కేంద్రీయ విద్యాలయాల స్కౌట్స్ ఈ శిబిరంలో పాల్గొన్నారు. అధికారిక ఉత్తర్వుల ప్రకారం కే.వి.ఎస్. హైదరాబాద్ రీజియన్ కు చెందిన తెలంగాణ రాష్ట్ర వివిధ కేంద్రీయ విద్యాలయాల స్కౌట్స్కు పియం శ్రీ కేంద్రీయ విద్యాలయ భువనగిరిని వేదికగా నిర్ణయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్. శ్రీనివాసులు , ప్రిన్సిపాల్ , పియం శ్రీ కేంద్రీయ విద్యాలయ నల్గొండ హాజరై స్కౌట్స్ను ఉద్దేశించి ప్రసంగించారు. స్కౌటింగ్ ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం,నాయకత్వ లక్షణాలు,సమయపాలన బాధ్యతాయు తమైన పౌరసత్వ లక్షణాలు పెంపొందుతాయని ఆయన పేర్కొన్నారు. వేదిక డైరెక్టర్గా ఎన్. చంద్ర మౌళి , పియంశ్రీ కేంద్రీయ విద్యాలయ భువనగిరి శిబిర నిర్వ హణను పర్య వేక్షిస్తున్నారు. శిబిరానికి విచ్చేసిన స్కౌట్స్, ఎగ్జామినర్లు , ఎస్కార్ట్ టీచర్లు క్యాంప్ అధికారు లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తూ కార్య క్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయం చేస్తున్నారు.శిబిరానికి క్యాంప్ లీడర్ (ఎల్ఓసి) శ్రీ ఆర్. జగన్మోహన్ రావు , ఏఎల్టి (ఎస్) నాయకత్వం వహిస్తున్నారు.







అధికారిక వివరాల్లో భువనగిరి వేదికకు ఆయనను ఎల్ఓసి గా పేర్కొన్నారు. వివిధ కేంద్రీయ విద్యాలయాల నుండి నియమించబడిన ఎగ్జామినర్లు కూడా శిబిరంలో పాల్గొని స్కౌట్స్ తృతీయ సోపాన్ నై పుణ్యాలను పరీక్షి స్తున్నారు. ఈ శిబిరంలో ఎగ్జామినర్లు , టెస్టింగ్ ఇన్చార్జీలు, ఎస్కార్ట్ టీచర్లు , స్కౌట్ మాస్టర్లు స్కౌట్స్ చురుకుగా పాల్గొంటున్నారు. శిబిరం సజావుగా సాగేందుకు పియం శ్రీ కేంద్రీయ విద్యాలయ భువనగిరి బోధన బోధనేతర సిబ్బంది ఎంతో ఉత్సాహంతో పాల్గొంటూ వసతి , భోజనం , శుభ్రత , భద్రత , ప్రాంగణ ఏర్పాట్లు ఇతర అవసరమైన సౌకర్యాలను సమన్వయం తో అందిస్తున్నారు. శిబిరంలో పాల్గొంటున్న స్కౌట్స్లో క్రమశిక్షణ , సమయపాలన , సేవా భావం , నాయకత్వ లక్షణాలు జట్టు స్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తున్నాయి. శిబిరాన్ని విజయవంతం గా నిర్వహించేందుకు నిర్వాహకులు , ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది సమిష్టిగా కృషి చేస్తున్నారు. ఈ తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ విద్యార్థుల్లో దేశభక్తి , సేవా దృక్పథం , నాయకత్వ లక్షణాలు బాధ్యతా యుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడంలో ఎంతో దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఎమ్మెల్యేలు,మంత్రులపై నిఘా...

● సురేఖ ఉదంతం నేపథ్యంలో అధికార పార్టీ నేతలపై ఇంటెలిజెన్స్.



**ఆగస్టు 24 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి**కొండా సురేఖ ఉదంతం.. కాంగ్రెస్ సర్కార్కు పెద్ద తల నొప్పిగా మారింది. సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత ఘాటు వ్యాఖ్యల తో మొదలైన ఈ వివాదం వారం రోజుల నుంచి రాజ కీయంగా పెద్ద దుమారం రేపుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు , ఇతర ముఖ్య నేతలపై ప్రభుత్వం ఓ కన్నేసి ఉంచింది. కొందరు ఎమ్మెల్యేలు తనకు వ్యతిరేకంగా కూటమి కడుతున్నారని విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అనుమానించి ప్రచారం జరుగుతున్నది. అందుకే వారి కదలికలపై పోలీస్ , ఇంటెలిజెన్స్ అధికారు లతో నిఘా పెట్టినట్టు తెలిసింది. అందుకే అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షం అవుతున్నారని చెబుతున్నారు. ఎవరెవరు ఎవరితో మాట్లాడు తున్నారు..? ఎవరిని కలుస్తున్నారు..? మంత్రులు ఏం చేస్తున్నారో ఆరా తీస్తున్నారు. గతం లో ఎన్నడూ లేని విధంగా కార్పొరేషన్ చైర్మన్ల పై కూడా నిఘా పెట్టారు. శని వారం ఓ అధికార పార్టీ ఎమ్మెల్యే కూతురి వివాహ రిసెప్షన్ హైదరాబాద్ శివారులోని జన్వాడలో జరుగగా , ఈ విందుకు పలువురు మంత్రులు , ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు హాజరయ్యా ఇలా హాజరైన వారు ఎవరె వరున్నారు..? ఎవరెవరు కలిసి వచ్చారు..? కలిసి వచ్చినప్పుడు ఎవరు ఎవరితో మాట్లాడు కున్నారన్న దాని పై ఆరా తీసినట్టు తెలిసింది. దీంతోపాటు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ గా ఉన్న మంత్రి సమీప బంధువుతో మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు అల్పాహార భేటీకి వెళ్లారు. ఇది పోలీసు వర్గాల్లో సంచలనంగా మారింది. ఏం మాట్లాడుకొని ఉంటారో అనే అను మానంతో ఆరా తీశారు. విషయాలు తెలుసుకునే క్రమంలో విపరీతంగా ప్రయత్నించారు. చివరకు ఓ ఎస్పీ స్థాయి అధికారి సదరు కార్పొరేషన్ చైర్మన్కు ఫోన్ చేసి అన్నా..ఏం మాట్లాడు కున్నారో చెప్పండి అంటూ రిక్వెస్ట్ చేయడం గమనార్హం. ఇక నల్లగొండ జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు , ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రుల కదలికల పై కూడా నిఘా పెంచారు. సీఎం విదేశీ పర్యటనకు వెళ్లినప్పటి నుంచే నిఘా పెంచామని పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ నిఘా విభాగం అధికారి 'ఆదాబ్ హైదరాబాద్' ప్రతినిధి తో చెప్పారు. ఇక ఇటీవల కొండా సురేఖ వ్యాఖ్యల తర్వాత జిల్లా స్థాయిలో కూడా నిఘా వ్యవస్థను అప్రమత్తం చేశామని , పొలిటికల్ ఇంటెలిజెన్స్ను యాక్టివేట్ చేశామని ఆ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి అధికార పార్టీ ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీల కదలికలను , ప్రతిపక్ష పార్టీకి చెందిన ముఖ్య నేతల కదలికలను తెలుసుకోవాలనుకుంటున్నదని వారు వెల్లడించారు.

# విద్యార్థులు తినే అన్నంలో పురుగలు.

- ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి ఉంటే రాష్ట్ర పరిస్థితి ఏంటి...?
- పేద విద్యార్థుల పై ఇంత చులకన బావమా..
- తెలంగాణ లో విద్యార్థులకు అందని నాణ్యమైన భోజనం, విద్యా.
- విద్యార్థుల సమస్యల పై ప్రశ్నిస్తే కేసులు పెడుతూ బెదిరింపుల.
- ఘటనపై విచారణ జరిపి బాద్యులపై చర్యలు తీసుకోవాలి
- సిరిసిల్ల చేనేత చౌక్ వద్ద బి అర్ ఎస్ వి నిరసన కార్యక్రమం.



**సిరిసిల్ల, ప్రజావాణి** ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపించాయంటూ బీఆర్ఎస్వీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం లో విద్యార్థులు తిని అన్నంలో పురుగులు వచ్చిన పట్టించుకోవడంలేదని సిరిసిల్ల పట్టణంలో చేనేత చౌక్ వద్ద బిఆర్ఎస్వీ నాయకులు ప్రకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థులు తినే అన్నంలో పురుగులు రావడం పేద విద్యార్థుల పట్ల అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు ఆరోపించారు. భోజనంలో పురుగులు ఉన్న విషయాన్ని పాఠశాల హెడ్మాస్టర్కు విద్యార్థులు చెప్పగా, "నోరు మూసుకుని తినండి" అని అన్నట్లు ఆరోపణలు వచ్చాయి. సమస్యను ప్రశ్నిస్తే కేసులు పెడతారనే భయంతో విద్యార్థులు తమ సమస్యలను బయటకు చెప్పేందుకు వెనుకాడుతున్నారని నాయకులు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందకపోతే రాష్ట్రంలోని పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం, పోలీసులతో బెదిరింపులకు పాల్పడటం సరికాదని అన్నారు.

**విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వద్దు**

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని, పాఠశాలలు, హాస్టళ్లలో అందిస్తున్న భోజన నాణ్యతపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షితమైన మరియు పౌష్టికాహారం అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కంచర్ల రవి గౌడ్ డిమాండ్ చేశారు.

# సుద్దులం తండాకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

- ప్రజావాణిలో సర్పంచ్ మౌనిక విజయ్ వినతి.
- రోడ్డు మరమ్మతులు పూర్తి చేశాం. బస్సు నడపాలని విజ్ఞప్తి.
- రవాణా లేక విద్యార్థుల చదువులకు ఇబ్బందులు.



**కోటగిరి/ప్రజావాణి:-**నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సుద్దులం తండాకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ మూడ్ మౌనిక విజయ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.సుద్దులం తండా గ్రామం నుండి ప్రతిరోజూ అనేకమంది విద్యార్థులు కోటగిరి లోని ఉన్నత పాఠశాల,జూనియర్ కళాశాలలకు అలాగే బోధన్ పట్టణంలోని జూనియర్,డిగ్రీ కళాశాలలకు వెళ్తుంటారని తెలిపారు.ప్రస్తుతం గ్రామానికి ఆర్టీసీ బస్సు రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు,గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా రవాణా సౌకర్యం లేక కొందరు విద్యార్థు లు చదువును మధ్యలోనే ఆపేసే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.గతంలో బోధన్ డిపో మేనేజర్‌ను కలవగా, గ్రామానికి వచ్చే రహదారిని బాగు చేయాలని సూచించారని గుర్తుచేశారు.ఆ సూచన మేరకు గ్రామ ప్రజల సహకారంతో రహదారి మరమ్మతులు పూర్తి చేయడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు,పొదలను తొలగించి బస్సు రాక పోకలకు అనుకూలంగా సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం రహదారి పూర్తిగా అందుబాటులోకి వచ్చినందున,విద్యార్థు ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బోధన్ డిపో నుండి సుద్దులం తండాకు వెంటనే రోజువారీ ఆర్టీసీ బస్సు సర్వీసు ను ప్రారంభించాలని సర్పంచ్ అధికారులను కోరారు.

# బెజ్జంకి ప్రధాన రహదారిపై ఆక్రమణలు- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

- ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్



**బెజ్జంకి, ఆగస్టు 24 (ప్రజావాణి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలోని బస్టాండ్ పరిసర ప్రాంతంలో ప్రధాన రహదారిపై ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతరవేణి మహేష్ అన్నారు. అంబేడ్కర్ కూడలి నుంచి గుండారం--బెజ్జంకి క్రాసింగ్, బేగంపేట వైపు వెళ్లే రహదారిపై దుకాణదారులు రోడ్డును ఆనుకుని సరుకులు, సామగ్రి ఏర్పాటు చేయడంతో రహదారి వెడల్పు తగ్గిపోతోందన్నారు.దీంతో వాహనదారులు, ప్రయాణికులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమంలో బెజ్జంకి ఎంపీడీఓ కడివెర్కు ప్రవీణ్ కి వినతి పత్రం అందజేశారు అధికారులు రహదారిని పరిశీలించి ఆక్రమణలు, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే సామగ్రి, అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఏఐవైఎఫ్ మండల సమితి డిమాండ్ చేసింది. లేనిపక్షంలో మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మహేష్ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సిద్దిపేట జిల్లా మాజీ అధ్యక్షులు బోనగిరి శ్రావణ్, మండల అధ్యక్షులు అంతటి రాకేష్, ఉపాధ్యక్షులు రోడ్డ లక్ష్మణ్, రోడ్డ చరణ్, బోనగిరి స్వామి, బాలమల్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో హాట్ టాపిక్...

- ఇద్దరికి కేంద్ర మంత్రి పదవులు..?

**ఆగస్టు 24 యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి**తెలంగాణా బీజేపీకి జాతీయ కార్యవర్గం పదవుల విషయంలో అన్యాయం జరిగింది అన్న భావన ఉంది. గతంలో పదవులు నిర్వహించిన వారికి కూడా ఈసారి అవకాశం దక్కలేదు సరికదా కొత్త వారిని ఎవరినీ తీసుకోలేదు. దీంతో తెలంగాణా బీజేపీ నేతలు లేకుండా బీజేపీ జాతీయ కార్యవర్గం కూర్పు జరిగిపోయింది. అదే సమయంలో ఏపీకి మంచి ప్రాధాన్యత ఇచ్చారు.ఏపీ కంటే తెలంగాణాలోనే బీజేపీకి బలం ఉంది. ఎనిమిది మంది ఎంపీలు ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న తెలంగాణాలో బలమైన నాయకులు ఎంతో మంది ఉన్నారు. 2028 ఎన్నికల్లో తెలంగాణాలో అధికారం లోకి రావాలని గట్టిగా తల పోస్తున్న కమల నాథులు ఇలా ఎందుకు చేశారని తెలంగాణా బీజేపీ నేతలు అంతా తీవ్రంగా చర్చిస్తున్నారు. బీజేపీలో అంతర్మథనం పెద్ద ఎత్తున సాగుతోంది.

**బహుశా అదే కావచ్చు...**

అయితే అంతలోనే తేరుకుని ఉందిలే మంచి కాలం అని బీజేపీ నేతలు తమకు తాముగా చెప్పు కుంటున్నారు. పెద్ద పదవులు ఇచ్చేందుకే ఇలా చేశారు అని సర్ది చెప్పు కుంటున్నారు. ఇంతకీ ఆ పెద్ద పదవులు ఏమిటి అంటే కేంద్ర మంత్రి వర్గ విస్తరణ తొందరలో జరగ బోతోంది కాబట్టి అందులో కచ్చితంగా మరో రెండు బెర్తులు తెలంగాణాకు దక్కుతాయని భారీ ఆశలను బీజేపీ నేతలు పెంచుకుంటున్నారు. పార్టీ పదవులు దక్కపోవడం వెనక ఇదే కారణం అయి ఉంటుందని అంచనాకు వస్తున్నారు. అదే జరిగితే తమకు దశ తిరిగినట్లే అని కూడా వారు ఊహించుకుంటున్నారని ప్రచారం సాగుతోంది.




**కచ్చితంగా ఇస్తారంటూ...**

బీజేపీకి దక్షిణాన కర్ణాటక తరువాత తెలంగాణలోనే ఆశలు ఎక్కువగా ఉన్నాయని కూడా అంటున్నారు. దక్షిణాదికి గేట్ వేగా తెలంగాణాను బీజేపీ పెద్దలు పదే పదే చెబుతూ వచ్చారని అంటున్నారు. ఇక జీహెచ్ఎంసీ ఎన్నికలు ఉన్నాయని 2028లో అసెంబ్లీ ఎన్నికలు 2029 లో లోక్ సభ ఎన్నికలు ఉన్నాయని కూడా అంటున్నారు. దాంతో బీజేపీ బలపడాలి అంటే మరింత మందికి కేంద్ర మంత్రి పదవులు లభిస్తా యని కూడా లెక్క వేసు కుంటున్నారు.

**ఆమెకు ఖాయమేనా...**

ఇదిలా ఉంటే కేంద్ర మంత్రి పదవుల రేసులో మహబూబ్ నగర్ ఎంపీ మాజీ రాష్ట్ర మంత్రి డీకే అరుణ ముందు వరుసలో ఉన్నారని అంటున్నారు. ఆమెకు తాజాగా ప్రకటించిన జాతీయ కార్య వర్గంలో జాతీయ ఉపాధ్యక్ష పదవిని తీసేశారు. దాంతో ఆమెకు కేంద్ర మంత్రి పదవి ఇస్తా రనడానికి ఇది సంకేతంగా చెబుతున్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిది కూడా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కావడంతో పాటు అదే సామాజిక వర్గానికి అదే జిల్లాకు చెందిన అరుణకు కేంద్ర మంత్రి పదవి ఇస్తే కనుక తప్పనిసరిగా బీజేపీ అక్కడ పుంజు కుంటుందని కేంద్ర పెద్దలు భావిస్తున్నారని విశ్లేషిస్తున్నారు. దాంతో ఎపుడు విస్తరణ జరిగినా అరుణకు పదవి ఖాయమని అంటున్నారు.

**ఈ ఇద్దరిలో ఒకరికి...**

అంతే కాదు బీఆర్ఎస్ లో పునాది నుంచి ఉన్న మాజీ రాష్ట్ర మంత్రి ఈటెల రాజేందర్ బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా ఒకసారి ఎంపీగా ఒకసారి నెగ్గారు. బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన ఈటెల రాజేందర్ కి కేంద్ర మంత్రి పదవి ఇస్తే బీసీ వర్గాలు చేరువ అవుతాయని కేంద్ర పెద్దలు చూస్తున్నారని అంటున్నారు. అంతే కాదు బీఆర్ఎస్ నుంచి మరింత మందిని ఈ వైపుగా ఆకర్షించేందుకు వీలు అవుతుందని కూడా అంచనా కడుతున్నారు. ఒక వేళ ఏ కారణం చేతనైనా ఆయనకు పదవి ఇవ్వకపోతే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కి కేంద్ర మంత్రి పదవి దక్కడం ఖాయమని అంటున్నారు. ఆయన కూడా బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు అని అంటున్నారు. ఫైర్ బ్రాండ్ గా పేరున్న ఆయనకు ఇస్తే జిల్లాలో మరింతగా బీజేపీ బలపడడంతో పాటు కాంగ్రెస్ నుంచి నేతలను ఆకట్టుకోవడం సులువు అవుతుందని కూడా భావిసున్నారుట. మొత్తా నికి తెలంగాణ బీజేపీలో కేంద్ర మంత్రి పదవుల మీద హాట్ డిస్కషన్ అయితే సాగుతోంది.

# కోదండరామపురం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్నాక్స్, వాటర్ గ్లాసుల పంపిణీ.

- ప్రెస్ క్లబ్ కోదాండ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం అంజి కుమారుడి పుట్టినరోజు వేడుకలు..



**మునగాల, ఆగస్టు 24/ ప్రజావాణి** :మునగాల మండలం కోదండరామపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉదయం విద్యార్థులకు స్నాక్స్ బాక్సులు, వాటర్ గ్లాసులు మరియు చాక్లెట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రెస్ క్లబ్ కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డం అంజి కుమారుడు గడ్డం రుద్రాంశ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రాంశ్ తన చేతుల మీదుగా పాఠశాలలోని తోటి విద్యార్థులకు, అంగన్‌వాడీ మరియు ప్రాథమిక పాఠశాల పిల్లలకు చాక్లెట్లు, స్నాక్స్ బాక్సులు, వాటర్ గ్లాసులను అందజేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు కూడా వీటిని బహూకరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. తమ పుట్టినరోజున తోటి పిల్లలకు ఉపయోగపడే వస్తువులను పంపిణీ చేయడం పట్ల ఉపాధ్యాయులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ రుద్రాంశ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్‌లో సర్కార్ బడి భవన నిర్మాణానికి దిక్కెవరు..?

- బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన పనులు.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు దాటినా పూర్తి కాని వైనం.!
- రోడ్డుపైనే విద్యార్థు ల చదువులు..
- పాఠశాల భవన నిర్మాణం పూర్తికి ఆర్డీఓ ను కోరిన బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జనిగ సందీప్.



**హుజూర్నగర్ ఆగస్టు 24 (ప్రజావాణి)** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని 15వ వార్డు ముత్యాలమ్మ వీధిలో గల ఎంపీపీఎస్-1 పాఠశాల (యుపిఎస్ చీశీ.1) నూతన భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో సుమారు 100 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు జనిగ సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సోమవారం హుజూర్‌నగర్ ఆర్డీవో కు వినతిపత్రం అందజేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాఠశాల నూతన భవన నిర్మాణానికి టెండర్లు పిలిచి, నిధులు కేటాయించి పనులు ప్రారంభించినట్లు సందీప్ తెలిపారు. అయితే ప్రభుత్వం మారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా పనులు పూర్తి కాకపోవడంపై ఆయన ప్రశ్నించారు. ఇంతకాలం గడిచినా విద్యార్థులకు సొంత భవనం అందుబాటులోకి రాకపోవడం ఏమిటని, ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి దిక్కెవరో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**రోడ్డుపైనే విద్యార్థుల చదువులు**

భవన నిర్మాణంలో ఇప్పటికే కొంతమేర పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను పూర్తి చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందో అధికారులు సమాధానం చెప్పాలని సందీప్ కోరారు. భవనం అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు రోడ్డుపై కూర్చొని విద్యాభ్యాసం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రోడ్డుపై విద్యార్థులు కూర్చోవడం వారి భద్రతకు ముప్పుగా మారే అవకాశం ఉందని, దీనిపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

**నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి**



పాఠశాల భవన నిర్మాణానికి మంజూరైన నిధులు ఎంత? ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు? ఎన్ని పనులు పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పనులు మిగిలి ఉన్నాయి? నిర్మాణ పనులు ఎందుకు నిలిచిపోయాయి? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరపాలని జనిగ సందీప్ డిమాండ్ చేశారు.

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు**

విద్యార్థుల భవిష్యత్తు, భద్రతతో ముడిపడిన పాఠశాల భవన నిర్మాణాన్ని అత్యవసర అంశంగా పరిగణించాలని సందీప్ కోరారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులను అందుబాటులోకి తీసుకురావాలని ఆర్డిఓ ను విజ్ఞప్తి చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రుల తరపున ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు.

# పండ్ల తోటల రైతులకు రూ.6 లక్షల చెక్కుల పంపిణీ

- పండ్ల తోటల పెంపకానికి రైతులకు ఆర్థిక చేయూత



**దేవరకొండ, గుడిపల్లి, ఆగస్టు 24, ప్రజావాణి:** గుడిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణ లో సోమ వారం వీబీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటలకు సంబంధించిన సుమారు రూ.6 లక్షల విలువైన చెక్కులను రైతులకు గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సన్నకారు, చిన్నకారు రైతులకు ఈ పథకం ఒక వరం లాంటిదని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు గ్రామ ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుతుందని తెలిపారు. గ్రామాన్ని, పరిసర ప్రాంతాలను పచ్చని చెట్లతో కళకళలాడేలా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, క్షేత్ర సహాయకుడు, వార్డు సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ సర్కార్ ఆటలు!

- రూ. 15 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి.
- కేసముద్రంలో బీజేపీ భారీ నిరసన ర్యాలీ.. తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పణ.
- 40 లక్షల మంది విద్యార్థులపై ఫీజుల భారం.
- రాష్ట్ర అధ్యక్షుడి దీక్షకు కేసముద్రం మండల శాఖ సంఘీభావం.
- బకాయిలు ఇవ్వకుంటే పోరాటం ఉధృతం.. ఉప్పునూతల రమేష్.

**కేసముద్రం, ఆగస్టు 24, ప్రజావాణి.**తెలంగాణ రాష్ట్రంలో నిలిచిపోయిన రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కేసముద్రంలో నిరసన జ్వాలలు మిన్నంటాయి. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ప్రదర్శన చేపట్టారు. అనంతరం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.



**మొండి వైఖరి వీడాలి.!**

ఈ సందర్భంగా బీజేపీ కేసముద్రం మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరి వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని మండిపడ్డారు. విద్యార్థుల హక్కుల కోసం, వారి ఉజ్వల భవిష్యత్తు కోసం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు చేపట్టిన రెండు రోజుల నిరాహార దీక్షకు కేసముద్రం మండల శాఖ తరపున సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు.



**పోరాటం ఆపేది లేదు.!**

ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేయకపోతే, విద్యార్థుల పక్షాన బీజేపీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోగోజు నాగేశ్వర చారి, వంగాల కొమ్మాల్ రెడ్డి, లెంకలపల్లి శ్రీనివాస్, గాంధీ వెంకట్ రెడ్డి, మహమ్మద్ ఖాసిం, జుజ్జూరు వీరభద్ర చారి, బానోత్ రాము, బానోత్ సంపత్, వల్లందాస్ నగేష్, మండల,గ్రామ కమిటీల బాధ్యులు,శక్తి కేంద్రాల ఇన్చార్జ్‌లు, అనుబంధ మోర్చాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణలో వచ్చేది బీసీల రాజ్యం తీన్మార్ మల్లన్న

- మొగుడంపల్లి మండల అధ్యక్షుడు శీను




**మన సమగ్ర ప్రజావాణి ఆగష్టు 24(జహీరాబాద్ )సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** తెలంగాణలో జరగబోయే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బీసీల ప్రభుత్వం అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న నేతృత్వంలో బీసీలంతా ఏకం అవుతున్నారని సెప్టెంబర్ 17 నుండి మల్లన్న నిర్వహించే పాదయాత్ర తెలంగాణ చరిత్రలో సువర్ణ అక్షరాలతో రాయనున్నారని సంగారెడ్డి జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు బుడుగ శీను తెలిపారు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 10% కూడా లేని అగ్రవర్ణాల గత 79 సంవత్సరాలుగా పాలించారని 50% పైగా ఉన్న బీసీలు రాజ్యాధికారం లోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి బీసీలకు సరైన న్యాయం జరగడం లేదని సమైక్యాంధ్రలో మోసపోయిన మాదిరిగానే తెలంగాణలో సైతం బీసీలు మరోసారి మోసానికి గురి అయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు సంగారెడ్డి జిల్లా లో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరేందుకు ఎంతోమంది ముందుకు వస్తున్నారని త్వరలో జిల్లాలో చేరికలు ఉంటాయని తెలిపారు.బడుగు బలహీన వర్గాలు చైతన్యం కావాల్సిన సమయం ఆసన్నం అయ్యిందని ఆయన పేర్కొన్నారు అధికార కాంగ్రెస్ పార్టీలో రెడ్డి రాజ్యం కొనసాగుతుండగా ప్రతిపక్షం బిఆర్ఎస్ లో వెలమరాజ్యం నడుస్తుందని ఆయన ఆరోపించారు బీసీలకు అండగా నిలిచేది తీన్మార్ మల్లన్న లాంటి నాయకులేనని ఆయన అన్నారు త్వరలో సంగారెడ్డి జిల్లాలో పర్యటించటం జరుగుతుందని ఆయన తెలిపారు సంగారెడ్డి కేంద్రంగా త్వరలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన



**దండేపల్లి, ఆగస్టు 24 (సమగ్ర ప్రజా పాలన):** దండేపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల అభివృద్ధి అధికారి జేడీ ప్రసాద్, మండల రెవెన్యూ అధికారి రోహిత్ దేశ్‌పాండే, మండల పంచాయతీ అధికారి ప్రసాద్ హాజరయ్యారు. వీరితో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల నుంచి సమస్యలను స్వీకరించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ప్రజా పాలన కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అధికారులు కృషి చేస్తున్నారు.

# ముదిగొండ మండల రైతులకు వరి సన్న రకాల నమోదు, డిజిటల్ క్రాప్ సర్వే



**ముదిగొండ ఆగస్టు 24 ప్రజావాణి ప్రతినిది** ముదిగొండ మండలంలోని రైతు సోదరులందరూ సెప్టెంబర్ 10వ తేదీ లోపు వరి సన్న రకాల వివరాలను ఆన్‌లైన్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు (7 రకాలు) సంబంధిత డీలర్ల వద్దే ఆన్‌లైన్ చేయించుకోవాలని, బయట కొనుగోలు చేసిన రైతులు ఏఈవో ల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. దీనికి రైతులు తమ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, విత్తనాల బిల్లు మరియు బాండ్ పేపర్‌ను వెంట తీసుకురావాల్సి ఉంటుంది.అలాగే మండలంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. వానాకాలం పంటలు వేసిన రైతులు తమ వివరాలను వాలంటీర్లకు తెలియజేసి నమోదు చేయించుకోవాలి. ఈ ప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. పంట సాగు వివరాలను భవిష్యత్తులో ధాన్యం సేకరణ ప్రక్రియతో అనుసంధానం చేయనున్నారు కాబట్టి, రైతులు తమ పంట వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవడం ఎంతో ముఖ్యం. కావున రైతులు అందుబాటులో ఉండి డిజిటల్ క్రాప్ సర్వే ద్వారా తమ వివరాలను వాలంటీర్ల వద్ద నమోదు చేసుకుని సరిచూసుకోవాలని ఏవో సరిత కోరారు.

# శక్తి పాలసీని వెనక్కు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం ఎస్ఎఫ్ఐ

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజగోపాలపేట పాలిటెక్నిక్ కాలేజ్ ఎదుట నిరాహార దీక్ష



**ప్రజావాణి,నంగునూరు,ఆగస్టు 24:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజగోపాల్పేట్ పాలిటెక్నిక్ ఎదుట నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది ఈ దీక్షలో ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల రంజిత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న 97 జీవోను రద్దు చెయ్యాలని శక్తిపాలిసిన వెనక్కి తీసుకోవాలని వారు తెలిపారు ఇది తీసుకొస్తున్న శక్తి పాలసీలో పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను తొలగించే విధంగా ఉన్నదాన్ని బీటెక్ ఈపాస్ ద్వారా ఎంట్రెన్స్ రావాల్సింది ఇక్కడికి ఆగిపోతుందని వారు తెలిపారు విద్యార్థులకు ఇష్టం లేని శక్తి పాలసీని ఎందుకు తీసుకొస్తున్నారని దీని వల్ల వచ్చే లాభాలు కన్నా వచ్చే నష్టాలు ఎక్కువ ఉన్నాయని దీనివల్ల ఎగ్ ఇండియా స్కూల్ యూనివర్సిటీలో ఐటిఐ ఐటిసి తో కలపడం సరైన పద్ధతి కాదని వారు తెలిపారు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి తీసుకువచ్చిన శక్తి పాలసీని జీవో నెంబర్ 97 ని రద్దు చేయాలని లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి చెప్యల సంతోష్ జిల్లా నాయకులు సత్యవీర్ సాయి శంకర్ పృథ్వీరాజ్ సాయికుమార్ మణిదీప్ సాత్విక్ విద్యార్థులు పాల్గొన్నారు

# షాబాద్ మండల అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో.ఐదు దరఖాస్తుల స్వీకరణ....

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 24, ప్రజావాణి,** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల అభివృద్ధి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి. క్రమంలో మండల ప్రజల నుంచి ఐదు దరఖాస్తులు స్వీకరించినట్లు షాబాద్ మండల అభివృద్ధి అధికారి అపర్ణ. ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించినదరఖాస్తు 4. పంచాయితీ శాఖకు సంబంధించినవి.01. మొత్తం ఐదు దరఖాస్తులు స్వీకరించినట్లు షాబాద్ మండల అభివృద్ధి అధికారి అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని గరిష్టంగా 30 రోజుల్లోగా సాధ్యమైనంత త్వరగా పరిశీలించాలని ఆయా సంబంధిత శాఖఅధికారులను ఆమె ఆదేశించారు. దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు రసీదులు కూడా అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి అపర్ణ. షాబాద్ డిప్యూటీ తాసిల్దార్ రవికుమార్. మండల పంచాయత్ అధికారి. నాసరయ్య. మండల విద్యుత్ ఏఈ. పి ఆర్ ఏ ఈ. ఇరిగేషన్. మెడికల్ ఆఫీసర్లు. పశుసంవర్ధక శాఖ. ఏఈ హౌసింగ్. బీసీ ఎస్సీ వార్డెన్లు మండల ఏఈలు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు మండల కార్యాలయ సిబ్బంది ఆపరేటర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# టేక్మాల్ చెరువు కట్ట భద్రతపై క్షణ క్షణం భయం భయం!



**టేక్మాల్ ఆగస్టు 24: (మన ప్రజావాణి)** టేక్మాల్ గ్రామంలోని పెద్ద చెరువు కట్టకు వరద నీటి ఉధృతి కారణంగా కోతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతోంది. భారీ వర్షాలతో చెరువులోకి నీటి ప్రవాహం పెరగడంతో కట్ట పలు ప్రాంతాల్లో దెబ్బతింటూ, మట్టి కొట్టుకుపోతోంది. దీంతో కట్టకు మరింత నష్టం జరిగితే చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పెద్ద చెరువు కట్ట పరిస్థితిపై గతంలో పలుమార్లు వార్త కథనాలు ప్రచురితమైనప్పటికీ గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం ముంచుకొచ్చే వరకు అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదని స్థానికులు అంటున్నారు.కట్ట బలహీనంగా మారిన ప్రాంతాల్లో వెంటనే రక్షణ చర్యలు చేపట్టి, అవసరమైన చోట మట్టితో పాటు రాళ్లను ఏర్పాటు చేసి కట్టను పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే చెరువు కట్టను అధికారులు స్వయంగా పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రమాదం జరిగిన తర్వాత స్పందించకుండా, ముందుగానే చర్యలు తీసుకోవాలని టేక్మాల్ గ్రామ ప్రజలు సర్పంచ్, అధికారులను కోరుతున్నారు.

# ప్రజావాణి అర్జీలకు సత్వర పరిష్కారం అందించాలి

- జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు.





**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-** ప్రజావాణి కార్యక్రమంలో అర్జీదారులు అందించిన దరఖాస్తులకు సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు.సోమవారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఓసి)లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు,జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్ రావు లతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 44 దరఖాస్తులు రాగా, వాటిలో భూమికి సంబంధించినవి 15, ఇందిరమ్మ ఇండ్లకు 4, పెన్షన్లకు 7, ఇతర శాఖలకు సంబంధించినవి 18 దరఖాస్తులు అందాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవి కుమార్, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె పచ్చ బడింది.. రేపటి తరం నిచ్చెనై నిలిచింది!

- ఎల్నినో ఎడారి సవాళ్లకు ఉప్పరపల్లి పచ్చని సమాధానం!
- కోట్ల ఆస్తులు కాదు .. పీల్చే ప్రాణవాయువే నిజమైన వారసత్వం... సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి సంకల్పం.





**కేసముద్రం ఆగస్టు 24,ప్రజావాణి.** పొగచూరిన నగరాలు కాదు.. కాంక్రీట్ జంగిళ్లు అంతకన్నా కాదు.. రేపటి తరం బ్రతకాలంటే పల్లె టూరి పచ్చని చెట్లే పరమార్థమని నిరూపిస్తోంది కేసముద్రం మండలంలోని ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ. భూగోళం వేడెక్కుతోంది, 'ఎల్నినో' శాపంతో కరవు మేఘాలు కమ్మేస్తున్నాయి అని మేధావులు ఏసీ గదుల్లో కూర్చుని సెమినార్లు పెడుతుంటే.. ఈ పల్లె జనం మాత్రం చేతులు ముడుచుకుని కూర్చోలేదు. ఆకాశానికి పచ్చని తోరణం కట్టి, వర్షదేవుణ్ణి సాదరంగా ఆహ్వానించేందుకు నడుం బిగించింది. గ్రామ సర్పంచ్ ఏర్పుల సునీత కుమారస్వామి సారథ్యంలో సాగిన మొక్కల పండుగ.. కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా మిగిలిపోలేదు, అది ప్రతి ఒక్కరి గుండెను తాకిన ఒక సామాజిక యజ్ఞంగా మారింది!

**బ్యాంక్ బ్యాలెన్స్ కాదు.. ఆక్సిజన్ బ్యాంకులు కావాలి!**

మన పిల్లలకు బ్యాంక్ బ్యాలెన్స్‌లు, మేడలు, మిద్దెలు ఆస్తులుగా ఇవ్వడం కాదు.. వారు పీల్చడానికి కాస్త ప్రాణవాయువును మిగల్చడమే నిజమైన వారసత్వం అంటూ సర్పంచ్ సునీత కుమారస్వామి చెప్పిన మాటలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేశాయి. గ్లోబల్ వార్మింగ్ ఉచ్చులో చిక్కుకున్న భూమిని కాపాడుకోవడానికి, ఉష్ణోగ్రతలను తగ్గించి మేఘాలను కరిగించడానికి వృక్షజాతిని పెంచడమే ఏకైక శరణ్యమని ఆమె తేల్చి చెప్పారు.

**ఒకే బాట.. ఒకే మాట..కదిలిన పల్లె సైన్యం!**

ఈ పచ్చని సంకల్పంలో సర్పంచ్‌కు తోడుగా ఉపసర్పంచ్ ఆవుల ఐలయ్య, వార్డు సభ్యులు జెనిగల అనిల్ కుమార్, కంచ రాజు కుమార్, తండ సంపత్ కుమార్, మంద ప్రవీణ్ లు సైనికుల్లా కదిలారు. ప్రభుత్వ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తూ టెక్నికల్ అసిస్టెంట్ మధు బాబు, ఫీల్డ్ అసిస్టెంట్ మంచాల కుమార్ లు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. వి బి జి రామ్ తో పాటు ఉపాధి హామీ కూలీల చెమట చుక్కలు నేలపై పడి, రేపటి పచ్చని చిగుళ్లకు జీవం పోశాయి.

**పక్క ఊర్లకు పాఠం.. ఉప్పరపల్లి ఒక దిక్సూచి!**

మొక్కలు నాటడం అంటే కేవలం గుంత తీసి మొక్క పెట్టడం కాదు, ఊరికి ఊరంతా కలిసి ఒక జీవాన్ని సృష్టించడం అని ఉప్పరపల్లి నిరూపించింది.

చుట్టుపక్కల గ్రామాలు కరవును చూసి భయపడుతుంటే, ఈ గ్రామం మాత్రం రేపటి పచ్చని విప్లవానికి పునాది వేసింది. ప్రతి పంచాయతీ ఇలాంటి ఒక దృఢ సంకల్పాన్ని ఆదర్శంగా తీసుకుంటే,రాబోయే రోజుల్లో కరవు అనే మాటే వినపడదు. ప్రకృతిని ప్రేమిస్తూ, సమాజానికి దిశానిర్దేశం చేస్తున్న ఉప్పరపల్లి గ్రామం నేడు తెలంగాణ పల్లెలకు ఒక దిక్సూచి, ఒక ఆదర్శం!

# ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి.
- ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.
- మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లకు నోటీసుల జారీ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి.
- జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి.






**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-** ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు.సోమవారం, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఆర్డీఓ కృష్ణవేణి తో కలిసి ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఆగస్టు 27న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనంలో, పట్టణ ప్రాంతాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని తెలిపారు. సంబంధిత బీఎల్ఓలు, చునావ్ పాఠశాల సభ్యులు సభల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణపై బీఎల్ఓల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సభల వద్ద ఫారం-6, ఫారం-7, ఫారం-8, తదితర అవసరమైన ఫారాలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు.గ్రామ, వార్డు సభల్లో బీఎల్ఓలు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలోని ఓటర్ల పేర్లను చదివి వినిపించాలని, జాబితాలో పేరు లేని అర్హత కలిగిన భారతీయ పౌరులను గుర్తించాలని సూచించారు.తేదీ.01.10.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఫారం-6తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన ఆధారాలను సమర్పించి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు (లేదా) ఇతర వివరాల్లో తప్పులు, వ్యత్యాసాలు ఉన్నట్లయితే ఫారం-8 ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు వివరించాలన్నారు. అర్హత లేకపోయినా జాబితాలో పేరు నమోదైన వారిని గుర్తించి, అదే నియోజకవర్గానికి చెందిన ఓటరు ఫారం-7 ద్వారా అభ్యంతరం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మ్యాపింగ్ కాని, అనామలీస్ గుర్తించిన ఓటర్లందరికీ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు. నోటీసు జారీ చేసిన తేదీకి, విచారణ తేదీకి మధ్య కనీసం 7 రోజుల వ్యవధి ఉండేలా చూడాలని సూచించారు.నోటీసులు అందజేసిన వివరాలను బీఎల్ఓ యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాలని తెలిపారు. విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. గ్రామ సభలు, వార్డు సభల నిర్వహణకు సంబంధించిన వివరాలను సక్రమంగా డాక్యుమెంటేషన్ చేసి, సభల ఫొటోలను బీఎల్ఓ రిజిస్టర్‌లో భద్రపరచాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ.. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, పూర్తి చేస్తున్నామని తెలిపారు.ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామ సభలు, వార్డు సభలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.ములుగు నియోజకవర్గం లో అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సూపరింటెండెంట్, ఎలక్షన్ వింగ్ ఎం.డి. సలీం ఉద్దీన్, నాయబ్ తహసీల్దార్ (ఎలక్షన్) ఎం. నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుంది

- ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి
- నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహారదీక్షలను విరమింపజేసినవొడితల ప్రణవ్
- అర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటాం







**జమ్మికుంట ఆగస్టు 24 (ప్రజావాణి)** ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు పెద్ద పీట వేస్తున్నామనిఅర్హులైన ప్రతి జర్నలిస్టును ఆదుకుంటామని వారి ఇళ్ల పట్టాలకు సంబంధించి పూర్తిస్థాయిలో సహకరిస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.హామీఇచ్చారుహుజురాబాద్ పట్టణం లోని అంబేద్కర్ కూడలిలో రిలే నిరాహారదీక్ష స్థలిని ప్రణవ్ సందర్శించారు.అనంతరం నిమ్మరసం ఇచ్చి రిలే నిరాహారదీక్షలను విరమింపజేశారుఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అసంపూర్తిగా ఇచ్చిన పట్టాలను మరల న్యాయపరమైన ఇబ్బందులు కలగకుండా చూస్తామని జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసినికౌన్సిలర్లు పట్టణమండల అధ్యక్షులుకాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# నంగునూరు మండలంలో యథేచ్ఛగా బెల్ట్‌షాపులు

- గ్రామాల్లో పుట్టగొ డుగుల్లా వెలుస్తున్న అక్రమ మద్యం విక్రయ కేంద్రాలు
- అధికారుల పర్యవేక్షణపై ప్రజల ప్రశ్నలు





**ప్రజావాణి,నంగునూరు, ఆగస్టు 24:**నంగునూరు మండలంలో బెల్ట్‌షాపులు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, గ్రామాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ మద్యం విక్రయ కేంద్రాలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని నంగునూరు గ్రామానికి చెందిన రాగుల కనకయ్య ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సోమవారం నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ఈ అంశాన్ని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని పలు గ్రామాల్లో అనధికారికంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని కనకయ్య ఆరోపించారు. ఎలాంటి నియంత్రణ లేకుండా మద్యం విక్రయాలు సాగుతుండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మద్యం కొనుగోలు చేసే వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారని, దీంతో వారి జేబులు గుల్ల అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో బెల్ట్‌షాపులు పెరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు సమర్థవంతంగా పర్యవేక్షించడం లేదనే భావన ప్రజల్లో నెలకొందని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, మండలంలోని బెల్ట్‌షాపులపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు. బెల్ట్‌షాపుల నిర్వహణకు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లయితే వాటిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కనకయ్య డిమాండ్ చేశారు. గ్రామాల్లో మద్యం విక్రయాలపై నిరంతర తనిఖీలు నిర్వహించి, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేంద్రాలను గుర్తించాలని కోరారు. అధికారులు కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే స్పందించకుండా, ముందస్తు పర్యవేక్షణతో అక్రమ మద్యం విక్రయాలను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. బెల్ట్‌షాపుల వ్యవహారంపై ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే మండలంలోని మద్యం విక్రయాలపై స్పష్టత వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**ప్రజావాణిలో దరఖాస్తులు**

నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 9 దరఖాస్తులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 5, హౌసింగ్ శాఖకు 2, పంచాయతీరాజ్ శాఖకు 1, ఎక్సైజ్ శాఖకు 1 దరఖాస్తు వచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తామని, నిర్ణీత గడువులోపు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామని, గ్రామాల్లో ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇదిలా ఉండగా, కొండంరాజుపల్లి గ్రామంలో జనావాసాల మధ్య గొర్రెల పాకల ఏర్పాటుపై తిరుపతి అనే గ్రామస్తుడు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దుర్వాసన, ఈగలు, దోమల కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో బెల్ట్‌షాపుల వ్యవహారం, గ్రామాల్లో పారిశుద్ధ్యం, ప్రజారోగ్య సమస్యలపై సంబంధిత శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఎక్సైజ్ అధికారులు నంగునూరు మండలంలోని గ్రామాల్లో మద్యం విక్రయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ వినిపిస్తోంది.

# మహిమాన్విత క్షేత్రాన్ని అభివృద్ధి చేయండి

- వేద పండితులు రామాదశి శ్రీపాదశర్మ





**ప్రజావాణి -నంగునూరు ఆగస్టు 24:**హనుమాన్, గరుత్మంతుని విగ్రహాలు ఒకే రాతిపై వెలసిన మహిమాన్వితమైన చింతగుట్ట హనుమాన్ దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని వేద పండితులు రామాదశి శ్రీపాదశర్మ ఆలయ కమిటి చైర్మన్ రవీంద్ర ప్రసాద్ కు సూచించారు. తిమ్మాయిపల్లి లోని పురాతనమైన గరుడాంజనేయ దేవాలయాన్ని సోమవారం శ్రీపాదశర్మ సందర్శించారు. ఆలయ సమీపంలోని బండపై వెలసిన పాద గుర్తులు, స్వామి వారి విగ్రహాలు, 74 అడుగుల గరుడ, హనుమాన్, నరసింహ స్వామి విగ్రహాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగమశాస్త్రం ప్రకారం సుమారుగా రెండు వేల సంవత్సరాల కిందట మహానీయులు ఈప్రాంతంలో తపస్సు చేసినట్టుగా తెలుస్తోందన్నారు. చింతచెట్టు కింద స్వామివారు వెలవడంతో చింతగుట్ట హనుమాన్ పేరు వచ్చిందని. ఎంతో పవిత్రమైన ఈ ఆలయానికి ఘణ చరిత్ర ఉందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా వెలసిన పురాతన ఆలయ చరిత్రను పరిశీలించి వాస్తవాలు వెలికి తీయాలన్నారు. వేదమూర్తులు బ్రహ్మశ్రీ జంధ్యాల రాజేశ్వరశాస్త్రి ఆదేశాను సారం అహోరాత్ర సర్ప సూక్ష గరుడ మహాసూక్త యాగం నిర్వహిస్తామన్నారు.

# బీజేపీ సహకార విభాగం కో-కన్వీనర్‌గా వేముల రత్నాకర్ రెడ్డి



**ప్రజావాణి,నంగునూరు, ఆగస్టు 24:**సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామానికి చెందిన వేముల రత్నాకర్ రెడ్డిని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సహకార విభాగం కో-కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీపై ఉన్న నమ్మకం, సహకార రంగంలో ఆయనకు ఉన్న అనుభవం, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ బాధ్యత అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సహకార రంగంలో రైతులు, పాడి రైతులు, స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ ప్రజలకు సంబంధించిన అంశాలపై అవగాహన పెంచడంతో పాటు వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సహకార విభాగం కీలక పాత్ర పోషించనుంది. కో-కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సహకార రంగంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల అభివృద్ధి, రైతుల సమస్యలు, సహకార రంగం ద్వారా ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని సహకార విభాగాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. రత్నాకర్ రెడ్డికి కొత్త బాధ్యతలు లభించడంపై నంగునూరు మండలానికి చెందిన బీజేపీ నేతలతో పాటు బద్దిపడగ గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నియామకం పట్ల అభినందనలు తెలుపుతూ, సహకార విభాగాన్ని మండల స్థాయిలో మరింత క్రియాశీలంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి మంచి పేరు తీసుకురావాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రత్నాకర్ రెడ్డి మాట్లాడుతూ తనను బీజేపీ సహకార విభాగం జిల్లా కో కన్వీనర్ గా నియమించిన మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన రావు, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు తన నియామకానికి సహకరించిన మండల బీజేపీ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. వారి నమ్మకానికి అనుగుణంగా బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# నకిలీ ఆర్ఓఆర్ సర్టిఫికెట్లపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్

- రెవెన్యూ రికార్డుల్లో ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై ఉన్నతస్థాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు
- కోరపల్లి భూ వివాదంలో కలెక్టర్‌కు బోయిని లావణ్య ఫిర్యాదు







**జమ్మికుంటఆగస్ట్ 24 (ప్రజావాణి)** జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలో నకిలీ ఆర్.ఓ.ఆర్./703/2011, 13(బి), 13(సి) సర్టిఫికెట్లు సృష్టించడంతో పాటు రెవెన్యూ రికార్డుల్లో ట్యాంపరింగ్‌కు పాల్పడిన వారిపై ఉన్నతస్థాయి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ వెంకటేశ్వరపల్లికి చెందిన బోయిని లావణ్య జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.కోరపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 553/ఎలో 4-32 గుంటల భూమిని తాను కొనుగోలు చేశానని, తన పేరుపై మ్యూటేషన్ కోసం ధరణిలో స్లాట్ బుక్ చేసుకున్నప్పటికీ దరఖాస్తు పెండింగ్‌లో ఉందని లావణ్య పేర్కొన్నారు. ఇదే భూమిని మరికొందరు రైతుల భూములతో కలిపి కాజేయాలనే ఉద్దేశంతో గిరబోయిన శ్రీనివాస్, గిరబోయిన కొమురయ్య పేర్లతో నకిలీ ఆర్.ఓ.ఆర్. డాక్యుమెంట్లు సృష్టించారని ఆమె ఆరోపించారు. ఆర్.ఓ.ఆర్./ 703/2011, 13(బి), 13(సి)కు సంబంధించిన వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా జమ్మికుంట తహశీల్దార్ కార్యాలయం నుంచి అందిన సమాచారంలో పలు అనుమానా స్పద అంశాలు వెలుగులోకి వచ్చాయని లావణ్య తెలిపారు. ముఖ్యంగా 2011 సెప్టెంబర్ 5న జారీ అయినట్లు పేర్కొంటున్న పత్రంపై సంతకం చేసిన తహశీల్దార్ కె. భాస్కర్‌రావు ఆ సమయంలో జమ్మికుంట తహశీల్దార్‌గా పనిచేయలేదని ఆ కాలంలో జి. శంకరయ్య తహశీల్దార్‌గా విధులు నిర్వహించినట్లు రికార్డుల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు.అలాగే కోరపల్లి గ్రామ పహాణీ 1-బి రికార్డుల్లో మార్పులు చేర్పులు జరిగినట్లు అనుమానాలున్నాయని సంబంధిత అసలు రికార్డులను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని కలెక్టర్‌ను కోరారు గతంలో కూడా ఈ అంశంపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమగ్రంగా విచారణ జరగలేదని ఆమె పేర్కొన్నారు.ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం, తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. హైకోర్టు పరిణామాల నేపథ్యంలో జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో గిరబోయిన శ్రీనివాస్, గిరబోయిన కొమురయ్య తదితరులపై ఎఫ్ఐఆర్ నెం. 299/2026, తేదీ 22-07-2026న కేసు నమోదు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.నకిలీ ఆర్.ఓ.ఆర్. పత్రాలను రద్దు చేసి రెవెన్యూ రికార్డుల్లోని తప్పులను సరిచేయడంతో పాటు ట్యాంపరింగ్‌కు పాల్పడిన ప్రభుత్వ, శాఖాపరమైన బాధ్యులపై కూడా క్రిమినల్ శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బోయిని లావణ్య కలెక్టర్‌ను కోరారు. ఈ ఫిర్యాదు ప్రతులను కరీంనగర్ పోలీస్ కమిషనర్ హుజురాబాద్ ఆర్డీవో ఏసీపీ జమ్మికుంట తహశీల్దార్ జమ్మికుంట టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌లకు అందజేశారు.

# మౌళిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- రూ. 2.89 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభం
- రెండు గ్రామాల కల నెరవేరిందన్న సర్పంచ్ సందెల సుజాత
- హాజరైన మాజీ డీసీసీ అధ్యక్షురాలు, ఆర్టీఏ మెంబర్





**ప్రజావాణి న్యూస్ లక్షెట్టిపేట్, ఆగష్టు 24 ::-** గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని కొత్త కొమ్ముగూడెం సర్పంచ్ సందెల సుజాత అన్నారు. సోమవారం మండలంలోని కొత్త కొమ్ముగూడెం నుంచి దౌడపల్లి వరకు సుమారు రూ 2.89 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న బీటీ, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, ఆర్టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ రెండు గ్రామాల మధ్య సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో కొత్త కొమ్ముగూడెం, దౌడపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రోడ్లు ఎంతో కీలకమని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. అదే విధంగా మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖమ్మ సహకారంతో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని తెలిపారు. అనంతరం సురేఖమ్మను శాలువాతో సర్పంచ్ దంపతులు సందేల సుజాత -సురేష్ లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు,సర్పంచ్ నలిమెల రాజు, పట్టణ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, జిల్లా ఆర్టీపీఆర్ఎస్ అధ్యక్షులు గడ్డం త్రిమూర్తి, మండల వైస్ ప్రెసిడెంట్ కందుల మోహన్, జిల్లా నాయకులు పూర్ణచంద్రరావు, బియ్యాల తిరుపతి, మండల మాజీ అధ్యక్షులు పింగిలి రమేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, ఉప సర్పంచ్ బొప్పు సుమన్ , కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మేదర కులస్తులకు ఆసరా పింఛన్ వర్తింప చేయాలి



**రాయికల్;ఆగస్టు 24 (ప్రజావాణి) :**తరతరాలుగా వెదురు వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న మేదర (మహేంద్ర) కులం నేడు అస్తిత్వ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని,ప్లాస్టిక్ దెబ్బకు వృత్తి కుదేలవ్వడంతో పూట గడవడమే భారంగా మారిందని, ప్రభుత్వం ఆసరా పింఛన్ వర్తింపజేసి ఆదుకోవాలని రాయికల్ మండల మహేంద్ర సంఘం అధ్యక్షులు సిలివేరి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం రాయికల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో నోడల్ అధికారి,ఎంపీడీవో బింగి చిరంజీవికి ఆయన వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేము బీసీ-ఏ కేటగిరీలో అత్యంత వెనుకబడిన వారమని,మా తాత ముత్తాతల కాలం నుండి వెదురుతో బుట్టలు, గంపలు, చాటలు, తడకలు, పండుగలకు కావాల్సిన అలంకరణ సామాగ్రి తయారు చేస్తూ, వాటిని నెత్తిన పెట్టుకొని గ్రామ గ్రామాన తిరుగుతూ అమ్ముకుంటూ జీవిస్తున్నామని అన్నారు. ఇది కేవలం వృత్తి కాదు, పర్యావరణాన్ని కాపాడే చేతి వృత్తి అని,కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, మార్కెట్లోకి ప్లాస్టిక్, స్టీల్, ఫైబర్ వస్తువులు వచ్చాక మా చేతితో చేసిన వస్తువులను ఎవరూ కొనడం లేదని, నేడు రోజుకు రూ.100-150 కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.పైగా అటవీ చట్టాలు కఠినతరం కావడంతో వెదురు కోసం 15-20 కిలోమీటర్లు అడవిలోకి కాలినడకన వెళ్లాలని,అటవీ అధికారుల భయం ఒకవైపు, వయసు పైబడిన వృద్ధులు ఆ బరువును మోసుకురావడం మరోవైపు నరకంగా మారిందని వాపోయారు.మాలో 45 ఏళ్లు దాటిన వారెవరూ కష్టం చేసే స్థితిలో లేరని,వికలాంగులు, ఒంటరి మహిళల పరిస్థితి మరీ దయనీయంగా మారిందని, పిల్లల చదువులు,ఆస్పత్రి ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తోందని,రాష్ట్ర ప్రభుత్వం గౌడన్నలకు, చేనేత సోదరులకు 50 ఏళ్లకే రూ.2016 ఆసరా పింఛన్ ఇచ్చి ఆదుకుంటోందని, అదే తరహాలో కనుమరుగవుతున్న మా మేదర కుల వృత్తిని కూడా గుర్తించి, మాకు కూడా ఆసరా పింఛన్ వర్తింపజేయాలి" అని ఆయన కోరారు.తమ వినతిని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శనిగరపు రాజనర్సయ్య, ప్రమోద్, రంజిత్, చింత రాజేశం, నర్సయ్య, సిలివేరి ప్రశాంత్, శ్రీనివాస్,పిల్లి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

# ఇనుగుర్తి ప్రజావాణికి మూడు దరఖాస్తులు



**ప్రజావాణి,ఇనుగుర్తి:**ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారం వారం మండల స్థాయిలో ప్రవేశపెట్టిన ప్రజావాణి కొనసాగుతోంది. మండల కేంద్రం ఇనుగుర్తి లోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణిలో తహసిల్దార్ సుంకరి శ్రీనివాసులు,ఎంపీడీవో బండారి పార్థసారధి పాల్గొని ప్రజలు తమ సమస్యలపై సమర్పించిన వినతులను స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై రెండు దరఖాస్తులు రాగా,స్థానిక పిహెచ్సిలో రక్త పరీక్షలకు కావలసిన వైద్య పరికరం గురించి మరో వినతి అందినట్లు తెలిపారు. ప్రజావాణిలో పలు శాఖలకు చెందిన అధికారులు ఒకే వేదికపై చేరినందున సమస్యలు పరిష్కరించడానికి మార్గం సుగమమవుతుందని మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి దృష్టికి తీసుకువచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పసరలో ఆటో యూనియన్ ఆందోళన



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పసర చౌరస్తా మేడారం ఆర్చ్ వద్ద సోమవారం ఆటో కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు.మండల మ్యాజిక్ యూనియన్ అధ్యక్షుడు వాసం వేణు శంకర్ ఆధ్వర్యంలో సమ్మక్క సారక్క ఆటో మ్యాజిక్ యూనియన్ ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు వేణు శంకర్ మాట్లాడుతూ, ఫ్రీ బస్సుల వల్ల ఆటోల్లో ఎవరూ ఎక్కడం లేదని, దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఆటోలకు కట్టిన ఫైనాన్స్ కట్టలేకపోతున్నామని, ఫైనాన్స్ వారు ప్రతిరోజూ ఇంటికి వచ్చి వేధిస్తున్నారని వాపోయారు. పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు భరించడం కష్టంగా మారిందని కన్నీటి పర్యంతమయ్యారు.ఒక వర్గానికి మేలు చేస్తూ మరో వర్గాన్ని ఇబ్బంది పెట్టడం సరికాదని, ప్రభుత్వం తమను కూడా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ప్రత్యేక భృతి కల్పించాలి, లేదా ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని కోరారు.ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ సభ్యులు రహీం, సతీష్, మోహన్, అశోక్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ

మంగళవారం, ఆగస్టు 25, 2026



# మండల కేంద్రంలో ప్యాక్స్ ఏర్పాటు చేయాలి

- ఎంపీడీవోకు కొత్తపేట సర్పంచ్ మహేందర్ రెడ్డి వినతి




**జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్, ఎండపల్లి ఆగస్టు 24 (ప్రజావాణి):** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల కేంద్రంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం (ఎఫ్ పిఓ) ఆధారిత ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని (ప్యాక్స్) తక్షణమే ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రజావాణిలో సోమవారం రోజున కొత్తపేట సర్పంచ్ జీ రెడ్డి మహేందర్ రెడ్డి స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)కి వినతి పత్రం సమర్పించారు. మండలంలో వ్యవసాయ రంగ విస్తృతిని, రైతాంగ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ సంఘాన్ని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా సర్పంచ్ వివరించారు. ఎండపల్లి మండల పరిధిలోని రైతులకు సహకార రంగాన్ని మరింత చేరువ చేయడం ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సమయానికి, సబ్సిడీ ధరలకే నేరుగా అందుబాటులోకి వస్తాయని పంట రుణాల మంజూరు ప్రక్రియ సులభతరమై, దళారుల బారిన పడకుండా రైతులు కాపాడుకోబడతారని, సకాలంలో మద్దతు ధరతో కూడిన ధాన్యం కొనుగోలు కేంద్రాల సేవలు ప్రత్యక్షంగా లాభతరం జరుగుతుందని వివరించారు. పంట ఉత్పత్తుల గ్రేడింగ్, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలు మెరుగవుతాయని, స్వయం సమృద్ధి పెరిగి రైతులకు ఆర్థిక స్థిరత్వం లభిస్తుందని, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, మండలంలో వ్యవసాయ ఆధారిత అనుబంధ రంగాలు పరోక్షంగా బలోపేతమవుతాయని చెప్పుకొచ్చారు. ఎండపల్లి మండల రైతాంగానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మేలు చేకూర్చే ఈ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన సొసైటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రైతు బీమా కొనసాగింపుపై కలెక్టర్‌కు వినతిపత్రం

- రైతు రక్షణ సమితి అధ్యక్షులు హింగే భాస్కర్,వరికిల కిషన్‌రావు



**ఎల్కతుర్తి ప్రజావాణి న్యూస్:-** రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న రైతు బీమా పథకాన్ని ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించాలని కోరుతూ తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి నాయకులు మాట్లాడుతూ రైతు కుటుంబంలో ప్రధాన ఆధారమైన వ్యక్తి ప్రమాదవశాత్తు మరణించినప్పుడు రైతు బీమా పథకం ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు. అయితే పథకం కొనసాగింపుపై రైతుల్లో ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతు బీమా పథకాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయకుండా కొనసాగించాలని, ప్రభుత్వం చెల్లించాల్సిన బీమా ప్రీమియాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ నిరంతరాయంగా బీమా రక్షణ కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న బీమా క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలని కోరారు. బీమా సొమ్ము అందడంలో జాప్యం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు రైతుల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ప్రభుత్వం అధికారికంగా స్పష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు బీమా పథకం రైతు కుటుంబాలకు కష్టకాలంలో రక్షణ కవచంగా నిలుస్తోందని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించి రైతులకు భరోసా కల్పించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికిల కిషన్‌రావు, ఉపాధ్యక్షులు రామారావు, సుకినే సుధాకర్, సురావు బాబురావు, వాంకే రాజు, కోక్కు తిరుపతి, అంబిరి శీను, ఎర్రబెల్లి రవీందర్‌రావు, మాధవరావు, గుండ సత్యనారాయణ, నర్సింగారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లంతకుంట మండలంలో నూతన ఎస్సై ఉపేంద్ర చారి గారికి MRPS మరియు అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు

- ఇల్లంతకుంట మండల ఏం ఆర్ పి ఎస్ అధ్యక్షులు మంద రాజు
- అంబేద్కర్ సంఘ అధ్యక్షులు తడక భూమయ్య ఆధ్వర్యంలో సత్కారం



**ఇల్లంతకుంట/ ప్రజావాణి** ఇల్లంతకుంట మండల పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్ర చారి సార్ గారిని ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వీ=రూ నాయకులు మాట్లాడుతూ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఉపేందర్ సార్ గారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ఉపేందర్ సార్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీ=రూ ఉపాధ్యక్షులు సురేష్, రాష్ట్ర నాయకులు గుండ్రటి రాజు , మండల సీనియర్ నాయకులు , మచ్చ రాజలింగం, కాసుపాక శంకర్, జేరిపోతుల అనిల్, ఎల్లయ్య, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్మూర్‌లో రెండు పడక గదుల ఇళ్లు/ఇందిరమ్మ ఇళ్లకు మరోసారి దరఖాస్తుల ఆహ్వానం



**ఆర్మూర్ టౌన్ ఆగస్టు 24(మన సమగ్ర ప్రజావాణి):** ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో దరఖాస్తు చేసుకోలేని అర్హులైన పేదలకు మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ నెల 22న తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి నిర్వహించిన సమావేశంలో గతంలో దరఖాస్తు చేసుకోలేని వారికి మరో అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోలేని వారు మాత్రమే ఆగస్టు 25 నుంచి 31వ తేదీ వరకు ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు: దరఖాస్తు పత్రం, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల ప్రతులు, ఆహార భద్రతా కార్డు ప్రతులు, ఓటరు గుర్తింపు కార్డు ప్రతులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులో దరఖాస్తులు సమర్పించాలని తహసీల్దార్ కోరారు.

# గిరిజనుల హక్కులను కాపాడుతూ.. అటవీని సంరక్షించాలి...

- అంబాసత్రం భూమిని గుర్తించి, 15 రోజుల్లో స్పష్టతకు చర్యలు..
- అటవీ--రెవెన్యూ భూ సమస్యలకు సమగ్ర సర్వేతో పరిష్కారం చూపాలి.
- జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్








**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (24 ఆగస్టు 26):** లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టి పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కూనారం గ్రామంలో అటవీ--రెవెన్యూ భూములకు సంబంధించిన సమస్యలపై జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం రోజు జాతీయ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ క్షేత్రస్థాయిలో పర్యటించి భూ పరిస్థితులను పరిశీలించారు. అనంతరం గిరిజనులు, స్థానిక ప్రజలు, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులతో పబ్లిక్ హియరింగ్ నిర్వహించి సమస్యకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాటోత్ హుస్సేన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి వాస్తవాలను పరిశీలించకుండా, భూ సమస్యలపై తుది నిర్ణయానికి రావడం సరికాదన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల రికార్డులు, వాదనల్లో భిన్నతలు ఉన్న నేపథ్యంలో గతంలో నిర్వహించిన సర్వేలు, జాయింట్ సర్వే నివేదికలు, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని సూచించారు. పాత సర్వేకు, తాజా జాయింట్ సర్వేకు మధ్య తేడాలు ఎందుకు వచ్చాయో స్పష్టంగా తేల్చాలన్నారు. అంబాసత్రం భూమికి సంబంధించిన అంశంపై కూడా స్పష్టత తీసుకురావాలని కమిషన్ సభ్యులు సూచించారు. గతంలో సుమారు 250 ఎకరాలకు పైగా అంబాసత్రం భూమి ఉన్నట్లు అధికారులు విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుతం ఆ భూమి రికార్డుల్లో స్పష్టంగా కనిపించకపోవడానికి కారణాలను పరిశీలించాలన్నారు. అంబాసత్రం భూమి ఎక్కడ ఉందో గుర్తించి, ఓవర్‌ల్యాప్ అయిన ప్రాంతాలను కూడా మరోసారి సమగ్రంగా సర్వే చేయాలని సూచించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లో ప్రాథమిక స్పష్టతకు చర్యలు తీసుకోవాలని కోరారు. జాయింట్ సర్వే ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని జాటోత్ హుస్సేన్ స్పష్టం చేశారు. సర్వే సమయంలో పిటిషనర్లు, సంబంధిత భూ హక్కుదారులు, గ్రామస్తులు, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల ప్రతినిధులు సమక్షంలో ప్రక్రియ నిర్వహించాలని, సంబంధిత వ్యక్తుల సంతకాలు, వాంగ్మూలాలు నమోదు చేయాలని సూచించారు. న్యాయస్థానాలకు నివేదికలు సమర్పించే సమయంలో సర్వే ప్రక్రియకు సంబంధించిన పూర్తి ఆధారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనుల జీవనోపాధి ప్రధానంగా భూమి, అడవులపైనే ఆధారపడి ఉంటుందని, వారి హక్కులను పరిరక్షిస్తూ అటవీ సంరక్షణకు చర్యలు చేపట్టాలని జాటోత్ హుస్సేన్ అన్నారు. అటవీ శాఖ అధికారులు గిరిజనులతో స్నేహపూర్వకంగా, సమన్వయంతో పనిచేయాలని, అటవీ సంరక్షణతో పాటు గిరిజనుల జీవనోపాధి, హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అర్హులైన గిరిజనులకు అటవీ హక్కుల చట్టం, ఇతర ప్రభుత్వ నిబంధనల ప్రకారం హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజనులకు భూ హక్కులు, ప్రభుత్వ పథకాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించడం అధికారుల బాధ్యత అన్నారు. నీరు, రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలతో పాటు వ్యవసాయం, ఉద్యాన పంటలు, కాఫీ, టీ తదితర ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలపై కూడా ప్రోత్సాహం అందించాలని సూచించారు. గిరిజనులపై అనవసరంగా కేసులు నమోదు చేయకుండా నిబంధనలను కచ్చితంగా పాటించాలని కమిషన్ సభ్యులు సూచించారు. అదే సమయంలో అటవీ సంరక్షణకు సంబంధించిన చట్టాలు, నిబంధనలను గిరిజనులకు అవగాహన కల్పించి, అటవీ నరికివేత వంటి చర్యలకు దూరంగా ఉండేలా చైతన్యం కల్పించాలని తెలిపారు. ప్రజలు కూడా అటవీ శాఖ అధికారులతో ఘర్షణలకు దూరంగా ఉండి, తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని సూచించారు. అటవీ శాఖ, గిరిజనుల మధ్య సోదరభావంతో కూడిన సంబంధాలతో అటవీని సంరక్షించడం ఎంత ముఖ్యమో, అటవీపై ఆధారపడి జీవించే గిరిజనుల జీవనోపాధిని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమన్నారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ కూనారం గ్రామానికి సంబంధించిన భూ సమస్యపై గతంలో నిర్వహించిన సర్వేలు, జాయింట్ సర్వే నివేదికలను పరిశీలించినట్లు తెలిపారు. జాయింట్ సర్వేకు ముందు, అనంతరం నిర్వహించిన సర్వే వివరాలతో పాటు రెవెన్యూ, అటవీ శాఖల వద్ద ఉన్న రికార్డులను సమగ్రంగా పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తహసీల్దార్, సర్వే అధికారులు, అటవీ శాఖ అధికారులు అందుబాటులో ఉన్న రికార్డులు, మ్యాపులు, సర్వే నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయి పరిస్థితులను కూడా పరిశీలించి తుది నిర్ధారణకు రావాలని కలెక్టర్ సూచించారు. పాత సర్వేలు, తాజా జాయింట్ సర్వే, రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేసి తుది నివేదిక రూపొందిస్తామని తెలిపారు. దమ్మపేట, కరకగూడెం, అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో కూడా ఇలాంటి అటవీ--రెవెన్యూ భూ సమస్యలు ఉన్నాయని కలెక్టర్ అన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే జాయింట్ సర్వే ప్రక్రియ ప్రారంభమైందని, వచ్చే ఆరు నుంచి ఏడు నెలల్లో ఆయా సమస్యలపై స్పష్టత వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కూనారం సమస్య చాలా కాలంగా కొనసాగుతున్నందున దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ కమిషన్ సభ్యులు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత ఫైళ్లు, రికార్డులను పరిశీలిస్తున్నామని తెలిపారు. జిల్లాలో సుమారు 60 శాతం వరకు అటవీ ప్రాంతం ఉందని, అటవీ సంరక్షణతో పాటు గిరిజనుల సంక్షేమానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 2.10 లక్షల ఎకరాలకు పైగా భూమిని పోడు భూమి కింద హక్కులు కల్పించినట్లు, సుమారు 13 వేల మంది గిరిజనులకు బోర్‌వెల్స్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అనేక ప్రాంతాల్లో పోడు భూములకు రహదారి సౌకర్యాలు కూడా కల్పించినట్లు వివరించారు. కూనారం సమస్యకు సంబంధించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, సర్వే, అటవీ శాఖలు, గ్రామ పాలనా సిబ్బందితో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈ కమిటీ 7 మార్చి 2026న నివేదిక సమర్పించిందని, అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా సంబంధిత భూమి అటవీ భూమిగా ఉన్నట్లు నివేదికలో తెలిపినట్లు వివరించారు. ప్రస్తుతం అంబాసత్రం భూమికి సంబంధించిన అంశం కూడా వెలుగులోకి వచ్చినందున, దీనిపై మరోసారి సమగ్రంగా పరిశీలించి రికార్డులు, చట్టపరమైన అంశాలు, జాయింట్ సర్వే ఫలితాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ కూనారం గ్రామంలోని భూ సమస్య గత ఐదారు సంవత్సరాలుగా కొనసాగుతోందన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని పోడు భూములకు ఇప్పటికే పట్టాలు మంజూరైనప్పటికీ, నిర్దిష్ట సర్వే నంబరుకు సంబంధించిన భూమి రెవెన్యూ పరిధిలోకి వస్తుందా లేదా అటవీ శాఖ పరిధిలోకి వస్తుందా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఈ ఏడాది కూడా సంబంధిత భూమిపై జాయింట్ సర్వే నిర్వహించినట్లు ఐటీడీఏ పీవో తెలిపారు. అయితే సర్వే అనంతరం కూడా కొన్ని అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తమవుతున్నందున జిల్లా కలెక్టర్, డీఎఫ్ఓతో చర్చించి సమగ్రంగా పరిశీలిస్తామని చెప్పారు. భూమి రెవెన్యూ భూమిగా నిర్ధారణ అయితే అందుకు అనుగుణంగా, అటవీ భూమిగా నిర్ధారణ అయితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామని తెలిపారు. సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనులకు ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. రెవెన్యూ, అటవీ, సర్వే, ఐటీడీఏ శాఖలు సమన్వయంతో పనిచేసి కూనారం భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తాయని తెలిపారు. ఈ పబ్లిక్ హియరింగ్‌లో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ శిరీష, రెవెన్యూ, అటవీ, సర్వే శాఖల అధికారులు, సర్వేయర్లు, గ్రామస్థులు, గిరిజనులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి

- మంగళవారం జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కలు నాటాలి.
- మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ








**భద్రాద్రి జిల్లా బ్యూరో మన ప్రజావాణి (24 ఆగస్టు 26):** వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రోజు వన మహోత్సవ కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో అనుకూల వాతావరణాన్ని సద్వినియోగం చేసుకొని విస్తృతంగా మొక్కలు నాటాలని తెలిపారు. మండలాలు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలకు స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేసి, మనుగడను పర్యవేక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలు నాటాలని సూచించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటడంతో పాటు అవసరమైన మొక్కలను సకాలంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ఖాళీ భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. వన మహోత్సవానికి విస్తృత ప్రచారం కల్పించి ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్ విద్యా చందన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వన మహోత్సవంలో అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి, జిల్లాకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఆర్డిఏ రవి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రామాపురం పాఠశాలలో విద్యార్థుల కోసం మోటారు ఏర్పాటు



**చిలుకూరు ఆగస్టు 24(ప్రజావాణి)::** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రామాపురంలో విద్యార్థుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రధానోపాధ్యాయిని ఎన్.జి. శివకుమారి ఆధ్వర్యంలో 60,000 రూపాయలతో బోరు వేయించి మోటారు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యం అందుబాటులోకి రావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన ఈ చర్య అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.వై.ఎల్.ఎన్. స్వామి, ఐ. రామాంజలి దేవి, చందా రాములు, డి. వెంకట్ రెడ్డి, ఎస్. అరుంధతి, ఎన్. పరిమళమ్మ, కె. వెంకన్న, కదిర బ్రహ్మారెడ్డి, ఏఏపీసీ చైర్మన్ రాయబారపు వెంకటరమణతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# క్షణిక ఆవేశంతో మామను హత్య చేసిన అల్లుడు

**జవహర్ నగర్ ఆగస్టు 24( ప్రజావాణి ప్రతినిధి)** శ్రీమతి లింగనోళ్ల అండాలు, భర్త: మొగిలి, వయస్సు: 44 సంవత్సరాలు, వృత్తి: గృహిణి, కులం: మాదిగ, నివాసం: సాయిబాబా కాలనీ, దొండతోట, జవహర్‌నగర్, కాప్రా మండలం, మేడ్చల్ జిల్లా, సెల్: 9581278711, ఆమె తెలిపిన ప్రకారం, సుమారు 30 సంవత్సరాల క్రితం మొగిలిని వివాహం చేసుకున్నదని, వారికి ముగ్గురు కుమార్తెలు ఉండగా, ముగ్గురికి వివాహాలు జరిగినవని తెలిపింది. పొరుగువారితో తరచుగా గొడవలు జరుగుతున్న కారణంగా, గత 10 సంవత్సరాలుగా తాను మరియు తన భర్త సాయిబాబా కాలనీలో నివసిస్తున్నట్లు తెలిపింది. గత 10 సంవత్సరాలుగా తాను క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు కూడా తెలిపింది.తేదీ 23.08.2026న దొండతోటలోని తన పెద్ద కుమార్తె ఇంటి వద్ద జరుగుతున్న బోనాల పండుగకు హాజరైన సమయంలో, తన భర్త మొగిలి సుమారు 18:00 గంటలకు



బయటకు వెళ్లి, రాత్రి సుమారు 20:00 గంటలకు ముఖంపై గాయాలతో తిరిగి వచ్చినట్లు తెలిపింది. పొరుగువారితో జరిగిన వాగ్వాదం కారణంగా వారు తనపై దాడి చేయడంతో గాయాలైనట్లు మొగిలి తెలిపినట్లు పేర్కొంది.ఆ తరువాత మొగిలి తన అల్లుడు శివతో గొడవకు దిగినట్లు తెలిపింది. ఈ క్రమంలో జరిగిన వాగ్వాదంలో మొగిలి కిటికీలను ధ్వంసం చేసి, విద్యుత్ వైర్‌ను తొలగించి, శివకు చెందిన మోటార్‌సైకిల్‌ను కూడా ధ్వంసం చేసినట్లు తెలిపింది. దీంతో కోపోద్రిక్తుడైన శివ ఒక సుత్తితో మొగిలి తలపై రెండుసార్లు బలంగా కొట్టగా, మొగిలి స్పృహ కోల్పోయినట్లు తెలిపింది. ఇతరులు జోక్యం చేసుకోవడంతో శివ అక్కడి నుండి పారిపోయినట్లు తెలిపింది.
వెంటనే ఫిర్యాదుదారు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మొగిలిని పరీక్షించి, అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు తెలిపింది.తన భర్త మొగిలిని తన అల్లుడు శివ సుత్తితో తలపై కొట్టి హత్య చేయడం వల్లనే మృతి సంభవించిందని ఫిర్యాదుదారు ఆరోపించింది. కావున, తన భర్త మరణానికి కారణమైన శివపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది.

# సారంపల్లి మల్లారెడ్డి ఆశయ సాధన కోసం ఉద్యమిద్దాం...!

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్.



**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** తెలంగాణ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అనేక రైతు ఉద్యమాలు నిర్వహించి. రైతాంగ సమస్యలపై. నీటిపారుదల సమస్యలపై. ప్రాజెక్టుల నిర్మాణం. ప్రపంచ వాణిజ్య ఒప్పందాలపై అనేక విశ్లేషణలు చేసి వ్యవసాయ రంగ అభివృద్ధికి నిరంతరం కృషి చేసిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి ఆయన ఈరోజు ఉదయం 3 గంటలకు నిమ్స్ హాస్పటల్లో అనారోగ్యంతో మరణించడం దురదృష్టకరమని రైతాంగానికి వ్యవసాయ కూలీలకు శ్రామిక ప్రజానీకానికి సిపిఎం పార్టీకి ఆయన మరణం తీరని లోటని మల్లారెడ్డి గారి ఆశయ సాధన కోసం సిపిఎం నిరంతరం కృషి కలుపుతుందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు.సోమవారం ఖమ్మం సుందరయ్య భవనంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన సారంపల్లి మల్లారెడ్డి సంతాప సభ జరిగింది ఈ సభలో పోతినేని .నున్న మాట్లాడుతూ సారంపల్లి మల్లారెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట తాలూకాలో రైతాంగ ఉద్యమాలలో చురుగా పాల్గొన్నారు డివిజన్ కార్యదర్శిగా 1973 ప్రాంతంలో పనిచేశారని భూస్వాములకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజానీకం కోసం రైతు కూలీల కోసం చిన్న సన్నకారు రైతుల హక్కుల కోసం ఉద్యమాలు చేపట్టారని అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నారని అన్నారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా అశేష కృషి చేశారని అనేక ఉద్యమాలు రైతాంగ పోరాట ఉద్యమాలు నిర్వహించారని అన్నారు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అంతర్జాతీయ జాతీయ ఆర్థిక రాజకీయ పరిస్థితులపై అనేక విశ్లేషణలు చేసి అమరికను సామ్రాజవాదుల దోపిడిని. ఐఎంఎఫ్ ప్రపంచ బ్యాంక్ ఒప్పందాల వల్ల భారతదేశానికి కలిగే నష్టాలను అనేక పత్రికల్లో వ్యాసాలు రాసేవారని అనేక టీవీ చానల్స్ లలో సమగ్రమైన విశ్లేషణ చేసి నా వ్యక్తి మల్లారెడ్డి అని అన్నారు. రాష్ట్ర నది జలాలపై సమగ్ర బుక్కును కూడా రచించారు. భారతదేశంపై సామ్రాజవాదులు విధిస్తున్న షరతులు. అమెరికా వాణిజ్య ఒప్పందాల వల్ల వ్యవసాయ రంగంపై కలిగే నష్టాలను విశ్లేషించి చెప్పేవారు. కేంద్ర రాష్ట్ర బడ్జెట్లు ప్రవేశపెట్టినప్పుడు ఆ బడ్జెట్లో రైతాంగానికి కేటాయించిన కేటాయింపులు సమగ్రంగా లేవని వ్యవసాయ రంగం అభివృద్ధి కావాలంటే కీలకంగా కేంద్ర రాష్ట్ర బడ్జెట్లో నిధులను ఎక్కువ కేటాయించాలని ప్రభుత్వ రంగం ఆధ్వర్యంలో విత్తన అభివృద్ధి జరగాలని. రైతాంగానికి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు పండించిన పంటలో సగభాగం ప్రభుత్వమే రైతాంగానికి చెల్లించాలని అనేక అంశాలను విశ్లేషించి చెప్పేవారు. రైతాంగ ఉద్యమంతో పాటు శ్రామిక వర్గాల హక్కులు. అన్ని వర్గాల ప్రజలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న తప్పుడు విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ నిర్వహించిన అనేక ఉద్యమాలలో కీలక పాత్ర వహించారు సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా అనేక సంవత్సరాలు కొనసాగారు. ప్రజా సంఘాల ఉద్యమాలలో పనిచేస్తున్న కార్యకర్తలకు రాజకీయ చైతన్యాన్ని కల్పిస్తూ అనేక సూచనలు సలహాలు అందించేవారు మల్లారెడ్డి గారికి ఆరోగ్యం సక్రమంగా లేకపోయినా సిపిఎం పార్టీ పనిలో రైతు సంఘం పనిలో నిరంతరం ముందుండేవారు తన తుది శ్వాస వరకు ఎత్తిన జెండా దించకుండా తన భుజస్కంతాలపై ఎర్రజెండా మోస్తూ చివరి శ్వాస వరకు గొప్ప మార్క్సిస్టుగా ఉన్నత విలువలతో జీవనం కొనసాగించిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి గారు అని వారి మరణం రైతాంగ ఉద్యమాలకు ప్రజా సంఘాల ఉద్యమాలకు సిపిఎం పార్టీకి తీరని లోటని వారి సంతాప సభ సందర్భంగా మల్లారెడ్డి కి విప్లవ జోహార్లు అర్పించారు వారి ఆశయ సాధన కోసం మునుముందుకు సాగుతామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సంతాప సభలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్, వై విక్రమ్, బొంతు రాంబాబు, మాదినేని రమేష్, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పారుపల్లి ఝాన్సీ, నందిపాటి మనోహర్, దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, ఎస్.కె.వి.ఏ.మీరా, బోడపట్ల సుదర్శన్, మెరుగు రమణ, బషీర్, జిల్లా నాయకులు ప్రకాష్, దేవేంద్ర, బొడ్డు మధు, ప్రవీణ్, వై.శ్రీనివాస్ రావు, ఆఫ్జల్, పుల్లయ్య, జావీద్, వీరారెడ్డి, జి.శ్రీదేవి, వసుందర తదితరులు పాల్గొన్నారు.

# అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు

- రూ.1,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల కోర్టు తీర్పు



**తంగళ్లపల్లి ప్రజావాణి ఆగస్టు 24** అత్యాచారం కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధిస్తూ సిరిసిల్ల 1వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పుష్పలత సోమవారం తీర్పు వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన జంగపల్లి శ్రీహరి ఓ యువతిపై అత్యాచారానికి పాల్పడినట్లు ఫిర్యాదు అందడంతో అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అనంతరం అప్పటి సీఐ ఉపేందర్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు.కోర్టు విచారణలో భాగంగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ రాజేందర్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, వెన్నెల సహకారంతో తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. జాన్సీ వాదనలు వినిపించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువైనట్లు నిర్ధారించి నిందితుడు జంగపల్లి శ్రీహరికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించారు.
ఈ కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి సిరిసిల్ల సీఐలు సర్వర్, ఉపేందర్, ప్రస్తుత సీఐ నాగేశ్వరరావు, తంగళ్లపల్లి ఎస్ఐ అశోక్, పీపీ జాన్సీ, కోర్టు మానిటరింగ్ ఎస్ఐలు రవీందర్ నాయుడు, శ్రవణ్ యాదవ్, కోర్టు కానిస్టేబుల్ రాజేందర్, సీఎంఎస్ కానిస్టేబుల్ నవీన్, వెన్నెలను జిల్లా ఎస్పీ అభినందించారు.

**నేరస్తులకు కఠిన శిక్షలు**

జిల్లా పోలీసులు సమర్థవంతమైన దర్యాప్తు చేపట్టి, ప్రాసిక్యూషన్‌తో సమన్వయం చేసుకుంటూ వేగవంతమైన విచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నారని ఎస్పీ తెలిపారు. నేరం చేసిన వారు ఎవరైనా చట్టం నుంచి తప్పించుకోలేరని, నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కఠిన శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని ఎస్పీ అన్నారు.

# మున్సిపల్ మహిళ పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

- ట్రస్టు నిర్వాహకులు సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 27 మంది మహిళ పారిశుద్ధ్య కార్మికులకు చీరలను
- మున్సిపల్ చైర్ పర్సన్ ములుగు ప్రశాంత్ కుమార్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్





**జమ్మికుంట ఆగస్టు 24 (ప్రజావాణి)**హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు జమ్మికుంట మండల కేంద్రంలో గల మున్సిపాలిటీ కార్యాలయం నందు జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 27 మంది మహిళ పారిశుద్ధ్య కార్మికులకు చీరలను ట్రస్టు నిర్వాహకులు సామాజిక కార్యకర్త డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ మున్సిపల్ చైర్ పర్సన్ ములుగు ప్రశాంత్ కుమార్ కమిషనర్ గుట్టల మల్లికార్జున్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా రిటైర్ అయి తల్లి పేరున గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు, సమాజంలోని పేదలకు అనేక సేవా కార్యక్రమాలు తన పెన్షన్ డబ్బులు నుండి నిర్వహించడం గర్వించదగిన విషయమని, తమ మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు చీరలు పంపిణీ చేసినందుకు అభినందనలు తెలుపుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆ కార్యక్రమంలో తాము పాల్గొంటామని తెలిపారు.. ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సమాజానికి వెన్నెముక లాంటి వారని, ప్రతిరోజు ఉదయము వీధులను, డ్రైనేజీలను శుభ్రపరుస్తూ ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి ఎలాంటి వ్యాధులు రాకుండా చేస్తున్న వీరి సేవలు అమూల్యమని తెలిపారుఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్స్ గుర్రం కావ్య పరశురాములు శీలం శ్రీనివాస్ కొల్లూరు సురేష్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ రమేష్ సోషల్ మీడియా కన్వీనర్ తులసి లక్షణాలు మూర్తి కార్యాలయ సిబ్బంది పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు

# కొరపల్లి గ్రామంలో గుర్తుతెలియని యాచకుడు మృతి

- వార్డు మెంబర్ నల్లగాష హరీష్ యాదవ్ జమ్మికుంట అంబులెన్స్ శేఖర్‌కు సమాచారం అందించారు





**జమ్మికుంట ఆగస్టు 24 (ప్రజావాణి)** జమ్మికుంట మండలం కొరపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడుజమ్మికుంట మండలం కొరపల్లి గ్రామంలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుందిమృతి చెందిన వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియరాలేదువిషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ వెంటనే పోలీసులకు సమాచారం అందించారుఅలాగే వార్డు మెంబర్ నల్లగాష హరీష్ యాదవ్ జమ్మికుంట అంబులెన్స్ శేఖర్‌కు సమాచారం అందించారుసమాచారం అందుకున్న వెంటనే జమ్మికుంట అంబులెన్స్ శేఖర్ స్పందించి, తన అంబులెన్స్‌లో మృతదేహాన్ని జమ్మికుంట మార్చురీకి తరలించారు మృతుడి వివరాలు గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారుఈ సందర్భంగా సమాచారం అందిన వెంటనే స్పందించి మృతదేహాన్ని మార్చురీకి తరలించేందుకు సహకరించిన అంబులెన్స్ శేఖర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన.... ఫలితం శూన్యం...

- రూ.16 లక్షల పెండింగ్ బిల్లులు చెల్లించాలి
- తంగళ్లపల్లి ఎంపీడీవోకు మాజీ సర్పంచ్ వినతి



**తంగళ్లపల్లి, ప్రజావాణి ఆగస్టు 24** పద్మనగర్ గ్రామపంచాయతీకి సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచ్ ముదారి పోచయ్య అధికారులను కోరారు. ఈ మేరకు తంగళ్లపల్లి మండల ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.వినతిపత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం.. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సంతకాలతో ఉన్న బిల్లులకు సంబంధించి సుమారు రూ.16 లక్షలు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు.పెండింగ్ బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా పనులు చేపట్టిన వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సంబంధిత రికార్డులు, బిల్లులను పరిశీలించి, నిబంధనల ప్రకారం బకాయిలను త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న రూ.16 లక్షల బిల్లులను త్వరగా ఇప్పించి సమస్యను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయ భూముల మధ్య కోళ్ల ఫార్మ్ వద్దు

- అనుమతులు ఇవ్వొద్దంటూ చీలాపూర్ రైతుల వినతి



**బెజ్జంకి, ఆగస్టు 24 (ప్రజావాణి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని పోతారం రోడ్డు నుంచి చీలాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో వ్యవసాయ భూములను ఆనుకుని ప్రతిపాదిస్తున్న కోళ్ల ఫార్మ్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని చీలాపూర్ (గద్దెమీది) ప్రాంత రైతులు అధికారులను కోరారు. ఈ మేరకు మండల ప్రజావాణి అధికారి, ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పించారు.చీలాపూర్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 760/ఏ , 83/బి , 83/సి తదితర ప్రాంతాల్లో సుమారు 10 ఎకరాల భూమిలో కోళ్ల ఫార్మ్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ఫార్మ్ ఏర్పాటైతే దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు, ఎలుకల బెడద పెరిగి పంటల సాగుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.దుర్వాసన, ఈగల బెడద కారణంగా వ్యవసాయ పనులకు కూలీలు రావడానికి ఇబ్బందులు ఏర్పడి, పంట భూములు బీడుగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సమీపంలోని ప్రభుత్వ స్థలాలు భవిష్యత్తులో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఉపయోగపడే అవకాశం ఉన్నందున, వాటి ప్రయోజనాలకు భంగం కలగకుండా చూడాలని కోరారు.రైతుల ప్రయోజనాలు, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని కోళ్ల ఫార్మ్ నిర్మాణానికి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు ఇవ్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని చీలాపూర్ (గద్దెమీది) ప్రాంత రైతులు అధికారులను విజ్ఞప్తి చేశారు.

# జాతీయ స్థాయిలో సత్తాచాటిన ఎబినేజర్ విద్యార్థులు





**రాయికల్; ఆగస్టు 24 (ప్రజావాణి)** రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని ఎబినేజర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచారు.గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన జాతీయ అబాకస్ పోటీలలో పాఠశాల 9వ తరగతి విద్యార్థి నాగ చైతన్య, 4వ తరగతి విద్యార్థిని శ్రీనిత్య, 6వ తరగతి విద్యార్థిని అనన్య, 2వ తరగతి విద్యార్థి పందిరి హానిషిత్ లు ఛాంపియన్‌షిప్ టైటిల్ సాధించారు.అదేవిధంగా జాతీయ స్పెల్ బీ పోటీలలో 6వ తరగతి విద్యార్థిని అనన్య రన్నరప్ గా, 4వ తరగతి విద్యార్థి విశ్వతేజ్ విజేతగా నిలిచి పాఠశాలకు పేరు తెచ్చారు.ఈ ఏడాది నిర్వహించిన స్పెల్ బీ నేషనల్ లెవల్ కాంపిటీషన్ కు ఎంపికై జాతీయ స్థాయిలో “బెస్ట్ పెర్ఫార్మర్” అవార్డును దక్కించుకోవడం తమకు ఎంతో గర్వకారణమని పాఠశాల కరస్పాండెంట్ ఇస్సాక్ అబ్రహం, ప్రిన్సిపాల్ సుసీ ఇస్సాక్ లు తెలిపారు ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, జిల్లా ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, గ్రామసేవా సమితి అధ్యక్షులు అనుపురం చిన్న లింబాద్రిగౌడ్,వార్డు సభ్యులు నిగ భూమేష్,మాజీ సర్పంచ్ మరిపెల్లి నారాయణ గౌడ్, మాజీ ఎంపీటీసీ కొమ్ముల ఆదిరెడ్డి తదితరులు హాజరై విద్యార్థులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు.అనంతరం పాఠశాల కరెస్పాండెంట్ ఇసాక్ అబ్రహం ను గ్రామ పెద్దలు శాలువాతో సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు.

# చింతలపాలెంలో విద్యుత్ లైన్‌మ్యాన్ నిర్లక్ష్యం -- చర్యలు తీసుకోవాలని ఏఈకి వినతి



**చింతలపాలెం ఆగస్టు 24( ప్రజావాణి):** మండల కేంద్రమైన చింతలపాలెంలోని 9వ వార్డులో దాదాపు 10 నుంచి 12 రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు అంధకారంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరితే సంబంధిత లైన్‌మ్యాన్ బాణావత్ శ్రీను నాయక్ దురుసుగా ప్రవర్తిస్తున్నారని సీపీఎం గ్రామ కార్యదర్శి, ఉప సర్పంచ్ కుమారుడు జంగాల పుల్లయ్య ఆరోపించారు. ఈ మేరకు ఆయన చింతలపాలెం విద్యుత్ శాఖ ఏఈకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

## తీర్మానాల అమలులో అవకతవకలు: ప్రజావాణిలో వార్డు సభ్యురాలి ఫిర్యాదు

● చింతలపాలెం పంచాయతీ పాలకవర్గంపై ఆరోపణలు



**చింతలపాలెం ఆగస్టు 24 (ప్రజావాణి)** :చింతలపాలెం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి మొత్తం ఆరు దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. వీటిలో నాలుగు పంచాయతీరాజ్ శాఖకు, రెండు విద్యుత్ శాఖకు సంబంధించిన అర్జీలు ఉన్నాయని తెలిపారు.తీర్మానాల అమలులో వివక్ష: వార్డు సభ్యురాలి ఆరోపణగ్రామపంచాయతీ పాలకవర్గం తీర్మానాల అమలులో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయని 11వ వార్డు సభ్యురాలు ప్రజావాణిలో అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. 11వ వార్డు పరిధిలో సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, స్మశానవాటికలో బోరు నిర్మాణం, మట్టి తోలించడం, హౌస్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు పాలకవర్గం తీర్మానాలు ఆమోదించినప్పటికీ వాటిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆమోదం లేని ఇతర పనులను మాత్రం యథేచ్ఛగా చేపడుతున్నారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.అవసరాల మేరకే పనులు: సర్పంచ్ వివరణఈ ఆరోపణలపై చింతలపాలెం సర్పంచ్‌ను వివరణ కోరగా.. గ్రామంలో అభివృద్ధి పనులను అత్యవసర ప్రాధాన్యతలను బట్టి ముందు, వెనుకగా చేపడుతున్నామని స్పష్టం చేశారు.

## కారు-లారీ ఢీ.. డ్రైవర్‌కు గాయాలు



**తంగళ్లపల్లి ప్రజావాణి ఆగస్టు 24** మండలంలోని బద్దెనపల్లి గ్రామ బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 23న రాత్రి 11 గంటల సమయంలో సిరిసిల్ల నుంచి జిల్లెల్ల వైపు వెళ్తున్న కారు (టీస్ .23.ఏ .8888)ను, సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న లారీ ( ఆర్.జె .02.జీసీ .3830) ఢీకొట్టింది.లారీని రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ షబ్బీర్ ఖాన్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో కారు డ్రైవర్ పబ్బతి దామోదర్ రెడ్డికి గాయాలయ్యాయి.కారు యజమాని దుబ్బాక రమేష్, జిల్లెల్ల గ్రామానికి చెందిన మల్లయ్య కుమారుడు, తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో లారీ డ్రైవర్ షబ్బీర్ ఖాన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## బాధ్యతారాహిత్యం రాంపేజ్.. పశువుల ప్రాణాలతో చెలగాటం!





**చెన్నారావుపేట ఆగస్టు 24 ప్రజావాణి** మినీ పశువుల దవాఖానను అనాథగా మార్చి, మూగజీవాల ప్రాణాలతో డాక్టర్ శ్రావణ్ చెలగాటమాడుతున్నారని మండల కేంద్రంలోని తిమ్మరాయిని పహాడ్ రైతులు మండిపడుతున్నారు. సీజనల్ రోగాలు దాడి చేస్తున్నా టీకాలు వేయకపోగా, దవాఖానను సిమెంట్ బస్తాల గోదాముగా మార్చి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ప్రశ్నించిన రైతులకు ఏం చేసుకుంటారో చేసుకోండి.. వారంలో ట్రాన్స్‌ఫర్ అయిపోతా అంటూ నిర్లక్ష్యపు సమాధానమివ్వడం గమనార్హం. వైద్యాధికారి తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతాంగం, తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కిరాణా షాపులో చోరీ.. ఇద్దరు దొంగల అరెస్ట్



**తంగళ్లపల్లి ప్రజావాణి ఆగష్టు 24** మండలంలోని లక్ష్మీపూర్ గ్రామ శివారులో చీర్లవంచ రోడ్డులో ఉన్న కిరాణా షాపులో చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను తంగళ్లపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 21వ తేదీ రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కిరాణా షాపులోకి చొరబడి సుమారు రూ.10 వేల విలువైన సామాన్లు దొంగిలించారు.ఈ ఘటనపై షాపు యజమాని ఆరేపల్లి తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేటకు చెందిన రాగుల అనిల్, పల్లె వేణు చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.అనంతరం నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి చోరీ చేసిన సామాన్లతో పాటు రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్టు చేసి సిరిసిల్ల కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. దీంతో నిందితులను కరీంనగర్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షుడిగా మొరిగేషన్ వేలు నియామకం



**శేరిలింగంపల్లి,ఆగష్టు 24(మన సమగ్ర ప్రజావాణి) : -** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని 227 శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షుడిగా మొరిగేషన్ వేలు నియమితులయ్యారు.తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ,క్రియాశీల కార్యకర్తగా పార్టీ బలోపేతానికి కృషి చేసినందుకు వేలు సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.నూతనంగా నియమితులైన ముద్దగని వేలు పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ టీఆర్ఎస్ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ ఆకాంక్షించారు.

# విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా.. రాగినేడు పాఠశాలకు బెస్ట్ రన్నర్స్ సంస్థ చేయూత

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, ఆగస్టు 24:** పెద్దపల్లి మండలం రాగినేడు గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు 20 డ్యూయల్ డెస్క్ బెంచీలు, 40 స్పోర్ట్స్ యూనిఫామ్స్, 40 స్కూల్ బ్యాగులు, 10 సైకిళ్లు, రెండు కంప్యూటర్ సిస్టమ్స్, ఒక ప్రింటర్ అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోలేటి దామోదర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. కష్టపడి, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. భవిష్యత్తులో గొప్ప వ్యక్తులుగా ఎదిగి గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సోమకుమార్ కోలేటి దామోదర్‌ను శాలువాతో సన్మానించారు.



విద్యార్థుల కోసం సేవా కార్యక్రమాన్ని చేపట్టిన బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధి సతీష్‌ను కూడా శాలువాతో సత్కరించి అభినందించారు.సర్పంచ్ సోమకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తు కోసం బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రాగినేడు గ్రామంలో విద్యార్థుల అభివృద్ధికి భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సహాయ సహకారాలు అందించాలని కోరారు.కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి సర్పంచ్ శోభారాణి విజయ్, కుర్మపల్లి సర్పంచ్ లక్ష్మి లింగయ్య, ఉప సర్పంచ్ సోనీ విజయ్, వార్డు సభ్యులు దండు చంద్రయ్య, పడాల వీరన్న, పడాల నరసయ్య, తాళ్ల లక్ష్మణ్, గుంటుకు సది, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించిన బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులకు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజల ఉత్సాహంతో కార్యక్రమం సందడిగా సాగింది.

# జీవో నం 97 ను రద్దు చేయాలి

● తెలంగాణ పాలిటెక్నిక్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎరవెల్లి జగన్






**వేములవాడ:- ఆగస్టు 24 ప్రజావాణి** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఐటీఐ ల విలీనానికి తెచ్చిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని లేదంటే కాక్రోచ్ జనతా పార్టీ తరహాలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు సైతం వెనుకాడబోమని తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థి సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ ఎరవెల్లి జగన్ హెచ్చరించారు.

సోమవారం రాజన్న సిరిసిల్ల లోని ప్రభుత్వ పాలిటెక్నీక్ కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థుల పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేలా జారీ చేసిన వివాదాస్పద జీవో నంబర్ 97 (G.O. Ms. No. 97)ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను పసిడి లాంటి భూములతో సహా, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ (ప్రాా) మోడల్‌లో నడిచే 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' పరిధిలోకి నెట్టడం వెనుక కార్పొరేట్ ప్రయోజనాలు దాగున్నాయని, విలువైన కాలేజీ భూములను కార్పొరేట్ అవసరాలకు వాడుకోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మొండివైఖరి వీడి, జీవో 97పై పునరాలోచించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని, సచివాలయం ముట్టడికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతిష్ఠాత్మక ా==ా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల ముందు విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కళాశాలలో బైఠాయించి భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టారు,జీవో 97ను రద్దు చేయాలి పాలిటెక్నిక్, ఐటీఐలను 'శక్తి' (SHAKTI) శాఖ పరిధిలోకి మారుస్తూ ఇచ్చిన జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలి లాటరల్ ఎంట్రీని కాపాడాలి డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ (B.Tech) సెకండ్ ఇయర్‌లో నేరుగా చేరే 'లాటరల్ ఎంట్రీ' (ECET) హక్కును యథాతథంగా కొనసాగించాలి .విద్యార్థులను కేవలం ఫ్యాక్టరీ కూలీలుగా మార్చే కుట్రలను ఆపాలి.ఉచిత విద్యను రక్షించాలి: PPP మోడల్ పేరుతో భవిష్యత్తులో ఫీజులు పెంచి, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఉచిత సాంకేతిక విద్యను దూరం చేయకూడదు ఆకునూరి మురళి కమిషన్ సిఫార్సులపై చర్చించాలి,విద్యా నిపుణులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలతో ప్రజాస్వామ్యబద్ధంగా చర్చలు జరపకుండా ఏకపక్షంగా విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లరాదు అని డిమాండ్ చేశారు ఈ నిరసనల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. తాము ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల ద్వారానే ఉన్నత స్థాయికి ఎదిగామని, నేడు ఆ విద్యా వ్యవస్థ ఉనికిని, స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడానికి తమ జూనియర్ల పక్కన నిలబడతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ా==ా ప్రభుత్వపాలిటెక్నీక్ కళాశాల రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యార్థులు నాయకులు అభిజ్ఞ, సోను అఖిల, కీర్తన, మేఘన రెడ్డి, మహేశ్వరి, ప్రణిత, రవళి, DSF నాయకులు మహేష్ యాదవ్, రామ్ మాదిగ, మ్యాథ్యూ, వంశీ తదితరులు పాల్గొన్నారు

# గిరిజనుల హక్కుల అభివృద్ధికి కృషి సర్పంచ్ పూర్ణ..

● జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన పెద్దతండా సర్పంచ్ లావుడ్య పూర్ణ.





**లక్ష్మీదేవిపల్లి/మన ప్రజావాణి (24 ఆగస్టు 26):** రేగళ్ల రెవెన్యూ పరిధిలోని గిరిజనుల సమస్యలను జాతీయ స్థాయిలో పరిష్కరించేందుకు పెద్దతండా గ్రామ సర్పంచ్ లావుడ్యా పూర్ణ ముందడుగు వేశారు. జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషనర్ జాటోత్ హుస్సేన్ నాయక్ ని కలిసి, రేగళ్ల ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరిస్తూ సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రేగళ్ల ప్రాంతంలో జరుగుతున్న బిటి రోడ్ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు, గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలు, ఎస్సీ కాలనీ, ఎస్టీ తండాల్లో సమాన అభివృద్ధి, కెటిపిఎస్-- నవభారత్ సంస్థల సిఎస్ఆర్ నిధుల వినియోగం తదితర అంశాలను సర్పంచ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

**రూ.10 కోట్ల ఆర్‌డబి రహదారి పనులపై విచారణకు విజ్ఞప్తి**

ప్రస్తుతం ఆర్‌డబి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రేగళ్ల నుండి కరకవాగు రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని సర్పంచ్ లావుడ్యా పూర్ణ కోరారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నిబంధనలకు అనుగుణంగా నిర్మాణ సామగ్రిని వినియోగించాల్సి ఉండగా, చెరువు మట్టిని ఉపయోగిస్తున్నట్లు, మట్టికి అవసరమైన ప్లాస్టిక్ ఇండెక్స్ ప్రమాణాలు పాటించడంలేదనే ఆరోపణలు ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నిర్మిస్తున్న సిసి డ్రైనేజీలు, వాగులు--వంకల వద్ద నిర్మిస్తున్న కల్వర్టులు, ఇతర కాంక్రీట్ పనుల్లో కూడా నాణ్యత, ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్టిమేట్ లో నిర్దేశించిన నిర్మాణ సామగ్రి ప్రకారం పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, ఇసుకకు బదులుగా కేవలం క్రషర్ డస్ట్ వినియోగిస్తూ, నాసిరకమైన పనులు చేస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. రోడ్డు పనులకు సంబంధించిన ఎస్టిమేట్, బిఓక్యూ, మెటీరియల్ టెస్ట్ రిపోర్ట్స్, మిక్స్ డిజైన్, క్వాలిటీ కంట్రోల్ రికార్డ్స్, తదితరాలను పరిశీలించి, అవసరమైన చోట నాణ్యత పరీక్షలు నిర్వహించి, లోపాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

**అర్హులైన గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలి..**

ఉమ్మడి రేగళ్ల పరిధిలో ఎన్నో సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న అర్హులైన గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు మంజూరు చేయాలని సర్పంచ్ లావుడ్య పూర్ణ కోరారు. హక్కు పత్రాలు లేకపోవడం వల్ల గిరిజన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హత కలిగిన ప్రతి రైతు దరఖాస్తును చట్ట ప్రకారం పరిశీలించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

**ఎస్సీ కాలనీ, ఎస్టీ తండాల్లో సమాన అభివృద్ధి.**

రేగళ్ల ప్రాంతంలోని ఎస్సీ కాలనీ, ఎస్టీ తండాలు, ఇతర గిరిజన ఆవాస ప్రాంతాల్లో అభివృద్ధి పనులు సమానంగా చేపట్టాలని సర్పంచ్ కోరారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలను ప్రతి ప్రాంతానికి సమానంగా అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**కెటిపిఎస్--నవభారత్ సిఎస్ఆర్ నిధులతో గిరిజన ప్రాంతాల అభివృద్ధి.**

రేగళ్ల ప్రాంతానికి సమీపంలో ఉన్న కెటిపిఎస్--నవభారత్ సంస్థలు తమ సిఎస్ఆర్ కార్యక్రమాల్లో ఈ ప్రాంతాన్ని ప్రాధాన్యతగా గుర్తించాలని కోరారు. స్థానిక గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి సిఎస్ఆర్ నిధులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ని కోరారు.

**గిరిజనుల హక్కుల కోసం సర్పంచ్ ప్రత్యేక చొరవ**

ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్యా పూర్ణచందర్ మాట్లాడుతూ "గిరిజనుల సమస్యలు కేవలం ఒక గ్రామానికి సంబంధించినవి కావు. అవి వారి హక్కులు, వారి భవిష్యత్తుకు సంబంధించిన అంశాలు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతతో పాటు అర్హులైన గిరిజనులకు చట్టబద్ధమైన హక్కులు అందేలా నిరంతరం కృషి చేస్తాను" అని తెలిపారు. రేగళ్ల ప్రాంత గిరిజనుల సమస్యలను జాతీయ స్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశంతో పెద్దతండా గ్రామ సర్పంచ్ లావుడ్యా పూర్ణచందర్ స్వయంగా జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషనర్ జాటోత్ హుస్సేన్ నాయక్ ని కలిసి వినతిపత్రం అందించారు. గిరిజనుల హక్కులు, అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

# బోనాల పండుగ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 24 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** బోనాల పండుగ వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా నిన్న మేడ్చల్ నియోజకవర్గం బోడుప్పల్ పరిధిలో బోనాల పండుగ సందర్భంగా శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా బోనాల శోభాయాత్రలో పాల్గొన్న పలహారం బండ్లకు ఘన స్వాగతం పలికాము. అనంతరం స్వాగత వేదికపై ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రివర్యులు, మేడ్చల్ నియోజకవర్గ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి మల్కాజ్గిరి పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి , మంద సంజీవరెడ్డి బుచ్చిరెడ్డి చక్రపాణి గౌడ్ హాజరై బోనాల శోభాయాత్రకు ఘన స్వాగతం పలికారు.అదేవిధంగా మల్లాపూర్‌లో శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆగమనం, పలహారం బండి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో



వీక్షించడం జరిగింది. అద్భుతమైన వేడుకను నిర్వహించిన శాంతి యూత్ క్లబ్ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు.అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ శాంతి, సంతోషం, ఆయురారోగ్యం, ఐశ్వర్యం కలగాలని కోరుకుంటున్నాను. అలాగే బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి, హేమానగర్ కాలనీలను ప్రభుత్వం అకారణంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన నేపథ్యంలో తీవ్ర ఆందోళనలో ఉన్న ఆయా కాలనీల వాసులకు బాసటగా నిలిచేందుకు నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తో కలిసి పాల్గొనడం జరిగింది.ప్రజా సమస్యల పరిష్కారం కోసం, ప్రజలకు అండగా ఎల్లప్పుడూ ముందుండే కృషి కొనసాగుతుంది.

# పేదల సొంతింటి కలకు.. ఇందిరమ్మ ఇళ్లు అండ

- మంత్రి శ్రీదర్ బాబు పాలనలో సొంతింటి కల సాకారం.
- గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి.





**రామగిరి, మన సమగ్ర ప్రజావాణి ఆగస్టు 24** పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా సుందిల్ల గ్రామ 5 వ వార్డులోని చీమల శివాని సంతోష్ ల ఇంటి ప్రారంభోత్సవ కార్యక్రమం ఆనందదాయకంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ జనగామ సదానందం, గ్రామ శాఖ అధ్యక్షుడు గ్రరేపల్లి ప్రవీణ్ గౌడ్, దేవాలయ చైర్మెన్ కోర కొప్పుల సత్యనారాయణ గౌడ్, దేవాలయ డైరెక్టర్ రేకుంట్ల రవి, గ్రామ వార్డు సభ్యులు గర్రెపల్లి చంద్రకళ నరేష్ గౌడ్, రామగిరి స్టాలిన్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పేగ నాగేందర్, హాజరై గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన ఇంటి యజమాని చీమల శివాని సంతోష్ లకు నూతన వస్త్రాలు శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో మంత్రి శ్రీదర్ బాబు పరిపాలనలో భాగంగా ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు ఎంతో భరోసానిస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకుని సౌకర్యవంతమైన గృహాలను నిర్మించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతుందని, గ్రామంలో అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. నూతన ఇంటి యజమాని చీమల శివాని సంతోష్ లు మంత్రి శ్రీదర్ బాబు పాలన పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ.. గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ జనగామ సదానందం, వార్డు సభ్యులకు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పేగ నాగేందర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మల్లాపూర్ డివిజన్‌లో ఘనంగా బోనాల పండుగ





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 24 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బోనాల పండుగ, పలహార బండి మరియు తొట్టెల ఊరేగింపు కార్యక్రమాల్లో ఎంఎంసీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓల్డ్ మల్లాపూర్‌లో శాంతి యూత్ క్లబ్ ఎస్.వి. శేషి ఆధ్వర్యంలో నిర్వహించిన పలహార బండి కార్యక్రమం. అన్నపూర్ణ కాలనీలో మాతా యూత్ అసోసియేషన్‌సూర్య ఆధ్వర్యంలో నిర్వహించిన పలహార బండి కార్యక్రమం. ఎస్.వి. నగర్ కాలనీలో యూత్ అసోసియేషన్ సాయితేజ ఆధ్వర్యంలో నిర్వహించిన పలహార బండి కార్యక్రమం. ఓల్డ్ మల్లాపూర్ బీరప్పగడ్డ యాదవ్ స్ట్రీట్‌లో సాయి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమం. ఈ కార్యక్రమాల్లో ఆయా యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు, యువకులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో వందలాది ఆటోలతో భారీ ర్యాలీ





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి ఆగస్టు 24** ప్రభుత్వం దిగివచ్చే వరకు పోరాటం ఆపేది లేదు 24న రాష్ట్రవ్యాప్తంగా హైవే రోడ్ల దిగ్బంధం.. 25న హైదరాబాద్ సచివాలయం ముట్టడి (పల్లెవెలుగు): ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో వందలాది ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆటో జేఏసీ జిల్లా కన్వీనర్ ఎనగందుల నాంపల్లి అధ్యక్షతన పెద్దపల్లి రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ర్యాలీకి ముఖ్య అతిథులుగా ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఆటో జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు వ్యాళ్ల హరీష్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు, నెలకు రూ.12 వేల ఆర్థిక సాయం, ఆటోనగర్ల ఏర్పాటు తదితర హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కోరారు. హామీల అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆటోల నిరవధిక బంద్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం దిగివచ్చి ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాన్ని ఆపేది లేదని నాయకులు హెచ్చరించారు. ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా హైవే రోడ్ల దిగ్బంధం, 25న హైదరాబాద్‌లోని సచివాలయం ముట్టడి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఆటో కార్మికుల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆటో జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే జబ్బర్, రాష్ట్ర నాయకుడు కాంపెల్లి శ్రీనివాస్, జిల్లా కో-కన్వీనర్లు బంధారపు శంకర్, బండ సురేష్, ఎస్కే జావీద్, రామగుండం ఇన్‌చార్జి మడిపెద్ది రమేష్, రామగుండం అధ్యక్షుడు ఎస్‌డీ బురహాన్, పాలకుర్తి అధ్యక్షుడు బెక్కం శంకర్, పెద్దపల్లి ఇన్‌చార్జి యాదగిరి శంకర్, పెద్దపల్లి మండల కన్వీనర్ ఈర్ల శంకర్, పెద్దపల్లి పట్టణ కన్వీనర్ గాండ్ల సత్యం, సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు తాడూరి రమేష్‌తో పాటు శ్రీధర్, అన్ను, చిలుముల స్వామి, బెక్కం రవి, నిజాం, వంశీ, కొండపలకల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో వందలాది ఆటోలు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# మొక్కలు నాటడం మన అందరి విధి

- పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి.



**కమాన్ పూర్, మన సమగ్ర ప్రజావాణి ఆగస్టు 24.** మొక్కలు నాటడం మన అందరి విధి అని పెద్ద పల్లి జిల్లా పోలీస్ కమిషనర్ బి రామ్ రెడ్డి అన్నారు. సోమవారం అటవీశాఖ వారి ఆధ్వర్యంలో శ్రీ ఆదివారహ స్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలనునాటారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ.. కాలుష్య నివారణకు ప్రతి ఒకరు మొక్కలు నాటాలని పేర్కొన్నారు. అలాగే శ్రీ ఆదివారా స్వామి ప్రాంగణంలో మొక్క నాటడం నా అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కాలుష్య నివారణకు మొక్కలు నాటి చెట్లను పెంపకం చేస్తే మనకు కాలుష్యంత తొలగిపోయి వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, డిస్టిక్ ఫారెస్ట్ ఆఫీసర్ దేవదాసు, ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఈవో కాంత రెడ్డి, రేంజ్ ఆఫీసర్ వినయ్ నాయక్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రహమతుల్లా ఖాన్, తోపాటు పలువురు పాల్గొన్నారు.

# వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట పాలిటెక్నిక్ విద్యార్థుల ధర్నా



**ప్రజా వాణి, వికారాబాద్ జిల్లా, ఆగస్టు24:** రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలను జీవో 97 ద్వారా'శక్తి' యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి విలీనం చేయడాన్ని నిరసిస్తూ వికారాబాద్ కలెక్టరేట్ ముందు పాలిటెక్నిక్ విద్యార్థులు ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ. 3 ఏళ్ల డిప్లొమా కోర్సును కేవలం నైపుణ్య శిక్షణకే పరిమితం చేస్తే తమ భవిష్యత్తు నాశనం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విలీనం వల్ల బీటెక్ 2వ సంవత్సరంలో నేరుగా ప్రవేశం కల్పించే ఈసెట్ లేటరల్ ఎంట్రీ అవకాశం కోల్పోతామని భయపడుతున్నారు. అలాగే సబీ టెట్ స్వయంప్రతిపత్తి దెబ్బతిని ఫీజుల భారం పెరుగుతుందని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి జీవో 97ను ఉపసంహరించుకోవాలని, పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతా..

- పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన మంత్రి శ్రీదర్ బాబు.





**కమాన్ పూర్, మన సమగ్ర ప్రజావాణి ఆగస్టు 24.** మంథని నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి లో అగ్రగామిగా నిలుపుతాని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం కమాన్ పూర్ మండలంలో 95 లక్షలతో నిర్మించిన శ్రీ ఆదివరా స్వామి రోడ్డుకు అలాగే 75 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన తహసిల్దార్ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. అలాగే గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపూర్ నుండి వంగపేటకు వెళ్లే రహదారిలో బండల వాగు పై మూడు కోట్ల 70 లక్షలతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ నియోజకవర్గంలో దినదినం అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. గత బి ఆర్ ఎస్ సమయంలో మంథని నియోజక వర్గం నియోజకవర్గ అభివృద్ధి కొంటుపడిందని పేర్కొన్నారు. కమాన్ పూర్ మండలం కేంద్రం నుండి పెంచికలపేట వరకు 13 కోట్ల రూపాయలతో డబుల్ రోడ్డు వేయడం జరిగిందని స్పష్టం చేశారు. అలాగే కమాన్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 30 లక్షలతో రోడ్లు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని స్పష్టం చేశారు. శ్రీపాదరావు ఆశయాలను దృష్టిలో పెట్టుకొని మంత్ర నియోజకవర్గంలో అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు రుణాలు గృహలక్ష్మి, మహాలక్ష్మి, వంటి పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని వాటికి అమలు చేయడం జరుగుతుందని అన్నారు. మంథని నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, మంథని ఆర్డీవో సురేష్, తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఏఎంసి చైర్మన్ వైనాల రాజు, సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, సర్పంచులు గుమ్మడి శ్రీనివాస్, బొంగోలి సదయ్య గౌడ్, పొన్నగంటి కుమార్ బంగారు కళ్యాణి మహేష్, శీలారపు మల్లయ్య, మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్, నాయకులు పిల్లి శేఖర్, బొల్లెపల్లి శంకర గౌడ్, ఇనగంటి రామారావు, అంబిరి శ్రీనివాస్, మల్యాల మహేష్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మొబిన్ పంజా సాయిరాం గౌడ్, లల్లు, ఉపసర్పంచ్లు అంబీరు రాజేందర్, కొత్తపల్లి సతీష్, సోహెల్, రాజమహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు ఘన సన్మానం చేసిన మంత్రి



**కమాన్ పూర్, మన సమగ్ర ప్రజావాణి ఆగస్టు 24** కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన మాదాసు రవీందర్ సుజాతలను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం ఘనంగా సన్మానించారు. శ్రీ ఆదివారః స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి వద్ద నాలుగు రోజులపాటు రవీందర్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు రవీందర్ దంపతులకు శాలువాతో సత్కరించి అభినందించారు. పుణ్యక్షేత్రాల్లో అన్నదానం చేయడం మహా పుణ్యమని అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందించాల్సిన విషయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముస్త్యాల దామోదర్, ఈవో కాంత రెడ్డి, ఇనగంటి చిన్నారావు, పిల్లి శేఖర్, రెబల్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# నాచారం డివిజన్‌లో రూ.46 లక్షల అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శ్రీకారం





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 24 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** నాచారం డివిజన్‌లో మొత్తం రూ.46 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సోమవారం శ్రీకారం చుట్టారు.
నాచారం డివిజన్ రామ్‌రెడ్డి నగర్‌లో గోల్డ్‌మ్యాన్ భద్రయ్య వీధితో పాటు ఇతర వీధుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున్ గౌడ్‌లతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా నాచారంలోని ఎంతో పురాతనమైన చిన్న స్కూల్ భవనం సుమారు నాలుగు సంవత్సరాల క్రితం భారీ వర్షాల కారణంగా శిథిలావస్థకు చేరడంతో, అప్పటి కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ చొరవతో ఆ భవనాన్ని కూల్చివేయడం జరిగింది. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ స్థలంలో నూతన భవనం నిర్మించాలని పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరడం జరిగింది. ఎట్టకేలకు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు రూ.16 లక్షలు మంజూరయ్యాయి. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం అసిస్టెంట్ ఇంజనీర్ సూరజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు విజయ్ కుమార్, రామారావు, నాచారం హెచ్‌ఎంటీ నగర్ డివిజన్‌ల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, రామ్‌రెడ్డి నగర్ కాలనీవాసులు, నాచారం గ్రామస్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫీజుల బకాయి బిజెపి లడాయి





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 24 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** విద్యార్థుల ఫీజుల బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావం రాష్ట్రంలో విద్యార్థుల ఫీజుల బకాయిలను చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చీ. రామచందర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ కార్యాలయంలో 48 గంటల నిరాహార దీక్ష ప్రారంభమైంది. ఈ దీక్షకు మద్దతు తెలుపుతూ ఈ సందర్భంగా N రామచందర్ రావు ని పూలదండతో ఘనంగా సత్కరించిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధికార ప్రతినిధి గోపాల్ గౌడ్ విద్యార్థుల హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటానికి తమపూర్తి సంఘీభావం తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజుల బకాయిలను విడుదల చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగింది. గోపాల్ గౌడ్ పోతగాని జిల్లా అధికార ప్రతినిధి తెలిపారు

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విజయేందర్ రెడ్డి





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 25 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విజయేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారం కోసం పంపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 75 దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# గణేష్, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్ అందించాలి

● విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం





**ఆర్మూర్ టౌన్ ఆగస్టు 24(మన సమగ్ర ప్రజావాణి):** వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆర్మూర్ నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని గణేష్, దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని వారు కోరారు. మండపాల నిర్వాహకులను విద్యుత్ శాఖ అధికారులు అనవసరంగా ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పండుగ సందర్భంగా రహదారులపై గుంతలు ఏర్పడకుండా ముందస్తుగా మరమ్మతులు చేపట్టాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడడంతో పాటు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కోరారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ధోబీఘాట్ రోడ్డు నుంచి గుండ్ల చెరువు వరకు తగిన విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయాలని, నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన క్రేన్లను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా విశేష సంపర్క ప్రముఖ్, ఆర్మూర్ నగర ప్రభారీ అల్జపూర్ అక్షయ్, నగర కార్యదర్శి కొంగి రవి, ఉపాధ్యక్షుడు ప్రేమ్, సత్సంగ్ ప్రముఖ్ సచిన్, బజరంగ్ దళ్ సాప్తాహిక మిలన్ ప్రముఖ్ అరవింద్, బలోపాసన ప్రముఖ్ సాయి, ప్రచార ప్రముఖ్ అనురాగ్‌తో పాటు రిషి, లింబాద్రి, శంకర్, మణికంఠ, నిఖిల్ తదితర బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు బోడుప్పల్ లో విద్యుత్ అంతరాయం

**మేడిపల్లి ఆగస్టు 24( మన ప్రజావాణి)** విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాను అందించేందుకు బోడుప్పల్ సబ్ స్టేషన్ లో 33కెవి టవర్ ఏర్పాటు పనుల కారణంగా,బాలాజీ హిల్స్ ఫీడర్,హేమా నగర్ ఫీడర్ పరిధిలోని మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 04:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చిలుకా నగర్ అసిస్టెంట్ ఇంజనీర్ వినయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.సాయి భవానీ నగర్,గాయత్రీ హిల్స్, మల్లయ్య నగర్,వాసవి నగర్,సప్తగిరి కాలనీ,నార్త్ బాలాజీ హిల్స్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని ఏఈ పేర్కొన్నారు.కావున వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఏఈ కోరారు.

# అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు దక్కాలి..

● ముగ్గు పోసిన తర్వాత ఇల్లు ఎలా రిజెక్ట్ చేస్తారు..?

● న్యాయం చేయాలని కమాన్‌పూర్ ప్రజావాణిలో విజ్ఞప్తి.



**కమాన్ పూర్, మన సమగ్ర ప్రజావాణి ఆగస్టు 24.**మాది అత్యంత నిరుపేద కుటుంబం ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో సంబరపడ్డాం. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు వచ్చి స్వయంగా స్థలాన్ని పరిశీలించి ముగ్గు కూడా పోశారు.తీరా ఇప్పుడు సాంకేతిక కారణాలంటూ ఏకపక్షంగా ఇల్లును రిజెక్ట్ చేస్తే మేము ఎక్కడికి వెళ్లాలి అని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.కమాన్‌పూర్ మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు బాధితులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొయ్యడ కుమార్ మాట్లాడుతూ.. తమ కుటుంబ పరిస్థితిని ప్రత్యక్షంగా చూసిన తర్వాతే అధికారులు ఇల్లు కేటాయించారని తెలిపారుఇల్లు కట్టుకునేందుకు ముగ్గు పోసి సిద్ధమవుతున్న తరుణంలో,మార్కింగ్ కూడా పూర్తయ్యాక ఉన్నట్టుండి జాబితా నుంచి తమ పేరును తొలగించడం తమను తీవ్ర మనోవేదనకు గురిచేసిందని వాపోయారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహాల పథకం నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడానికేనని, ఇలాంటి నిర్ణయాల వల్ల అర్హులైన పేదలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన చెందారు.కావున ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి పరిశీలన పునఃపరిశీలించాలని కోరారు.తమ కుటుంబ అర్హతను గుర్తించి కొయ్యడ ఐలమ్మ పేరున ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా న్యాయం చేయాలని కుమార్ వేడుకున్నారు.

# గ్రామ పంచాయతీల్లో పారదర్శక పాలనకు ప్రాధాన్యత

● ఎంపీడీవో బింగి చిరంజీవి





**రాయికల్: ఆగస్టు 24 (ప్రజావాణి)** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి, పారదర్శక పాలనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో బింగి చిరంజీవి అధికారులను ఆదేశించారు. సోమవారం రాయికల్ మండలంలోని రామోజీపేట గ్రామ పంచాయతీని ఆయన సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన పలు కీలక సూచనలు చేశారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక వివరాలను రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గత మూడు సంవత్సరాల అభివృద్ధి పనులు, యాక్షన్ ప్లాన్ వివరాలు నమోదు చేయడం వల్ల పాలనలో పారదర్శకత పెరుగుతుందని అన్నారు.2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిపిడిపి మరియు 16వ ఆర్థిక సంఘం నిధుల ప్రణాళికలను మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు.ప్రతి ఇంటి నంబర్ కు కుటుంబ మొబైల్ నంబర్ అనుసంధానం చేయాలని ఆదేశించారు. దీని వల్ల ఇంటి పన్ను, మ్యూటేషన్ తదితర సేవల సమాచారం ప్రజలకు వేగంగా అందుతుందని తెలిపారు.వీధులు, డ్రైనేజీల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ ముమ్మరం చేయాలని సూచించారు.జలసిరి కింద చేపడుతున్న పంటకుంటలు, ఇంకుడు గుంతలు,ఊటకుంటల పనులను వేగవంతం చేసి భూగర్భ జలాలను పెంచాలని ఆదేశించారు.అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మా, గ్రామ సర్పంచ్ బెజ్జంకి మోహన్, పంచాయతీ కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేగాకు ఘన స్వాగతం పలికిన... నియోజకవర్గ ప్రజలు

● తిరుగులేని నాయకుడు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా..







**మణుగూరు/మన ప్రజావాణి (24 ఆగస్టు 26):** కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన అక్రమకేసులపై న్యాయ పోరాటంలో విజయం సాధించి, పెట్టిన కేసులన్నీ రాజకీయ కుట్రతో పెట్టినవని హైకోర్టు కేసు కొట్టేయడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా ఘనంగా స్వాగతం పలికిన నియోజకవర్గ ప్రజానీకం. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ ఒక మహిళను అడ్డుపెట్టుకొని ఇలాంటి రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైనది కాదు అని హెచ్చరించారు. లైంగిక వేధింపుల కేసు వల్ల తన కుటుంబం ఎంతగానో మనస్తాపం అనుభవించిందని, కానీ నిజం గెలుస్తుందనే నమ్మకంతో ముందుకు సాగామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చూపిన మద్దతుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నాపై నమోదుచేసిన కేసు పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగమేనని నేను మొదట్నుంచే చెబుతున్నాను నిజం న్యాయం మీద ఉన్న విశ్వాసంతోనే న్యాయపోరాటం చేశాను, చివరకు సత్యమే గెలిచింది. ప్రజల ఆశీర్వాదం, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందించిన అండతో ఈ పోరాటంలో నిలబడగలిగాను. రాజకీయాల్లో విభేదాలు ఉండొచ్చు,కానీ తప్పుడు ఆరోపణలు చేసి వ్యక్తిత్వాన్ని దెబ్బతీయడం ప్రజాస్వామ్యానికి మంచి కాదు. ఇకపై ప్రజాసేవకే మరింత అంకితభావంతో పనిచేస్తాను" అని అన్నారు. ఇలాంటి అక్రమ కేసులకు భయపడే పరిస్థితి లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు 420 లో హామీలు ఇచ్చి ప్రభుత్వంకి వచ్చిన తర్వాత ప్రజలను అనేక ఇబ్బందులను గురిచేస్తున్నారని వారు మండిపడ్డారు. ఇప్పటినుంచి మరింత ఉత్సాహంతో ప్రభుత్వానికి ప్రతిక్షణం వారు ఇచ్చిన హామీలపై గుర్తు చేస్తూ, ధర్నాలు పోరాటాలు సాగిస్తూ, ప్రజల పక్షాన నిలబడతామని సూచించారు. ఇకనైనా ప్రభుత్వం నిద్ర వీడి ఇలాంటి అక్రమ కేసులు కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన అన్నారు.

**కల్యాణలక్ష్మి నిధులను వెంటనే విడుదల చేయాలి.**

హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడం సరికాదు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేసి, పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు పేదింటి ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. తొలుత రూ.50 వేలతో ప్రారంభించిన ఈ పథకాన్ని అనంతరం రూ.1,00,116కు పెంచి పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలులో జాప్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో నిధులు అందక పేద కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు.

**హైకోర్టు అంశంపై ప్రభుత్వం స్పందించాలి.**

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని, ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడం వల్ల సమస్య మరింత జాప్యమవుతోందని రేగా కాంతారావు గారు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే న్యాయపరమైన ప్రక్రియను పూర్తి చేసి, అర్హులైన పేదలకు పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాల విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సాయం అందించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్యాణలక్ష్మి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ప్రజల తరపున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ధర్మారం సీసీ రోడ్ల పనులు పూర్తికాకముందే బిల్లులు మంజూరు చేశారా?

● నిధుల వినియెాగం, పనుల నాణ్యతపై కలెక్టర్, క్వాలిటీ కంట్రోల్, ఏసీబీ విచారణకు డిమాండ్






**ప్రజావాణి -- ఖానాపూర్ నియోజకవర్గం జన్నారం మండలం, మంచిర్యాల జిల్లా:**జన్నారం మండలం ధర్మారం గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన నూతన సీసీ రోడ్ల పనులు పూర్తికాకముందే బిల్లులు మంజూరు చేశారా? నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిధుల చెల్లింపులు జరిగాయా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని గ్రామస్థులు కోరుతున్నారు.సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రోడ్డు నిర్మాణానికి ముందు చేపట్టాల్సిన బేస్, సైడ్ మట్టి తదితర పనులు నిబంధనల ప్రకారం పూర్తయ్యాయా లేదా అనే అంశాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులు సాంకేతికంగా పరిశీలించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు

ఈ అంశంపై గతంలో ప్రజావాణి ప్రతినిధి ద్వారా పత్రికా ప్రకటన విడుదల చేసి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటివరకు ధర్మారం గ్రామపంచాయతీ పరిధిలోని పనులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.అధికారులు ఇప్పటికే ఫిర్యాదు లేదా ప్రకటనను స్వీకరించి ఉంటే, దానిపై తీసుకున్న చర్యలు, నిర్వహించిన తనిఖీలు, సంబంధిత రికార్డుల పరిశీలన వివరాలను ప్రజలకు వెల్లడించాలని కోరుతున్నారు.

బిల్లుల మంజూరుపై సమగ్ర విచారణ జరపాలి

సీసీ రోడ్ల పనులు పూర్తికాకముందే బిల్లులు మంజూరు చేసినట్లు విచారణలో తేలితే, బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లు లేదా ఇతర సంబంధిత వ్యక్తులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇప్పటికీ చెల్లించాల్సిన బిల్లులు ఏమైనా ఉంటే, పనుల నాణ్యతపై సాంకేతిక పరిశీలన పూర్తయ్యే వరకు వాటిని నిబంధనల మేరకు నిలిపివేయాలని కోరుతున్నారు.

ఇప్పటికే బిల్లులు చెల్లించి ఉంటే కింది రికార్డులను అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు:

- వర్క్ ఆర్డర్లు
- కొలత పుస్తకాలు (MB)
- అంచనా వ్యయాలు
- బిల్లులు, వౌచర్లు
- చెల్లింపు వివరాలు
- పనుల పూర్తి ధృవపత్రాలు
- నాణ్యతా పరీక్షలకు సంబంధించిన రికార్డులు
- సంబంధిత తీర్మానాలు మరియు అధికారిక అనుమతులు

గ్రామపంచాయతీ నిధుల వినియోగంపైనా ప్రత్యేక ఆడిట్ చేయాలి

ధర్మారం గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ నిధులు నిబంధనలకు అనుగుణంగా వినియోగించారా? పనులు పూర్తికాకముందే బిల్లులు డ్రా చేశారా? నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు నిర్వహించారా? అనే అంశాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అదేవిధంగా ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లు మరియు ఇతర ప్రభుత్వ అభివృద్ధి పనుల నాణ్యతను సంబంధిత సాంకేతిక అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని కోరుతున్నారు.

పంచాయతీ సిబ్బంది సమయపాలనపైనా తనిఖీలు చేయాలి

ధర్మారం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నిర్ణీత సమయపాలన పాటించడం లేదని, కార్యాలయ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కార్యాలయ హాజరు రికార్డులు, విధుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించాలని కోరుతున్నారు.

అలాగే గ్రామపంచాయతీ విద్యుత్ వినియోగం, వివిధ ఖర్చులు, విద్యుత్ బిల్లులు మరియు ఇతర నిధుల వినియోగంపై కూడా పూర్తి స్థాయి తనిఖీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు స్పందించాలి

ధర్మారం గ్రామపంచాయతీ పరిధిలోని సీసీ రోడ్లు, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాలు మరియు ఇతర అభివృద్ధి పనులపై మంచిర్యాల జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు తక్షణమే సాంకేతిక, ఆర్థిక విచారణకు ఆదేశించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

విచారణలో నిధుల దుర్వినియోగం, నిబంధనల ఉల్లంఘన లేదా అవినీతికి సంబంధించిన ఆధారాలు లభిస్తే, బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు వర్తించే చట్టాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరోపణలు నిజమైతే ఏసీబీ విచారణ జరపాలి

ప్రభుత్వ నిధుల దుర్వినియోగం లేదా అవినీతికి సంబంధించిన ప్రాథమిక ఆధారాలు విచారణలో బయటపడితే, సంబంధిత చట్టపరమైన విధానాల ప్రకారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ద్వారా కూడా విచారణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధికారిక రికార్డులు, బిల్లులు, వర్క్ ఆర్డర్లు, కొలత పుస్తకాలు, చెల్లింపు వివరాలు మరియు ఇతర సంబంధిత ఆధారాలను నిబంధనల ప్రకారం పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ నిధులు ప్రజల అభివృద్ధి కోసం వినియోగించాల్సి ఉండగా, పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా పారదర్శకంగా పనులు నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ధర్మారం గ్రామపంచాయతీ పరిధిలోని అభివృద్ధి పనులపై వచ్చిన ఆరోపణలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# జైపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ



**జైపూర్, ఆగస్టు 24 ,ప్రజావాణి :**మంచిర్యాల జిల్లా జైపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 3 అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో శ్రీపతి బాపురావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వీకరించిన అర్జీలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో అందజేసిన ఫిర్యాదుల్లో రెవెన్యూ శాఖకు 1, పంచాయతీ రాజ్ శాఖకు 1, నీటి పారుదల (ఇరిగేషన్) శాఖకు 1 చొప్పున అర్జీలు వచ్చాయి.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వనజా రెడ్డి, వ్యవసాయ అధికారి సైదా, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ముస్తఫా, డాక్టర్ శ్రావ్య, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఏ. వెంకటేష్, ఏఈలు బి. రాజ్ కుమార్ (పిఆర్), కాంక్ష (హౌసింగ్), ఎన్ .రాజమలయ్య (ఆర్డబ్ల్యూఎస్), డి. అఖిల (ఇరిగేషన్), ఐసిడిఎస్ సూపర్వైజర్ గాయత్రి, ఏపీవో బి. బాలయ్య, ఏపీఎం సిహెచ్. సంతోష్, ఫారెస్ట్ ఆఫీసర్ రామకృష్ణ, హెచ్ డబ్ల్యూఓ ఎన్. సాయి లక్ష్మణ్, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ఎం. ఎ రసూల్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఈ. సుధా లక్ష్మి తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఇస్నాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

● బైక్‌ను వెనుక నుంచి ఢీకొన్న ప్రైవేట్ బస్సు.. యువకుడు మృతి



**పటాన్‌చెరు,ఆగస్టు 24 (ప్రజావాణి):** ఇస్నాపూర్‌లో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది.పోలీసులకు అందిన ఫిర్యాదు వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం హనుమాన్ నాయక్ తండాకు చెందిన గోరం ప్రశాంత్ (29) వ్యవసాయంతో పాటు కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆగస్టు 24న ఉదయం సుమారు 8 గంటల సమయంలో బైక్‌పై ఇస్నాపూర్ వైపు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సు (టీఎస్ 07 యూజీ 6612) ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన ప్రశాంత్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ బస్సు డ్రైవర్ బాబర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య నేనావత్ సుమలత పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి మృతదేహాన్ని పటాన్‌చెరువులోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు.ఘటనపై పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మెదక్ వైద్య సేవలకు మరింత బలోపేతం

- అత్యవసర చికిత్సా విభాగం ప్రారంభం
- ఏర్పాట్లపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

**మెదక్ జిల్లా బ్యూరో ప్రతినిధి ఆగస్టు 24 ప్రజావాణి** మెదక్ జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన అత్యవసర చికిత్సా విభాగాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ, స్థానిక శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్‌తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు.

త్వరలో అత్యవసర చికిత్సా విభాగాన్ని ప్రారంభించేందుకు అవసరమైన వైద్య సిబ్బంది, పరికరాలు, మౌలిక వసతులు, ఇతర సౌకర్యాలపై మంత్రి అధికారులతో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

25న హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశంఅత్యవసర చికిత్సా విభాగం ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లపై చర్చించేందుకు ఆగస్టు 25న హైదరాబాద్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. సంబంధిత అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు.



తూప్రాన్‌లో అత్యవసర చికిత్సా కేంద్రం

తూప్రాన్‌లో ప్రమాద బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రమాద అత్యవసర చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. అలాగే నర్సాపూర్, రామాయంపేట, కౌడిపల్లి, తూప్రాన్ ప్రాంతాల్లో అందుతున్న రక్తశుద్ధి చికిత్సా సేవలపై సమీక్షించారు.

ఆసుపత్రి, వైద్య కళాశాల అభివృద్ధిపై దృష్టి



మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల బలోపేతం, నూతన ఆసుపత్రి భవన నిర్మాణం, వైద్య కళాశాల విద్యార్థుల కోసం వసతి గృహ నిర్మాణంపై మంత్రి అధికారులతో చర్చించారు. జిల్లాలో వైద్య, ఆరోగ్య సేవల బలోపేతానికి అవసరమైన ప్రతిపాదనలను రూపొందించాలని ఆదేశించారు.సమీక్షలో పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

# భూమి విషయంలో రైతుకు న్యాయం చేయాలి





**తంగళ్లపల్లి ప్రజావాణి ఆగస్టు 24** మండలంలోని మల్లపూర్ గ్రామానికి చెందిన రైతు కనుకయ్య కు సంబంధించిన భూమి విషయంలో న్యాయం చేయాలని కోరుతూ.. సోమవారం తంగళ్లపల్లి మండల ప్రజావాణిలో అధికారులకు దరఖాస్తు సమర్పించారు.రైతు వివరాల ప్రకారం.. గతంలో రెవెన్యూ రికార్డుల్లో భూమి కొనుగోలుకు సంబంధించిన డాక్యుమెంట్ నమోదైనప్పటికీ, అప్పటి రెవెన్యూ అధికారులు మోటివేషన్ (మ్యూటేషన్) ప్రక్రియను పూర్తి చేయలేదని తెలిపారు. మ్యూటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన విషయం తెలియకపోవడంతో తాను అప్పట్లో దరఖాస్తు చేసుకోలేకపోయానని పేర్కొన్నారు.ఈ కారణంగా భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో సమస్య కొనసాగుతోందని, ప్రస్తుతం కూడా తనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సోమవారం తంగళ్లపల్లి మండల అధికారుల ప్రజావాణిలో దరఖాస్తు అందజేసి, భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి న్యాయం చేయాలని అధికారులను కోరారు.రైతు పక్షాన అధికారులు స్పందించి, పాత రికార్డులు, భూమికి సంబంధించిన పత్రాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కనుకయ్య విజ్ఞప్తి చేశారు.

# ఆగస్టు 27న ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో గ్రామ,వార్డు సభలు

- ఎస్ఐఆర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- మ్యాపింగ్ కాని, అసాధారణతలు గుర్తించిన ఓటర్లకు నోటీసుల జారీ పకడ్బందీగా చేపట్టాలి

**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి ఆగస్టు 24** జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సమీక్ష మెదక్, ఆగస్టు 24: ఆగస్టు 27న రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై ఆయన సమీక్షించారు. మ్యాపింగ్ కాని, అసాధారణతలు గుర్తించిన ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియను పకడ్బందీగా



చేపట్టాలని ఆదేశించారు.మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సమావేశంలో పాల్గొన్నారు. జిల్లాలో ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసుల తయారీ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేస్తున్నామని ఆమె తెలిపారు. ఆగస్టు 27న నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలకు అవసరమైన అన్ని



ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.జిల్లాలో నియోజకవర్గాల వారీగా అర్హత కలిగిన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.వీడియో సమావేశంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ,ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ గఫార్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎంపీడీవో గా టీవీ ఎల్ ఎన్ శాస్త్రి బాధ్యతల స్వీకరణ

- నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానం

**గూడూరు మండల ప్రతినిధి:- ఆగస్టు 24. (మన సమగ్రప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, స్థానిక గూడూరు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నూతన ఎంపీడీవో గా, సోమవారం రోజున టీవీ ఎల్ ఎన్ శాస్త్రి బాధ్యతలను స్వీకరించారు. ఎంపీడీవో గా బాధ్యతలు స్వీకరించిన టీవీఎల్ఎన్ శాస్త్రి ని మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలియజేసి, వారిని శాలువతో, నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి, సీతానగరం గ్రామ సర్పంచ్ భూక్య మంగీలాల్ నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాసాడి మల్లేశం, ఉప సర్పంచ్ నరేందర్ రెడ్డి, తదితరులు సన్మానించారు. వారితో పాటు ఎంపీవో అడ్లకట్ల సత్యనారాయణ, సూపరిండెండెంట్ అంబటి పృధ్విరాజ్ లు పాల్గొన్నారు.



# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

- మద్యం మత్తులో ఘర్షణ.. వ్యక్తి హత్య
- పకడ్బందీ దర్యాప్తుతో నిందితుడికి శిక్ష
- పోలీసు అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ

**మెదక్, జిల్లా బ్యూరో ప్రజావాణి ఆగస్టు 24**: మద్యం మత్తులో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి మెదక్ జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు.పుల్కల్ మండలం పోచారం గ్రామానికి చెందిన లక్ష్మణ్ సుమారు 14 ఏళ్ల క్రితం గడిపెద్దాపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వరిని వివాహం చేసుకుని ఇల్లరికం వచ్చాడు. వీరికి అభిలాష్, కార్తీక్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. మద్యానికి బానిసైన లక్ష్మణ్ తరచూ భార్య, కుటుంబ సభ్యులను వేధించడంతో 2023లో అతడిని ఇంటి నుంచి బయటకు పంపించారు.ఈ క్రమంలో 2025 సెప్టెంబర్ 30న లక్ష్మణ్



గడిపెద్దాపూర్‌కు వచ్చినట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. అదే రోజు రాత్రి పుట్టి ఆంజనేయులుతో కలిసి మద్యం సేవించాడు.

అనంతరం మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో ఆంజనేయులు లక్ష్మణ్‌పై దాడి చేసి హత్య చేశాడు. మృతదేహాన్ని బయట పడేసి అక్కడి నుంచి పరారయ్యాడు.మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు అల్లాదుర్గ్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శంకర్ 2025 అక్టోబర్ 1న కేసు నమోదు చేశారు. అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి సమగ్ర దర్యాప్తు చేపట్టి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వెంకటేష్ బలమైన వాదనలు వినిపించారు.సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు పుట్టి ఆంజనేయులుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.ఈ కేసులో న్యాయస్థాన సమన్వయ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ అర్షద్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేసి, సాక్ష్యాధారాలను సమర్థవంతంగా సమర్పించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు అభినందించారు.

# అంగన్వాడీలో అన్నప్రాసన వేడుకలు



**రాయికల్, ఆగస్టు 24(ప్రజావాణి):** రాయికల్ పట్టణంలోని 5వ వార్డులోని రెండవ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఆరు నెలలు నిండిన చిన్నారి జక్కుల విహాన్ కు అంగన్వాడీ ఆధ్వర్యంలో అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ.. గర్భిణీగా తెలిసిన వెంటనే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. గర్భధారణ సమయంలో నాలుగు సార్లు ఆసుపత్రి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టాలని, ముర్రుపాలలో అత్యంత శక్తివంతమైన పోషకాలు ఉంటాయని తెలిపారు. ఆపరేషన్ జరిగినా సరే కంగారు పడకుండా పద్ధతిగా బిడ్డకు పాలు ఇవ్వాలన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఏడవ నెల నుండి అంగన్వాడీలో ఇచ్చే బాలామృతంతో అన్నప్రాసన చేసి,నెలకు 16 కోడిగుడ్లు, బాలామృతం అందజేస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రమాదేవి, పద్మ, ఉమాదేవి, తల్లులు, ప్రీ స్కూల్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# 27న ఐడీవోసీ వద్ద మహాధర్నా

- టీజీఈజేఏసీ



**నస్పూర్ (మంచిర్యాల),ఆగస్టు 24, ప్రజావాణి:** ఈ నెల 27న నస్పూర్ లోని ఐడీవోసీ వద్ద నిర్వహించనున్న మహాధర్నా, నిరసన కార్యక్రమానికి ఉద్యోగులందరూ పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని టీజీఈజేఏసీ మంచిర్యాల జిల్లా జనరల్ సెక్రటరీ వనజారెడ్డి, టీఎన్జీవో అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీపతి బాపురావు పిలుపునిచ్చారు. రాష్ట్ర టీజీఈజేఏసీ పిలుపు మేరకు సోమవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఉద్యోగుల హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ నిరసనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ భాగ్యలక్ష్మి, పీఆర్ ఏఈ రాజకుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావ్య, వెటర్నరీ డాక్టర్ వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజమల్లయ్య, వ్యవసాయ అధికారి (ఏవో) సయిదా, హాస్టల్ వార్డెన్ మల్లేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గాయత్రి, హౌసింగ్ ఏఈ కాంక్ష, ఐకేపీ ఏపీఎం సంతోష్‌లతో పాటు పంచాయతీ కార్యదర్శులు ఏ. సత్యనారాయణ, పి. సురేష్, బి. ఉదయ్ కుమార్, విష్ణువర్ధన్, ఐ. తిరుపతి, ఏ. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- జిల్లా సంక్షేమ శాఖ ఇంచార్జి అధికారి శిరీష

**గూడూరు మండల ప్రతినిధి:- ఆగస్టు 24. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా పరిధిలోని (05) డోర్నకల్, గూడూర్, మహబూబాబాద్, మరిపెడ, తొర్రూర్ ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ (ఏడబ్ల్యూటి) అలాగే అంగన్‌వాడీ ఆయా (ఏడబ్ల్యు హెచ్) పోస్టులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొదటి విడతలో భర్తీ చేయుటకు, అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించబడినవని, జిల్లా సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారి శిరీష నేడు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం అంగన్‌వాడీ టీచర్ల (101) పోస్టులలో డోర్నకల్ 16, గూడూర్ 15, మహబూబాబాద్ 28, మరిపెడ 13, తొర్రూర్ 29, అంగన్‌వాడీ సహాయకురాలు (130) పోస్టులకు గాను మొత్తం 231 పోస్టులకు గాను, అభ్యర్థులు పూర్తి వివరాల కొరకు ట్రిజూం:// ఋఎఌఌ.ఠ్రు.అఊఎ.అఅ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. ముఖ్యమైన తేదీలు: దరఖాస్తుల ప్రారంభ తేదీ: 25.08.2026 నుండి ?దరఖాస్తుల చివరి తేదీ: 03.09.2026 సాయంత్రం 5.00 గంటల వరకు. ?ముఖ్య నిబంధనలు అలాగే విద్యార్హత: అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు అభ్యర్థినులు తప్పనిసరిగా ఇంటర్ లేదా, 12వ తరగతి ఉత్తీర్ణులై ఉండవలయును. ఆయా (హెల్పర్) పోస్ట్ కు ఇంటర్ అభ్యర్థినులు లేని యెడల 10వ తరగతి ఉత్తీర్ణులైన వారిని ఎంపిక పరిగణలోకి తీసుకోబడును. అభ్యర్థుల వయస్సు:18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలి. 01.07.2026 నాటికి.స్థానికత: అభ్యర్థి సంబంధిత అంగన్‌వాడీ కేంద్ర పరిధి/ వార్డ్ (అర్బన్ ఏరియాలో) గ్రామ పంచాయతీకి (రూరల్) చెందిన స్థానికురాలై ఉండాలని అన్నారు. ?ఎంపిక విధానం: ?అంగన్‌వాడీ టీచర్ అలాగే ఆయా పోస్టులకు, అభ్యర్థి తప్పనిసరిగా స్థానిక మహిళ అయి ఉండాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు,అభ్యర్థి పట్టణ ప్రాంతాలలో అయితే ఆ వార్డు నివాసి అయి ఉండాలి, గ్రామీణ ప్రాంతాలలో అయితే అంగన్‌వాడీ కేంద్రం గ్రామ పంచాయితీ నివాసి అయి ఉండాలని, ?ఎస్టీ సబ్ ప్లాన్ క్రింద ఎస్టీ వర్గానికి కేటాయించిన అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు అలాగే ఆయా పోస్టులకు,అదే గ్రామం/ ఆవాసం/ హాబిటేషన్ నుండి వచ్చిన ఎస్టీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ?ఎస్సీ సబ్ ప్లాన్ క్రింద ఎస్సీ వర్గానికి కేటాయించిన అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు అలాగే ఆయా పోస్టులకు,అదే గ్రామ పంచాయితీలోని ఆవాసాల/గ్రామాల నుండి వచ్చిన ఎస్సీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. అభ్యర్థుల ఎంపిక క్రింది ప్రమాణాల ఆధారంగా జరుగుతుంది: ఇంటర్మీడియట్ మార్కుల మెరిట్ 70 మార్కులు. ప్రత్యేక కేటగిరీలు:వితంతువులు – 5 మార్కులు, అనాధలు – 10 మార్కులు, దివ్యాంగులు 5 మార్కులు. ?జిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే ఇంటర్వ్యూ- 10 మార్కులు. ?దరఖాస్తు https://wdcw.tg.nic.in/ వెబ్‌సైట్ నందు మాత్రమే దరఖాస్తు చేయవలెనని,ఈ నోటిఫికేషన్‌ను పూర్తిగా రద్దు చేయుటకు లేదా అవసరమైన మార్పులు చేయుటకు జిల్లా కలెక్టర్/చైర్మన్, మహబూబాబాద్ వారికి పూర్తి అధికారాలు కలవు. సిడిపిఓ/డిడబ్ల్యుఓ/ ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులు పరిగణనలోకి తీసుకోబడవని అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ప్రజా గ్రంథాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలి



**రాయికల్, ఆగస్టు 24(ప్రజావాణి):** రాయికల్ పట్టణంలోని ప్రజా గ్రంథాలయాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా అనువైన ప్రదేశానికి తరలించాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి నోడల్ అధికారి ఎంపీడీఓకుబింగి చిరంజీవికి వినతిపత్రం అందజేశారు.రాయికల్ పట్టణంలో గ్రంథాలయం ఉన్నా చాలా చిన్నగా ఉండటంతో పాటు అది ఎక్కడ ఉందో కూడా చాలా మందికి తెలియడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల విద్యార్థులు, నిరుద్యోగ యువత, వృద్ధులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు గ్రంథాలయ సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు.కావున ప్రస్తుత గ్రంథాలయాన్ని ప్రజలందరికీ చేరువయ్యే ప్రధాన ప్రదేశంలో, విశాలమైన భవనంలో ఏర్పాటు చేయాలని కోరారు. విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా పోటీ పరీక్షల పుస్తకాలు, తెలుగు సాహిత్యం, దిన, వార, మాస పత్రికలు, విజ్ఞాన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. రాయికల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో గ్రంథాలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని ఆయన కోరారు.

# నెల్లికుదురు ప్రజావాణి కి తొమ్మిది దరఖాస్తులు

**ప్రజావాణి,నెల్లికుదురు :**ప్రజా సమస్యలు వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వారం వారం మండల స్థాయిలో ప్రవేశపెట్టిన ప్రజావాణి కొనసాగుతోంది. మండల కేంద్రం నెల్లికుదురు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో చంద నరేష్,ఎంపీడీవో సింగారపు కుమార్ పాల్గొని ప్రజలు తమ సమస్యలపై సమర్పించిన వినతులను స్వీకరించారు. అనంతరం ఎంపీడీవో కుమార్ దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. ప్రజావాణి కి మండల వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలపై తొమ్మిది దరఖాస్తులు అందజేసినట్లు వెల్లడించారు.రెవెన్యూ సమస్యలపై రెండు దరఖాస్తులు, హౌసింగ్ పై మరో రెండు దరఖాస్తులు ఇచ్చారన్నారు. విద్యా సంబంధిత సమస్యపై ఒకటి, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి పై ఒక దరఖాస్తు,ఇతర సమస్యలపై మరో మూడు దరఖాస్తులు సంబంధిత బాధితులు ఇచ్చినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ప్రజావాణిలో పలు శాఖలకు చెందిన అధికారులు హాజరవుతున్న దృష్ట్యా సమస్యలు పరిష్కరించడానికి ఇది ఒక చక్కని వేదిక అని,మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను ప్రజావాణి దృష్టికి తీసుకువచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## రైతులను ఆదుకోండి: ఎస్సారెస్పీ కాలువ కు నీటిని విడుదల చేయాలి.. సంగెం రమేష్ డిమాండ్.



**చెన్నారావుపేట ఆగస్టు 24 ప్రజావాణి** వర్షాభావ పరిస్థితులతో పంట పొలాలు ఎండిపోతున్నాయని,ప్రభుత్వం వెంటనే స్పందించి ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులు తీవ్ర దిక్కుతోచని స్థితిలో పడ్డారని,చెరువులు,కుంటలు ఎండిపోవడంతో పాటు బావుల్లో నీటిమట్టం అడుగు అంటిందని, దీనివల్ల పంటలు వాడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ కాల్వ ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి, చివరి ఆయకట్టు రైతు వరకు సాగునీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల పరిస్థితి తీవ్రంగా ఉన్నందున ప్రభుత్వం ఏమాత్రం అలసత్వం వహించకుండా తక్షణమే స్పందించాలని సంగెం రమేష్ విజ్ఞప్తి చేశారు.

## చట్టబద్ధంగా, పారదర్శకంగా ఫిర్యాదుల పరిష్కారం

- ప్రజా ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా విచారణ
- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- ప్రజల నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలి
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు



**మెదక్, జిల్లా బ్యూరో ప్రజావాణి ఆగస్టు24:** ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఒక్కో అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత, కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, వేధింపులు తదితర అంశాలపై ఫిర్యాదులను సమర్పించారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ జరిపి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి వినతిదారుడి సమస్యను బాధ్యతగా పరిగణించి, ఫిర్యాదు పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయడం, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటించాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి భయం, సంకోచం లేకుండా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ కోరారు. ప్రతి ఫిర్యాదును చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## జెడ్పిహెచ్ఎస్ విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ



**ప్రజావాణి,ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తి లోని జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులకు మండలంలోని చీన్య తండా కు చెందిన అజ్మీర బావ్ సింగ్ సోమవారం క్రీడా దుస్తులు వితరణ చేశారు. స్థానిక హెచ్ఎం అమ్మ యాకయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చీన్య తండ సర్పంచి జాటోత్ హరిచంద్ నాయక్, దిశ కమిటీ సభ్యులు గుజ్జునూరి బాబురావు ప్రభృతులు జెర్సీలను విద్యార్థులకు అందజేశారు. రూ. 10వేల విలువ కలిగిన దుస్తులను 20 మంది విద్యార్థులకు బహుకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ హరి చంద్ నాయక్, హెచ్ఎం అమ్మ యాకయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి చేయూతనివ్వడం తో స్టూడెంట్స్ కు మరింత ప్రోత్సాహం లభించినట్లు అవుతుందన్నారు. క్రీడా దుస్తులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ టీషర్ట్స్ అందజేసిన బావ్ సింగ్ దాతృత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో వాలీబాల్ దిగ్గజం విశ్రాంత ఉపాధ్యాయులు కన్న సాంబయ్య గౌడ్, ఫిజికల్ డైరెక్టర్ తాళ్ల ప్రణయ్ ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు ఇచ్చే వారే కరువయ్యారు

- ఫిర్యాదులు ఇచ్చి పని కావాలంటే లంచం



**రాయపోల్ ఆగస్టు 24(ప్రజావాణి)** సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమౌం ఇది నిర్వహించి అక్కడే సమస్యలు పరిష్కరించాలని నిర్ణయించి గత సోమవారం నుంచి మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దానిలో భాగంగానే రెండవ వారం సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. రాయపోల్ మండల ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాయపోల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదు. దీంతో అధికారులు ఫిర్యాదుల కోసం నిరీక్షించి, చివరకు ఖాళీగానే వెనుదిరిగారు. ఉదయం నుంచి వర్షం కురుస్తుండటంతో ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాలేదని ఎంపీడీవో డా. చిలుముల శ్రీనివాస్ తెలిపారు. అంతేకాకుండా మండల స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం ప్రజలకు అందరికీ పూర్తిస్థాయిలో తెలియకపోవడం కూడా ఫిర్యాదులు రాకపోవడానికి కారణంగా తెలుస్తోంది. ప్రజావాణి నిర్వహణ పై అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించి, ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్. నరేష్, విద్యుత్ శాఖ ఏఈఈ పి. శ్రీనివాస్ రావు, హౌసింగ్ శాఖ ఏఈఈ కె. విద్యాసాగర్, మిషన్ భగీరథ ఏఈఈ డి. అభినయ్, నీటిపారుదల శాఖ ఏఈఈ వి. జ్యోతిర్మయి, జిపిఓ కరుణాకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్కే. జహంగీర్, వైద్య ఆరోగ్య శాఖ వై. కృష్ణవేణి, బీసీ వెల్ఫేర్ అధికారి టి. గీతాంజలి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఎస్. స్వప్న, ఎక్సైజ్ శాఖ కె. సాయి కిరణ్, ఈసీ ఎస్. జనార్ధన్, ఐకెపి సిసి వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## సీలింగ్ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించాలి

- సిపిఐ మందమర్రి పట్టణ కార్యదర్శి కామెరా దుర్గరాజ్



**మన ప్రజావాణి మందమర్రి ఆగస్టు 24** మందమర్రి శివారులోని సీలింగ్ పట్టా భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న ఫామ్‌హౌజ్ నిర్మాణాన్ని తక్షణమే తొలగించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఐ మందమర్రి పట్టణ కార్యదర్శి కామెరా దుర్గరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 347/2 లో గల 3 ఎకరాల 20 గుంటల భూమిని 1/70 చట్టం ద్వారా గతంలో సీలింగ్ పట్టా కింద భూనేని రాజుకు ప్రభుత్వశీ కేటాయించిందని తెలిపారు. సదరు వ్యక్తి మరణించడంతో, అతనికి వారసులు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, భూ కబ్జాదారులు ఆ భూమినిఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ భూమి 1/70 చట్టం పరిధిలో ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఫామ్‌హౌజ్ నిర్మాణం చేపడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి సర్వే నెంబర్ 347/2 భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను కూల్చివేసి కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మందమర్రి మండల కార్యదర్శి తాళ్లపల్లి వీరయ్య AIYF జిల్లా సహాయ కార్యదర్శి ఆంటోనీ దినేష్ ఉప్పులేటి తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## కస్తూరిబా పాఠశాల సమీపంలో గల డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించిన

- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ కౌన్సిలర్లు





**జమ్మికుంట ఆగస్టు 24 (ప్రజావాణి)** జమ్మికుంట పట్టణ ప్రజలందరికీ కూడా నమస్కారం ఈరోజు 2 బి హెచ్ కెని కేశవపురం కస్తూరిబా స్కూల్ దగ్గర ఉన్నటువంటి కొన్ని ఇండ్లను పరిశీలించడానికి రావడం జరిగింది. ఎందుకంటే ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పంపిణీలో లబ్ధిదారులందరినీ కూడా సెలెక్ట్ చేసే పరిస్థితి ఉంది ప్రజలందరు కూడా అక్కడ ఇండ్లన్ని పూర్తి అయిపోయినాయి మాకు మంజూరు చేసినటువంటి పత్రాలు ఇస్తే దానిలో పోయి నివాసంగా ఉండొచ్చు అని అనుకుంటున్నారు ఈరోజు జమ్మికుంటకు మొత్తం కూడా 500 డబుల్ బెడ్‌రూమ్‌లు అప్పుడు ఉన్నటువంటి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వమే ఇది నిర్మాణం మొదలుపెట్టి పూర్తి అయ్యే దశలో ప్రభుత్వము మారడం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ కొద్దిరోజులకే గత ప్రభుత్వం చేసినటువంటి తప్పులను గాని మేము ఏం చేయము మీకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇవ్వలేదు అని చెప్పి మూడు సంవత్సరాలు పూర్తి కావస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఈరోజు ప్రభుత్వానికి జమ్మికుంట మున్సిపల్ కౌన్సిల్ తరపున ఒక విజ్ఞప్తి, ప్రజలను ఎవరినీ కూడా ఎవరూ మోసం చేయొద్దు ఏ ప్రభుత్వం అయినా కూడా ప్రజలకి మెరుగైన సదుపాయాలు ఉండడానికి ఒక మంచి ఇల్లు అనే ఒక పథకాన్ని తీసుకొచ్చినటు వంటి ఏ ప్రభుత్వానైనా ప్రజలు ఆదరిస్తారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ గత ప్రభుత్వం ప్రారంభించినటువంటి 2 బి హెచ్ కెని ఈరోజు పంచడానికి హడావుడి మేము గెలిచి ఇప్పుడు ఆరు నెలల కాలం పూర్తౌస్తుంది,ఆరు నెలల నుంచి ఇగో రేపు, ఇగో రేపు,ఇగో రేపు అని చెప్పి వాళ్ళు ప్రచారాలు చేస్తున్నారు నిన్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా గృహనిర్మాణ శాఖ మంత్రి కూడా తప్పకుండా ప్రజలకు మిగిలిన ఏదైతే రిమైనింగ్ వర్క్ అక్కడ పెండింగ్ ఉందో ఆ యొక్క లబ్ధిదారునికే మేము నగదు ఇచ్చి ఆ కన్‌స్ట్రక్షన్ పూర్తి చేస్తాము ఉదాహరణకి జమ్మికుంటలో 500 ఇండ్లు ఈరోజు ఇక్కడి నుంచి మేము జిల్లా కలెక్టర్ కి ఇక్కడున్నటువంటి మంత్రులకి, ఇక్కడున్నటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి విజ్ఞప్తి రాజకీయ విమర్శలు మాకు అవసరం లేదు ఇక్కడున్నటువంటి మీరు ఎవరికైతే లబ్ధిదారులకి ఇస్తా అన్నారో ఒక్కసారి ఆ లబ్ధిదారులని మీరు మంజూరు చేసిన లబ్ధిదారులను ఒక్కసారి ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లని వాళ్ళనే పరిశీలించమనండి, లేదంటే మీరు కూడా రండి లేదు ఇక్కడ ఎంత ఖర్చు అవుతది,ఎంత నిధులు కేటాయిస్తే ఈరోజు ఈ డబుల్ బెడ్‌రూమ్‌లు అన్నీ పూర్తి కావస్తాయి ఈరోజు ప్రజలకి అబద్ధాలు చెప్పుకుంటూ ప్రజలని ఆశగా ఎదురుచూసే విధంగా ప్రభుత్వాలు చేయొద్దు దయచేసి జిల్లా కలెక్టర్ స్థానికంగా ఉన్నటువంటి మున్సిపల్ కమిషనర్ హౌసింగ్ పీడీ ఎంతసేపూ ఇక్కడ 240 ఇండ్లు ఉన్నాయి అని చెప్పి కస్తూరిబా స్కూల్ దగ్గరనే ఇక్కడ నిర్మాణ దశలో రేపు పొద్దున వచ్చి నివాసయోగ్యంగా ఉండడానికి ఉన్న ఇండ్లు మాత్రము 24 ఇండ్లు మాత్రమే నివాసయోగ్యంగా రేపు పొద్దున వచ్చి ఊడ్చుకొని కిటికీలో దర్వాజాలో పెడితే ఉండొచ్చు మిగతావన్నీ ఒకటేమో ఫౌండేషన్ స్టేజ్‌లో ఉంది ఒకటేమో పిల్లర్ స్టేజ్‌లో ఉంది ఒకటేమో జి౦1 కట్టి జి౦2 పెండింగ్‌లో ఉన్నది లోపట ఇక్కడున్నటువంటి మెటీరియల్‌ని కన్‌స్ట్రక్షన్ అంతా కూడా గుర్తితెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు అంటే పూర్తిగా కూడా శిథిలంలో అంటే ఇక్కడ ఎవరూ నివసించే పరిస్థితి లాగా కనబడడం లేదు దయచేసి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమాచారం తెలుసుకున్న తర్వాత డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కార్యక్రమం చేయగలరని తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ శీలం శ్రీనివాస్ కొలుగురి సురేష్ ఫిరోజ్ మైస రవిపరశురామ్ శంకర్ శివ తదితరులు పాల్గొన్నారు

## భూ వివాదం కేసులో ఐదుగురికి ఐదేళ్ల జైలు

- ఏసీపీ మాధవి జమ్మికుంట రూరల్ సీఐ వెంకట్‌గౌడ్ ఇల్లందకుంట ఎస్సై క్రాంతికుమార్



**జమ్మికుంట ఆగస్టు 24 (ప్రజావాణి)** ఇల్లందకుంట మండలం గడ్డివానిపల్లిలో 2019లో జరిగిన భూ వివాదం కేసులో హుజూరాబాద్ కోర్టు తీర్పు వెలువరించింది గడ్డివానిపల్లికి చెందిన ఎలవేని రఘుపతి 35 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన 18 గుంటల భూమిని తమ తండ్రి తమకు తెలియకుండా విక్రయించారంటూ రఘుపతిపై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన గడ్డి మహేష్ (ఉపసర్పంచ్) గడ్డి కొమురయ్య గడ్డి రాజు గడ్డి తిరుపతితో పాటు సిరిసేడు గ్రామానికి చెందిన బీనవేని ఎర్రయ్య చేసిన భౌతిక దాడిలో తీవ్రంగా గాయపడిన రఘుపతిని కుటుంబ సభ్యులు జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం ఎంజీఎంకు తరలించారు. రఘుపతి కూతురు ఫిర్యాదుతో ఇల్లందకుంట పోలీసులు కేసు నమోదు చేశారుఆరేళ్ల విచారణ అనంతరం కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు కేసులో కోర్టు వాయిదాలకు ఇరువర్గాలను హాజరుపరచడంలో విధులు నిర్వహించిన కోర్టు కానిస్టేబుల్ జన్నె రాజేష్‌ను హుజూరాబాద్ ఏసీపీ మాధవి జమ్మికుంట రూరల్ సీఐ వెంకట్‌గౌడ్ ఇల్లందకుంట ఎస్సై క్రాంతికుమార్ అభినందించారు.

## వ్యవసాయ దారిని అభివృద్ధి చేయాలని ఎంపీడీఓకు వినతి



**చెన్నారావుపేట ఆగస్టు 24 ప్రజావాణి** మండల పరిధిలోని మాధవ నగర్ కాలనీ,ఎల్లాయి గూడెం గ్రామాల సరిహద్దులోని రైతుల వ్యవసాయ దారిని తక్షణమే అభివృద్ధి చేయాలని కోరుతూ జల్లి గ్రామానికి చెందిన కాట కుమారస్వామి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలంలో ఈ దారి తీవ్రంగా బురదమయమై ట్రాక్టర్లు, వ్యవసాయ వాహనాలు వెళ్లలేక రైతులు, కూలీలు అవస్థలు పడుతున్నారని అందులో పేర్కొన్నారు. పొలాల నుండి పంటలను మార్కెట్‌కు తరలించడానికి ఆటంకం కలుగుతోందని తెలిపారు. అధికారులు స్పందించి ప్రభుత్వ నిధులతో దారిని నిర్మించి, సురక్షిత రాకపోకలు కల్పించాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి లక్ష్యం

- ప్రజావాణిలో 55 దరఖాస్తుల స్వీక రణ
- ప్రతి వినతిపై తక్షణమే స్పందించాలి
- నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలి
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి
- ఆర్జీదారుల సమస్యలను పూర్తిగా ద తెలుసుకుని పరిష్కరించాలి
- ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం వహించొద్దు
- సంబంధిత శాఖల అధికారులకు
- డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ ఆదేశం







**మెదక్, జిల్లా బ్యూరో ప్రజావాణిఆగస్టు 24:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని,వాటికి పరిష్కారం చూపించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ స్పష్టం చేశారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

55 దరఖాస్తుల స్వీకరణ

సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 55 దరఖాస్తులను డీఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రతి వినతిపై ప్రత్యేక దృష్టి

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తున్నందున, వారి వినతులను నిర్లక్ష్యం చేయకుండా పూర్తిస్థాయిలో పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రతి అర్జీపై సమగ్రంగా విచారణ జరిపి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

గడువులోగా సమస్యల పరిష్కారం

ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు పంపించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని డీఆర్ఓ ఆదేశించారు. ప్రజలకు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

సమన్వయంతో పనిచేయాలి ప్రజా సమస్యల పరిష్కారంలో వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అంబదాస్ రాజేశ్వర్ స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అర్జీకి తగిన విధంగా స్పందించి పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు.

# ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలి

- గుంతలు, బురదమట్టి, పిచ్చి మొక్కలతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- ఆదిల్‌పేట--రసూల్‌పల్లె--జైపూర్ రోడ్డును నూతనంగా నిర్మించాలని బీజేపీ నాయకుల వినతి



**మన ప్రజావాణిమందమర్రి ఆగస్టు 24**మందమర్రి: మందమర్రి మండల పరిధిలోని ఆదిల్‌పేట నుంచి రసూల్‌పల్లె మీదుగా జైపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి తీవ్రంగా దెబ్బతినడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మందమర్రి మండలం ప్రజావాణి అధికారికి వినతిపత్రం సమర్పించారుసంద్రోనిపల్లె గ్రామం దాటిన అనంతరం సారంగపల్లి (దుబ్బపల్లె గ్రామ) మూలమలుపు వద్ద రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, వర్షపు నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో వాహనదారులకు వాటి లోతు తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు అదేవిధంగా ఆదిల్‌పేట నుంచి పొన్నారం మీదుగా రసూల్‌పల్లె, జైపూర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై బురదమట్టి, మట్టి కుప్పలు పేరుకుపోవడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, పొదలు, చెట్లు పెరిగి రహదారి ఇరుకుగా మారిందని పేర్కొన్నారు. దీంతో వాహనాలు ఎదురెదురుగా వెళ్లే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకుగురవుతున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందన్నారు.ఈ రహదారిపై ప్రతిరోజూ విద్యార్థులు, రైతులు, ప్రజలు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనదారులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నందున అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.

అధికారులు చేపట్టాల్సిన చర్యలురోడ్డుపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి మరమ్మతులు చేపట్టాలిపేరుకుపోయిన బురదమట్టి, మట్టి కుప్పలను తొలగించాలి. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్లు, పిచ్చి మొక్కలు, పొదలను తొలగించాలి ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి వర్షపు నీరు రోడ్డుపై నిల్వ కాకుండా శాశ్వత డ్రైనేజీ చర్యలు చేపట్టాలిఆదిల్‌పేట నుంచి రసూల్‌పల్లె మీదుగా జైపూర్ వరకు ఉన్న ప్రధాన రహదారిని పూర్తిగా నూతనంగా నిర్మించాలి ప్రజల ప్రాణాలు, వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు ఈ కార్యక్రమంలో బీజేపీ మందమర్రి మండల ప్రధాన కార్యదర్శి వంజరీ వెంకటేష్ , ఆడిగోపుల్ల మురళీ, కాల్వల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్.రేషన్ కార్డులు పంపిణీ

- ఏఎంసీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య.



**రాయపోల్ ఆగస్టు 24 (ప్రజావాణి)**సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోపేద ప్రజలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించేందుకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టడం జరిగిందని ఏఎంసీ చైర్మన్ గొల్లపల్లి కనకయ్య అన్నారు. సోమవారం రాయపోల్ మండల కేంద్రంలో లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డులు పీవీసీ కార్డు రూపంలో ఉండటంతో పాటు క్యూఆర్ కోడ్ వంటి డిజిటల్ సౌకర్యాలను కలిగి ఉంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన కుటుంబాలకు వీటిని పంపిణీ చేయనున్నారు.నూతన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత, వేగం, జవాబుదారీతనం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమై, ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులకు కార్డులను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ సర్పంచ్ మాసంపల్లి రాజు, ఉప సర్పంచ్ హనుమంతు రాజు, వార్డు సభ్యులు కనకయ్య, జిపిఓ నర్సింలు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కిష్టారెడ్డి, మల్లారెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి

**రాయపోల్ ఆగస్టు 24 (ప్రజావాణి)** బాల్య వివాహాల వివాహాలు అరికట్టుట అంశంపై తొగుట మండలంలోని కస్తూర్బా పాఠశాలలో ఆశ్రిత సంస్థ వారి ఆధ్వర్యంలో తొగుట ఎస్సై గారు ముఖ్యఅతిథిగా అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలికల విద్య మరియు భవిష్యత్తుపై వాటి ప్రభావం గురించి విద్యార్థులకు వివరించడం జరిగింది. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాలికల హక్కులను కాపాడాలని అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

బాల్య వివాహం అంటే 18 సంవత్సరాల వయస్సు పూర్తికాకముందే బాలికకు మరియు 21 సంవత్సరాలు పూర్తికాకముందే అబ్బాయికి వివాహం చేయడం.

1) ఇది బాలికల విద్య, ఆరోగ్యం, భద్రత మరియు భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

2)బాలికలు చదువును మధ్యలోనే ఆపివేసే అవకాశం ఉంటుంది. చిన్న వయస్సులో వివాహం ఆరోగ్యపరమైన సమస్యలకు దారితీయవచ్చు.

3)బాలికల హక్కులు మరియు స్వేచ్ఛకు భంగం కలుగుతుంది.



ఆర్థికంగా, సామాజికంగా కుటుంబాలపై ప్రభావం పడుతుంది.

4)బాల్య వివాహాలు చట్టవిరుద్ధమైనవి.

బాలికలకు విద్య, నైపుణ్యాలు, స్వయం సాధికారత కల్పించడం చాలా ముఖ్యం.

"బాల్య వివాహాలకు నో చెప్పి, బాలికల విద్యకు ప్రోత్సాహం ఇవ్వాలి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయాలి. అని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది.

ఇట్టి కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపల్ మరియు



సిబ్బంది, తొగుట ఎస్సై గారు మరియు పోలీస్ సిబ్బంది, ఆశ్రిత ఎన్జీవో సంస్థ వారు పాల్గొనడం జరిగింది, ఇటి కార్యక్రమంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది.

# గ్రామాల్లో అధిక ధరలకు మద్యం విక్రయం..

- రెండు చేతుల సంపాదన గణం...
- సిండికేట్ చేతుల్లో ధరల దోపిడి..
- దుకాణాల్లో ఒక రేటు బెల్ట్ షాపుల్లో మరొక రేటు
- అధికారుల చర్యల కోసం మద్యం ప్రియుల ఎదురుచూపులు...



**రంగారెడ్డి జిల్లా బ్యూరో. ఆగస్టు 24. ప్రజావాణి.** నిబంధనలు ఒకటి ఆచరణ మరొకటి. అమ్మకాలు ఇంకొకటి అన్నట్లుగా రంగారెడ్డి జిల్లా చేవెళ్ల. షాబాద్.మొయినాబాద్. మండలాల్లోని ఆయా గ్రామాల్లో మద్యం విక్రయాలపై ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మద్యం దుకాణాలు బెల్ట్ దుకాణాల వద్ద అధిక ధరల వసూళ్ళ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల సిండికేట్ గా ఏర్పడి ధరలను తమ ఇష్టానుసారంగా పెంచి మద్యం. విక్రయిస్తూ మద్యం ప్రియుల జేబులకు చిల్లు పెడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని కొన్ని గ్రామాల్లో అధిక ధరల అభిప్రాయాలపై చర్చ జరుగుతుంది. మద్యం దుకాణాల వద్ద ధరల పట్టికల స్పష్టంగా కనిపించకపోవడంతో వినియోగదారుల నుంచి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిర్ణయించిన ధరలకంటే ఎక్కువ వసూలు చేస్తున్న సంబంధిత శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# బాల్యం పై పుస్తకాల భారం?

- పెరుగుతున్న బడి పుస్తకాల బరువు
- కిలోల కొద్ది బరువును విద్యార్థుల వీపునకు తగిలిస్తున్న వైనం
- పుస్తకాల అధిక బరువు పిల్లల పాలిట శాపంగా మారనుందా?
- బరువుకు మించిన బడి సంచి
- విద్యార్థులకు తప్పని తిప్పలు
- అమలు కానీ నో బ్యాగ్ డే

**మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, ఆగష్టు 24(ప్రజా వాణి )** ప్రైవేటు,కార్పోరేట్ విద్యాసంస్థల్లో ఒత్తిడితో కూడిన విద్య బోధనతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు.నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో విద్యార్థులపై మళ్లీ బ్యాగు భారం మొదలైంది.అడుతూ, పాడుతూ చదువుకోవాల్సిన వయసులో పుస్త కాల భారం విద్యార్థులకు శాపంగా మారుతోంది.ఏటా పై తరగతికి వెళ్తుంటే, పుస్తకాల సంఖ్య కూడా పెరుగుతోంది.ప్రైవేటు స్కూళ్లలో పిల్లలు,బ్యాగు నిండా పుస్తకాలతో నాలు గైదు అంతస్తుల మెట్లు ఎక్కేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఫలితంగా పట్టుమని 15 ఏళ్లు నిండక ముందే చాలా మంది నడుము, మెడ నొప్పి, కండరాల సమస్యల తో సతమతమవుతు న్నారు.విద్యార్థులకు గుణాత్మక నైపుణ్యత విద్యను అందించాలని విద్య హక్కు చట్టం చెబుతున్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం పట్టించుకున్న పాపాన పోలేదు.పుస్తకాల భారం తగ్గించాలని,2006లో కేంద్ర ప్రభుత్వం



ప్రత్యేక చట్టం తీసుకొచ్చిన ప్పటికీ,వాటిని అమలు చేయడం లేదు,దీంతో విద్యార్థులు అవస్థలు పడుతూనే ఉన్నారు. మరోవైపు పిల్లలపై పుస్తకాల భారం వలన వారి శారీరక, మానసిక ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావం పడుతుంది.పాఠశాల బ్యాగుల బరువు, తరగతి గదిలో అవసరమయ్యే పుస్తకాల సంఖ్య, ఇంటి వద్ద చదవాల్సిన హోంవర్క్ పుస్తకాల పరిమాణం అన్నీ కలిపి పిల్లలపై అధిక భారాన్ని పెంచుతున్నాయి.బరువైన పుస్తకాలు మోయడం వలన వెన్నునొప్పి,కండరాల నొప్పులు, భుజాల నొప్పి వంటి శారీరక సమస్యలు వస్తాయి. పుస్తకాల భారం పిల్లలపై ఒత్తిడిని పెంచుతుంది.ఇది వారి మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది.చదువుపై ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు వస్తాయి.అవసరం ఉన్న లేకున్నా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్ది బరువులను విద్యార్థుల వీపునకు తగిలిస్తున్నారు. పోటీ చదువుల పేరిట అటు తల్లిదండ్రులు,ఇటు



పాఠశాల యాజమాన్యాలు పిల్లలపై పుస్తకాల భారం మోపుతున్నారు.ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల నిర్వహకులు ఇష్టమొచ్చినట్లు పుస్తకాలు అంటగడుతున్నారు.దీంతో పుస్తకాల అధిక బరువు పిల్లల పాలిట శాపంగా మారనుంది. పాఠశాలలు పుస్తకాల సంఖ్య తగ్గించాలి అవసరమైన పుస్తకాలను మాత్రమే అందించాలి అనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించేలా ఆయా పాఠశాలల్లో ర్యాక్స్ ఏర్పాటు చేసి పాఠ్యపుస్తకాలు అన్ని పాఠశాలల్లోనే ఉంచుతూ,హోంవర్క్ పుస్తకాలు మాత్రమే ఇంటికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని విద్యావంతులు, మేధావులు,ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. పిల్లలకు పుస్తకాలతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించేలా విద్యాబోధన ఉండాలని ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు.

# పోతుగల్ గ్రామంలో గడ్డి మందు పిచికారి చేయించిన గ్రామ సర్పంచ్ పామెన నర్సింహులు.





**రంగారెడ్డి జిల్లా బ్యూరో. ఆగస్టు 24. ప్రజావాణి.** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని పోతుగల్ గ్రామ సర్పంచ్ పామెన నర్సింలు. ఉప సర్పంచ్ నేరెట్లసావిత్రి. మరియు పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం దగ్గర నుండి గ్రామ పురవీధుల్లో వేపుగా పెరిగిన గడ్డిని పూడ్చివేయడానికి గ్రామ సర్పంచ్ పామెన నర్సింలు తన సొంత నిధులతో గ్రామంలో గడ్డి మందు మందులు పిచికారి చేయడం పట్ల గ్రామ ప్రజలు గ్రామ సర్పంచ్ పామెన నరసింహులను మరియు మరియు ఉప సర్పంచ్ నేరెట్ల సావిత్రి కి మరియు పాలకవర్గా నికి పోతుగల్ గ్రామ ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా ఈ గడ్డి మందును పిచికారి కార్యక్రమం చేపట్టా నని.గ్రామ సర్పంచ్ పామేనా నర్సింలు సోమ వారం ప్రజావాణి బ్యూరోకు ఒక ప్రకటనలో తెలిపారు.

# వామపక్ష విద్యార్థి సంఘా నాయకులపై పెట్టిన కేసును వెంటనే వెతివేయాలి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్ధుల జంగయ్య డిమాండ్

**షాద్ నగర్ప్రజా వాణి ఆగస్ట్24:** ప్రజాస్వామ్య పద్ధతిలో నీరుసన తెలపడం కూడా నేరంగా పరిగణిస్తే ఎట్లా ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బుద్ధుల జంగయ్య ప్రశ్నించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు రాజ్యాంగబద్ధకంగా జరగాల్సిన న్యాయం జరగకపోగా పాలక ప్రభుత్వాలు ప్రజలకు వ్యతిరేకమైన జీవోలను తీసుకువచ్చి అక్రమంగా అమలు చేయాల్సి వచ్చినప్పుడు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతారు అలాంటి ప్రతి నిరసనకు పోలీసులతో అనుమతి తీసుకోవాలంటే అది కుదరని పరిస్థితి ఆ మూమెంట్ను బట్టి ఆ ఉద్యమ పరిస్థితిని బట్టి పోరాటాన్ని నిర్ణయించడం జరుగుతుంది అంతేకానీ కావాలని రోడ్లమీద కొచ్చి పోరాటాలు చెయ్యాల్సిన అవసరం ఉండదు అది పోలీసులు గమనిస్తే బాగుంటుందని ఆయన అన్నారు షాద్నగర్ పోలీసులకు అత్యుత్సాహం కాకపోతే ఆర్డీవో ఆఫీస్ దగ్గరజీవో నెంబర్ 97 పాలిటెక్నిక్ విద్యార్థులకు సంబంధించిన సమస్యపై షాద్నగర్ టు హైదరాబాద్ లింగారెడ్డి గూడ చౌరస్తా రోడ్డుపై పోరాటం చేస్తుంటే విద్యార్థులకు మద్దతుగా ఏఐఎస్ఎఫ్ ఆకాశ్ నాయక్ ఎస్ఎఫ్ఐ శ్రీకాంత్ బిజెపి పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మద్దతు తెలపడమే తప్పుగా పరిగణిస్తే డెమోక్రసీ పద్ధతిలో ఇది ఎట్లా సరైనది పోలీసులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నది



పాలిటెక్నిక్ విద్యార్థులుగా పోలీసుల పిల్లలు కూడా ఉండి ఉంటారు వారి భవిష్యత్తు ఏంది వాళ్ళకి ఈ విషయంపై గానీ హవగాన ఉన్నదా నిజంగా హవగాహననే ఉండి ఉంటే పోలీసులు సీఎం రేవంత్ రెడ్డి గారికి ఒక లెటర్ రాయాలి అయ్యా ముఖ్యమంత్రి గారు నిజంగా జీవో నెంబర్ 97 పాలిటెక్నిక్ పిల్లలకు ఇది శాపంగా మారింది కావున దీని వెంటనే రద్దు చేయాలని యావత్ ప్రజానీకం మీ వెంట ఉండి సపోర్ట్ చేస్తది అంతేకానీ ఉద్యమించె వారిపై అక్రమకేసులు పెట్టడం అనేది పోలీసులకు సరైనది కాదు వెంటనే పెట్టిన కేసులు ఎత్తివేయాలని సిపిఐ పార్టీగా డిమాండ్ చేస్తా ఉన్నాం

లేనియెడల ప్రజాస్వామ్య పద్ధతిలో సిపిఐ పార్టీగా కలిసి వచ్చే పార్టీలను సంఘాలను అనిటిని కలుపుకొని ఉద్యమించాల్సిన అవసరం ఉంటుందని దానికి షాద్నగర్ పోలీసులే బాధ్యత

# నిస్వార్థ పోరాట యోధుడు సారంపల్లి మల్లారెడ్డి



**మహబూబాబాద్ జిల్లా బ్యూరో ప్రతినిధి, ఆగష్టు 24(ప్రజా వాణి )** నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు ప్రజలు, రైతులు, కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేసిన నిస్వార్థ పోరాట యోధుడు సారంపల్లి మల్లారెడ్డి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్,రైతు సంఘం మండల అధ్యక్షులు గడ్డిపాటి రాజారావులు అన్నారు.అనారోగ్యంతో మృతి చెందిన రైతు సంఘశీ జాతీయ నాయకులు, సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి సంతాపసభను స్థానిక మంగపతిరావు భవనంలో సిపిఎం,రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ, దేశానికి వెన్నెముకగా నిలిచిన రైతంగ సమస్యల పట్ల మల్లారెడ్డి చేసిన పోరాటం మరువలేనిదని,ఆయన లేని లోటు రైతులకు, కార్మికులకు,ప్రజలకు తీరని లోటు అని అన్నారు.నవసమాజ నిర్మాణం కొరకు కృషి చేశారని తెలిపారు. ఆయన కన్న కలలను సాకారం చేయడానికి సిపిఎం శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, సిపిఎం, రైతు సంఘాల నాయకులు ఎం నాగమణి, కె. ఈశ్వర్ లింగం, కె.రామకృష్ణ, ఎస్.కె మౌలానా, కే మహేశ్వరరావు,జి వీరభద్రం, ఎస్ కే బాజీ,టి నాగేశ్వరరావు, కోటయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం, ఆగస్టు 25, 2026

మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ

15


# బోలోనిపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**నల్లబెల్లి ఆగస్టు 24 ప్రజావాణి :** నల్లబెల్లి మండలంలోని బోలోనిపల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సిద్ధ సంతోష్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ స్మార్ట్ రేషన్ కార్డులను పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ బోళ్ల సర్వేశం, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్ ఉదయభాను, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంపత్ గారు జీపీఓ క్రాంతికుమార్, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్మూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు మరోసారి దరఖాస్తుల ఆహ్వానం



**ఆర్మూర్ టౌన్ ఆగస్టు 24(మన సమగ్ర ప్రజావాణి):** ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్ల కోసం గతంలో దరఖాస్తు చేసుకోలేని అర్హులైన పేదలకు మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ నెల 22న తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి నిర్వహించిన సమావేశంలో గతంలో దరఖాస్తు చేసుకోలేని వారికి మరో అవకాశం కల్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాల మేరకు జిల్లా ఉన్నతాధికారుల సూచనలతో ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోలేని వారు మాత్రమే ఆగస్టు 25 నుంచి 31వ తేదీ వరకు ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుకు జత చేయాల్సిన పత్రాలు: దరఖాస్తు పత్రం, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల ప్రతులు, ఆహార భద్రతా కార్డు ప్రతులు, ఓటరు గుర్తింపు కార్డు ప్రతులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్ణీత గడువులో దరఖాస్తులు సమర్పించాలని తహసీల్దార్ కోరారు.

# శివకేశవ ఆలయంలో శ్రావణమాస ప్రత్యేక అన్న పూజ





**మన ప్రజావాణి మందమర్రి:- ఆగస్టు 24** పట్టణంలోని అంగడి బజార్ లోని శివకేశవ ఆలయంలో శ్రావణమాస సోమవారం సందర్భంగా శివునికి ప్రత్యేక అన్నపూజ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగగా, భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, శ్రావణమాసం సందర్భంగా మొదటి సోమవారం సైతం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించామని, రెండో సోమవారం సైతం కొనసాగిస్తున్నామని తెలిపారు. మిగిలిన రెండు సోమవారాల్లో సైతం అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. ఆలయ కార్యక్రమాలకు సహకరిస్తున్న భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కొందుర్గులో 102, 108 అంబులెన్స్‌ల ఆకస్మిక తనిఖీ

- **అత్యవసర వైద్య సేవలు ఎల్లవేళలా అందుబాటులోలి ఉండాలి: అధికారుల ఆదేశం**



**షాద్ నగర్ ప్రజా వాణి ఆగస్ట్ 24:** కొందుర్గు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అత్యవసర వైద్య వాహన సేవలైన 102, 108 అంబులెన్స్‌లను జిల్లా వాహన వైద్య సేవల అధికారులు రాజబాబు, జాన్ షాహిద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు అంబులెన్స్‌లలో అందుబాటులో ఉన్న అత్యవసర వైద్య పరికరాలు, మందులు, ఆక్సిజన్ సదుపాయాలు, ఇతర వైద్య సామగ్రిని,వాహనాల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి జాప్యం లేకుండా రోగులను ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్స్‌లను ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో 102, 108 సిబ్బంది ఈఎంటీ రమేష్, పైలట్ నరేష్, కెప్టెన్ రాఘవేందర్ పాల్గొన్నారు.

# ఉచిత వృత్తి విద్యా శిక్షణ కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

- **సింగరేణి ఏరియా డిజిఎం పర్సనల్ సిహెచ్ అశోక్**

**మన ప్రజావాణి మందమర్రి:-ఆగస్టు 24** సింగరేణి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళలు, యువత స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా పలు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఈ ఉచిత వృత్తి విద్యా శిక్షణ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని డిజిఎం (పర్సనల్) సిహెచ్ అశోక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ కోర్సులకు 3 నెలల శిక్షణ, కంప్యూటర్ డిటిపి కోర్సు కు 2నెలల శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. గనుల ద్వారా భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల భార్య, పిల్లలు, ఏరియా సింగరేణి కార్మికులు, మాజీ కార్మికుల భార్య, పిల్లలు, కేకే ఓసిపి, ఆర్కేపి ఓసిపి ప్రాజెక్టుల పరిసర ప్రాంతాల ప్రజలు, బెల్లంపల్లి, కాసిపేట, సోమగూడెం, మందమర్రి, రామకృష్ణాపూర్ చుట్టుపక్కల గ్రామాల మహిళలు ఈ వృత్తి శిక్షణ తరగతులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఏరియా జిఎం కార్యాలయం నందు గల జిఎం పిఏ కార్యాలయంలో ఆగస్టు 31 లోపు అందజేయాలని సూచించారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తుల తోపాటు ఎస్ఎస్సి మెమో, ఆధార్ కార్డ్, పాస్ ఫోటో, సింగరేణి ఉద్యోగి లేదా మాజీ కార్మికులైతే ఐడెంటిటీ కార్డుల నకలు పత్రాలు జారీచేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 7032878575, 9490940391 లో సంప్రదించాలని తెలిపారు.

# బయ్యారం చెరువుకు గోదావరి నీటిని మళ్ళించాలి

- **సీతారామ నీళ్లతోనే బయ్యారం కరువుకు శాశ్వత పరిష్కారం**






**ప్రజావాణి ఆగస్టు 24 బయ్యారం:** సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను బయ్యారం చెరువుకు మళ్లించడమే కరువు నివారణకు శాశ్వత పరిష్కారమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు నందగిరి వెంకటేశ్వర్లు, మోకాళ్ల మురళీకృష్ణ అన్నారు. సోమవారం బయ్యారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురవలేదని, గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనివిధంగా బయ్యారం చెరువు ఇప్పటివరకు అలుగు పడలేదన్నారు. ప్రభుత్వం వెంటనే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆరుతడి పంటలు సాగు చేయాలని అధికారులు సూచిస్తున్నప్పటికీ బయ్యారం చెరువు కాలువలు శిథిలావస్థలో ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే వరి నాట్లు, నారుమడులు వేసిన రైతులు ఎకరానికి రూ. 15 వేల నుంచి రూ. 20 వేల వరకు పెట్టుబడి పెట్టారని, వర్షాభావంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇతర పంటలకు కూడా రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోయే పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బయ్యారం, గార్ల చెరువులతో పాటు ఏజెన్సీ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు అందిస్తామని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిందని నాయకులు గుర్తుచేశారు. వెంటనే సీతారామ ప్రాజెక్టు ద్వారా బయ్యారం చెరువుకు గోదావరి నీటిని మళ్లించాలని డిమాండ్ చేశారు. అలాగే భూమిలేని వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీవోలకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బానోతు నరసింహ, తోకల వెంకన్నతో పాటు పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# బడ్జెట్ లో విద్య వైద్యానికి 40 శాతం నిధులు కేటాయించాలి

- **రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు ఎం ఎల్ సి తీన్మార్ మల్లన్న**







**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆగస్టు 24 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** యువతే దేశ భవిష్యత్తు తీన్మార్ మల్లన్న విద్య, వైద్యానికి 40 శాతం బడ్జెట్ కేటాయించాలిమేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఈసీఐఎల్ మైదానంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు చక్రపాణి గౌడ్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ బందారపు నర్సయ్య గౌడ్ పర్యవేక్షణలో నిర్వహించిన Gen Z Adda with Mallanna కార్యక్రమంలో పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది మంది విద్యార్థులు హాజరై విద్య, ఉపాధి, రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లు, రాజకీయాలపై చిట్ చాట్ లో ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ, యువత ప్రశ్నించే ధైర్యం పెంచుకోవాలని, అన్యాయాలపై గళమెత్తాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్య రంగాలకు బడ్జెట్‌లో కనీసం 40 శాతం నిధులు కేటాయించాలని, మొదటి తరగతి నుంచి ఉన్నత విద్య వరకు అందరికీ ఉచిత విద్య అందించడమే తమ పాలసీ అని తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీపై పోరాటం కొనసాగిస్తామని, ఆర్ టి ఈ 2009 ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు అమలు చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని చెప్పారు. కుల వివక్ష కొనసాగుతున్నంత కాలం రిజర్వేషన్లు అవసరమేనని, రిజర్వేషన్లు తొలగించాలంటే ముందుగా కుల వ్యవస్థ నిర్మూలన జరగాలని అన్నారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై అసెంబ్లీలో గట్టిగా పోరాడతామని హామీ ఇచ్చారు. అలాగే 2028లో ఆలేరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని, ఉప్పల్ నుంచి టీఆర్పీ తరపున చక్రపాణి గౌడ్ పోటీ చేస్తారని ప్రకటించారు.

సెప్టెంబర్ 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 14 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టి రాజ్యాధికారం సాధిస్తామని మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. టీఆర్పీ ఎన్నికల గుర్తు కత్తెర అని, అవినీతి శక్తుల తోకలు కత్తిరించడానికే ఆ గుర్తును ఎంచుకున్నామని తెలిపారు కార్యక్రమం అనంతరం వివిధ కళాశాలల విద్యార్థులకు తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా మెరిట్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో టీఆర్పీ నాయకులు, యువజన ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు మరో ముందడుగు

- **తిరుపతిలో అధునాతన మహిళా పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం**






**తిరుపతి, ఆగస్టు 24:** మహిళల భద్రత, రక్షణకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్ సమీపంలో నిర్మించిన అధునాతన మహిళా పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని రాష్ట్ర హోం శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి శ్రీ అనగాని సత్యప్రసాద్ సోమవారం ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించిన అనంతరం స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు.

జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఐఏఎస్., పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**రూ.2.70 కోట్లతో అధునాతన భవనం**

సుమారు రూ. 2.70 కోట్ల వ్యయంతో 8,480 చదరపు అడుగుల విస్తీర్ణంలో మోడల్ మహిళా పోలీస్ స్టేషన్‌ను నిర్మించారు. మహిళా బాధితులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించడంతో పాటు పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు ఆధునిక మౌలిక వసతులను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా హోం శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత మాట్లాడుతూ మహిళల భద్రత, రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా బాధితులకు తక్షణ పోలీస్ సేవలు, న్యాయం అందించడంతో పాటు వారికి ధైర్యం, భరోసా కల్పించేలా మహిళా పోలీస్ స్టేషన్లను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

మహిళలు ఎటువంటి భయం, సంకోచం లేకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. బాధితుల సమస్యలను సున్నితంగా స్వీకరించి, చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైన సందర్భాల్లో కౌన్సెలింగ్ ద్వారా కుటుంబ సమస్యలకు పరిష్కారం చూపేలా పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని పేర్కొన్నారు.

**కౌన్సెలింగ్ కేంద్రం, చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్**

కుటుంబ, దాంపత్య, సామాజిక సమస్యలను వీలైనంత వరకు కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించేందుకు ప్రత్యేక కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అవసరమైన వారికి వారానికి రెండు రోజుల పాటు మానసిక వైద్య నిపుణుల సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుల కోసం వచ్చే మహిళలతో పాటు వచ్చే చిన్నారుల కోసం ప్రత్యేకంగా చైల్డ్ ఫ్రెండ్లీ కార్నర్ ఏర్పాటు చేశారు. చిన్న పిల్లలతో వచ్చే మహిళలకు అవసరమైన ప్రత్యేక వసతులను కూడా కల్పించారు.

కుటుంబ సంబంధాలు, పెద్దలను గౌరవించడం, చిన్నారుల పెంపకం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించే సమాచార బోర్డులను ఏర్పాటు చేశారు.

**24 గంటల సైబర్ సహాయ కేంద్రం**

మహిళలపై జరిగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ వేధింపులు, ఇతర డిజిటల్ నేరాలపై వేగంగా స్పందించేందుకు 24 గంటల సైబర్ సహాయ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ మహిళలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే దీని ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

**94 నుంచి 58కి తగ్గిన మహిళలపై నేరాలు**

తిరుపతి జిల్లాలో మహిళలపై నమోదవుతున్న నేరాల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే 94 నుంచి 58కి తగ్గడం గమనార్హమని మంత్రి తెలిపారు. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ చేపడుతున్న నిరంతర చర్యలు, అవగాహన కార్యక్రమాలు, పటిష్టమైన పోలీసింగ్ ఇందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.

ప్రజలకు నిరంతరం భద్రతా భరోసా కల్పించేలా విజిబుల్, ఇన్విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. పోలీస్ శాఖలో మౌలిక వసతుల అభివృద్ధి, సిబ్బంది సంక్షేమం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**తిరుపతికి పోలీస్ కమిషనరేట్ ప్రతిపాదన పరిశీలనలో**

తిరుపతి ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్, భక్తుల రద్దీ, పోలీస్ శాఖపై పెరుగుతున్న పని ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని తిరుపతికి పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉందని హోం శాఖ మంత్రి తెలిపారు. కమిషనరేట్ ఏర్పాటుతో పోలీస్ సిబ్బందిపై పని ఒత్తిడి తగ్గడంతో పాటు శాంతిభద్రతలను మరింత సమర్థవంతంగా పరిరక్షించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**మహిళల భద్రతే లక్ష్యం**

“మహిళల భద్రతే లక్ష్యం.. రక్షణే మన బాధ్యత” అనే సంకల్పంతో మహిళలకు మరింత భద్రత, గౌరవం, తక్షణ పోలీస్ సహాయం అందించేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., తెలిపారు. మహిళలు తమ సమస్యలను ఎటువంటి భయం లేదా సంకోచం లేకుండా పోలీసులను ఆశ్రయించి అందుబాటులో ఉన్న పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, చంద్రగిరిఎమ్మెల్యే పులివర్తి నాని, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు అదనపు ఎస్పీలు శ్రీ శ్రీనివాసులు (పరిపాలన), శ్రీ రవి మనోహరచారి (శాంతిభద్రతలు), శ్రీ ఐ. రామకృష్ణ (తిరుమల), శ్రీ శ్రీనివాసరావు, శ్రీమతి శ్రీలత (మహిళా పోలీస్ స్టేషన్)తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్సీ రమాదేవి

**అనంతపురం ,ఆగస్టు 24 మన ప్రజా వాణి** ఇటీవల నూతన శాసనమండలి సభ్యురాలు (ఎమ్మెల్సీ) గా ఎన్నికైన దలవాయి రమాదేవి సోమవారం జిల్లా కలెక్టరేట్ లో గౌరవ జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా అభివృద్ధికి సంబంధించి పలుఅంశాలపై చర్చించారు. జిల్లా ను అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు సమన్వయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం

- సైబర్ నేరాలు, మహిళలు--చిన్నారుల రక్షణపై అవగాహన



**పెనగలూరు, ఆగస్టు 24:** చట్టాలపై అవగాహనతోనే నేరాల నివారణ సాధ్యమని, విద్యార్థులు చిన్ననాటి నుంచే చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని పోలీసులు సూచించారు. తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు పెనగలూరు ఎస్ఐ ఆధ్వర్యంలో సోమవారం పెనగలూరు పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రత, మహిళలు--చిన్నారుల రక్షణ తదితర అంశాలపై పోలీసులు అవగాహన కల్పించారు.

**చట్టాలపై అవగాహన అవసరం**

పోక్సో చట్టం, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు, మహిళలు--చిన్నారులపై నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అలాగే చైన్ స్నాచింగ్‌లను అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎవరికీ వెల్లడించరాదని సూచించారు.

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించిన పోలీసులు వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. చెడు అలవాట్లకు లోనుకాకుండా విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు.

**శక్తి యాప్, పీఎం రాహత్‌పై అవగాహన**

మహిళల రక్షణ కోసం అందుబాటులో ఉన్న శక్తి యాప్, ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే పీఎం రాహత్ పథకం, వివిధ అత్యవసర టోల్‌ఫ్రీ నంబర్ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించడం, ట్రాఫిక్ నిబంధనలను గౌరవించడం, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం వంటి రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, బాల్యవివాహాలు వంటి సామాజిక సమస్యలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

# గార్లదిన్నె బస్టాండ్‌లో నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ

**అనంత పురం బ్యూరో ఆగస్టు 24 మన ప్రజా వాణి** అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలంలోని బస్టాండ్ ఆవరణంలో కీర్తిశేషులు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత నందమూరి తారక రామారావు సినీ రంగంలో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆయన, రాజకీయ రంగంలోకి ప్రవేశించి "తెలుగు వారి ఆత్మగౌరవం" నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారున్నారు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారు. ఆయన సేవలు, ఆశయాలు, సిద్ధాంతాలు నేటికీ తరతరాలకు



స్ఫూర్తిదాయకం.ఎన్టీఆర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేయడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు ,పార్టీ ప్రధాన కార్యదర్శి



శ్రీధర్ చౌదరి , ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటి మడుగు కేశవరెడ్డి టీడీపీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి ఆలం నర్సానాయుడు మండల కన్వీనర్ పండు , కృష్ణారెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాయలసీమకు జల ద్రోహం పై వైఎస్ఆర్సిపి సమరభేరి మోగించండి

- రైతుల తో కలిసి పోతిరెడ్డిపాడు సందర్శించేందుకు వెళుతున్న వైఎస్ఆర్సిపి నేతలను పోలీసులు అడ్డుకున్నారు
- రాయలసీమకు నీటిని సరఫరా చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





**అనంత పురం బ్యూరో ఆగస్టు 24 మన ప్రజా వాణి** రాయలసీమకు నీటిని సరఫరా చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులతో కలిసి పోతిరెడ్డి పాడు సందర్శించేందుకు వెళుతున్న వైఎస్ఆర్సిపి నేతలను అడ్డుకున్నారని ఇది సమంజసం కాదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ సమన్వయకర్త తోపు దుర్తి ప్రకాష్ రెడ్డి ప్రభుత్వంపై సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రైతు వ్యతిరేక విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శ్రీశైలం డ్యాం నుంచి పోతిరెడ్డిపాడు హెగ్యులేటర్ కు 854 అడుగులకు నీరు రాగానే విడుదల చేయవలసినటువంటి నీటిని విడుదల చేయకపోవడం,,తుంగభద్ర డ్యామ్ పూర్తిగా నిండిన కూడా రాయదుర్గం అనంతపురం జిల్లా రైతులకు నీటిని విడుదల చేయకపోవడం ఒకవైపు అక్కడ తుంగభద్ర డ్యామ్ నుంచి కర్ణాటక రైతులకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక్కడ శ్రీశైలం డ్యాం నుంచి తెలంగాణ రైతులకు నీటిని విడుదల చేస్తున్నారు.దిగువకు నాగార్జున సాగర్ డ్యాంకు కోస్తా ప్రాంతా రైతులకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎటు చూసినా గాని ,శ్రీశైలం డ్యాం నుంచి గాని టీబీ డ్యాం నుంచి గాని రాయలసీమ ప్రాంతానికి మాత్రం నీటిని విడుదల చేయడం లేదు అంటే ప్రభుత్వం చిత్తశుద్ధితో రాయలసీమకు రాయలసీమ రైతులకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. వీరు ఎంతసేపు కూడా రాయలసీమలో ప్రాజెక్టులను కేవలం నిధులు పా రించడానికి దోపిడీకి మాత్రమే ఉపయోగిస్తున్నారు. చంద్రబాబు నాయుడు ఆ రోజు నుంచి ఈరోజు వరకు కూడా కానీ రైతుకి అన్యాయం జరుగుతోంది. జగన్ హయాంలో 90 టీఎంసీల నీరు నిర్వహించిన తర్వాత దాదాపు రెండు పంటలకు నీటిని విడుదల చేసిన చరిత్ర జగన్మోహన్ రెడ్డి ది. ఈరోజు 175 టీఎంసీలు నీరు శ్రీశైలం డ్యామ్ లో ఉంది అయినా కూడా ఎందుకు శ్రీశైలం డ్యామ్ నుంచి నీరు విడుదల చేయలేదు పంటలు వేసుకున్నటువంటి రైతుల పరిస్థితి ఏమిటి కనీసం ఒక్క పంట కైనా నీరు ఇవ్వమని న్యాయంగా అడుగుతున్నటువంటి కోరికను కూడా పట్టించుకోకుండా.పోతిరెడ్డిపాడు హేగ్యులేటర్ సందర్శనకు వెళ్ళనీయకుండా అడ్డుకున్నటువంటి దమనీయ వైఖరిని ఖచ్చితంగా రాయలసీమ ప్రాంత రైతులు గమనిస్తూ ఉన్నారు .రాజశేఖర్ రెడ్డి కానీ ,జగన్ కానీ రాయలసీమ రైతులు పట్ల ఉన్న ప్రేమ నిదర్శనం ఏమిటంటే ఇదే పోతిరెడ్డిపాడు హేగ్యులేటర్లను 44 వేల సామర్థ్యంతో రాజశేఖర్ రెడ్డి పెంచితే జగన్ దానిని 80 వేల క్యూసెక్కులతో సామర్థ్యంతో పెంచాలని తలపెట్టడం మనకు తెలిసిన విషయమే. ఆ విధంగా కెనాల్సు వైటింగ్ లైనింగ్ చేసే కార్యక్రమం కూడా చేశారు. ఈరోజు చంద్రబాబు నాయుడు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అనేది ఒక పనికిమాలిన ప్రాజెక్ట్ అని మంత్రి నిమ్మల రామానాయుడు తో మాట్లాడిస్తాడు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తిగా ఆపించిన ఘనత చంద్రబాబు నాయుడు ది సాక్ష్యం రేవంత్ రెడ్డి సభలో ఇచ్చినటువంటి ప్రసంగం కనుక ఈ విధంగా తెలుగుదేశం ప్రభుత్వం రాయలసీమ రైతులకు వ్యతిరేకంగా రాయలసీమ రైతులకు ద్రోహం చేస్తూ ఉన్నటువంటి వ్యవహారం ఈరోజు బట్టబయలు అవుతోంది .రాబోయే రోజుల్లో రైతులు తిరగబడే పరిస్థితి చూస్తారు ఈరోజు అంటారు సాకులు వెతుక్కుంటున్నారు కరువు ఉంది కనీసం సిగ్గు ఉండక్కర్లేదా చంద్రబాబు నాయుడు మీరు ఇప్పటివరకు కూడా రైతు భరోసాలో గత సంవత్సరం సంబంధించి రాష్ట్ర గవర్నమెంట్ సంబంధించి 14 వేల బాకీ ఉన్నారు.. ఈ సంవత్సరమం సంబధించి 5 వేలు ఇచ్చినారు. దాదాపు 23 వేల రూపాయలు దాదపు 53 లక్షల మంది రైతన్నలకు ఒకొక రైతు కి 23 వేల రూపాయలు బాకీలు చెల్లించాలి.. రెండు సంవత్సరాల నుంచి పంట భీమా డబ్బులు చెల్లించలేదు.. భీమా సౌకర్యం లేదు సున్న వడ్డీ రాయితీ కూడా ఇవ్వటంలేదు గత ప్రభుత్వం లో ప్రీమియం జగన్ చెల్లించే వారు ఇప్పుడు అది కూడా లేదు అ ప్రీమియం కూడా రైతులు కట్టుకునే పరిస్థితి వచ్చింది..

# మునివెంకటప్ప ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి



**మన ప్రజావాణి చౌడేపల్లి, ఆగస్టు 24** అట్టడుగు స్థాయి నుంచి ఐఏఎస్ అధికారిగా ఎదిగి, ప్రభుత్వంలో ఎన్నో ఉన్నత పదవులను అలంకరించి సమాజానికి నీతి, నిజాయితీతో సేవలందించిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి. మునివెంకటప్ప ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు సూచించారు.మునివెంకటప్ప వర్ధంతి సందర్భంగా సోమవారం మర్రిమాకులపల్లి ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాదముని నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ప్రొఫెసర్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి గౌతమి, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన సామాజిక కార్యకర్త సహన, చౌడేపల్లికి చెందిన రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ రెడ్డెప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అలాగే సమతా సైనిక్ దళ్, అంబేద్కర్ భవన్ సంఘం సభ్యులు కురపర్తి శ్రీనివాసులు, డిష్ సూరి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మునివెంకటప్ప జీవిత విశేషాలను, ఆయన సేవలను విద్యార్థులకు వివరించారు.దళిత కుటుంబంలో జన్మించిన మునివెంకటప్ప ఎన్నో కష్టాలను అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించి ఐఏఎస్ స్థాయికి ఎదిగారని, ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజలకు అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. ఆయన జీవితం సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించడంతో పాటు సమాజం పట్ల బాధ్యత, నీతి, నిజాయితీ వంటి విలువలను అలవరచుకోవాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజావాణి ఆగస్టు 24** కమలాపూర్ మండలశీ శంభునిపల్లి గ్రామానికి చెందిన మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లం రాజిరెడ్డి గారి మాతృమూర్తి బొల్లం సమ్మక్క గారి దశదినకర్మలో హాజరై సమ్మక్క చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు ఈ సందర్భంగా వారి కుటుంబాలకు ప్రగడ సానుభూతిని తెలియజేసి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో తవుటం రవీందర్ వాసాల శ్రీనివాస్ పోడేటి బిక్షపతి బాల పూరి కనక రత్నం శ్రీకాంత్ మరియు తదితరులు పాల్గొన్నారు

# కేశంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పిప్పల్ల శ్రీనాథ్

- ఉత్తర్వులు జారీ చేసిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి
- అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్ ప్రజావాణి ఆగస్టు 24:** యూత్ కాంగ్రెస్ కేశంపేట మండల అధ్యక్షుడిగా పిప్పల్ల శ్రీనాథ్ గారిని నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది కేశంపేట మండలంలో యూత్ కాంగ్రెస్ బలోపేతం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు తెలపటం జరిగింది అదే విధంగా యూత్ కాంగ్రెస్ బలోపేతం కోసం శ్రీనాథ్ నిబద్ధతతో కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కేశంపేట మండలంలో యూత్ కాంగ్రెస్ ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు అదే విధంగా తనకు అప్ప చెప్పిన పదవికి రాష్ట్ర కార్యవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, కొందుర్గు మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అందే మోహన్, సింగిల్ విండో చైర్మన్ జితేందర్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ఖదీర్, వీర్లపల్లి మాజీ సర్పంచ్ అన్వర్, ప్రదీప్ తదితరులు శ్రీనాథ్ కి శుభాకాంక్షలు తెలిపారు..

# ఎరువుల పంపిణీలో నూతన విధానం

- FFS యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు -- బయ్యారంలో సిబ్బందికి శిక్షణ



**ప్రజావాణి బయ్యారం, ఆగస్టు 24:** రైతులకు ఎరువులు పారదర్శకంగా, క్రమబద్ధంగా అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ (FFS) యాప్‌పై బయ్యారం రైతువేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బండారి మల్లయ్య మాట్లాడుతూ సొసైటీ సిబ్బంది కొత్త విధానంపై పూర్తి అవగాహన పెంచుకుని రైతులకు సమర్థవంతమైన సేవలు అందించాలని సూచించారు. రైతువేదికకు తొలిసారిగా వచ్చిన ఆయనను వ్యవసాయ శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. అధికారుల వివరాల ప్రకారం, ఇకపై మండలంలో ఎరువుల పంపిణీ పూర్తిగా FFS యాప్ ద్వారానే జరుగుతుంది. రైతులు ఫార్మర్ ఐడీ లేదా ఆధార్‌తో నమోదు చేసుకుని, భూమి--పంట వివరాలు నమోదు చేసిన తర్వాత QR కోడ్, టోకెన్ ఆధారంగా ఎరువులు పొందవచ్చు. ఈ విధానం ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు రైతుల అవసరాలకు అనుగుణంగా ముందస్తు ప్రణాళిక రూపొందించవచ్చని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో FFS యాప్ అమలు మరో వారం రోజుల్లో ప్రారంభం కానుందని మండల వ్యవసాయ అధికారి వెల్లడించారు. రైతులు ముందుగానే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని నమోదు పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో విజయవంతం చేయండి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వోడితల ప్రణవ్





**ప్రజావాణి ఆగస్టు 24** హుజరాబాద్ లో సర్ పై రెండవ విడత ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మొదటి విడతలో బిఎల్ ఏ లుచూపెట్టిన నిబంధన రెండో విడతల కొనసాగించాలి ప్రతి ఓటర్ ఓటు చాలా ముఖ్యం హుజురాబాద్ నియోజకవర్గం ఉన్న ప్రతి ఓటర్ ఓటు ముఖ్యమని మొదటి విడతలో సర్ ప్రక్రియను విజయవంతం చేసినట్లు రెండో విడుదల కూడా విజయవంతం చేయాలని కరీంనగర్ మాజీ చూడ చైర్మన్ హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వోడితల ప్రణవ్ పిలుపునిచ్చారు సోమవారం రోజున హైదరాబాద్ పట్టణంలో సర్ పేస్ 2 కార్యక్రమం పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని బిఎల్ఎ లకు నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ మొదటి సవరణలో తప్పులు దొర్లిన పేర్లు మార్పులకు అవకాశం ఇచ్చిన సమాచారాన్ని వినియోగించుకోవాలని ఇప్పుడు ప్రతి ఓటర్ను మ్యాపింగ్ చేస్తేనే భవిష్యత్తులో వారి ఓట్లను కాపాడిన వారి నియోజకవర్గంలోని వారి మానవతవాదిని నియోజకవర్గంలో బి ఎల్ ఎ కోఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా అభినందించారు

# పద్మావతి ఉప్పల్ విద్యార్థులకు క్రీడా రంగానికి ఎనలేని సేవలు సేవలు అందించారు

- ఎం ఎల్ ఏ బండారి లక్ష్మా రెడ్డి




**మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా ఆగస్టు 24 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** ఉప్పల్ జడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా సేవలందించిన జి. పద్మావతి పదవీ విరమణ సందర్భంగా సోమవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జి. పద్మావతి ని ఘనంగా సన్మానించి, ఆమె అందించిన సేవలను అభినందించారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో, పాఠశాల అభివృద్ధిలో ఆమె చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. జెడ్పీహెచ్ఎస్ ఉప్పల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా, ఉప్పల్ జోనల్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన పద్మావతి విద్యారంగానికి విశేష సేవలందించారని తెలిపారు. అలాగే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం ఆమె సేవలకు గుర్తింపుగా నిలిచిందన్నారు. పదవీ విరమణ అనంతరం ఆమె ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో గడపాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. అశోక్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పార్టీ నాయకులు తదితరులు హాజరై పద్మావతి కి శుభాకాంక్షలు తెలిపారు.

## మార్కెట్ యార్డ్ లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించండి

- సిబ్బందికి చైర్ పర్సన్ బల్లా పల్లవి ఆదేశం





**అనంతపురం బ్యూరో ఆగస్టు 24 ప్రజా వాణి** ప్రతి శనివారం, ఆదివారం మార్కెట్‌యార్డ్‌కు వచ్చే గొర్రెలు, పశువులను షెడ్ సమీపంలోని పైపులకు కట్టడం వల్ల పైపులు తరచూ దెబ్బతింటున్నాయి. ప్రతి వారం ఒక పైపు విరిగిపోతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, అవసరమైన ప్రదేశాల్లో కాంక్రీట్ పనులు చేపట్టి శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి స్పష్టం చేశారు. అనంతపురం నగర సమీపంలో ఉన్న మార్కెట్ యార్డ్ ను చైర్ పర్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షం కారణంగా నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించి, అక్కడ వెంటనే శుభ్రత పనులు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి చైర్ పర్సన్ బల్లా పల్లవి సూచించారు. అనంతరం గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డ్ లో నిలిచిపోయిన షాపుల నిర్మాణ పనులను చైర్ పర్సన్ బల్లా పల్లవి పరిశీలించారు. మార్కెట్ యార్డ్ అభివృద్ధి, వ్యాపారుల సౌకర్యార్థం పనులను త్వరితగతిన పూర్తిచేసేలా సంబంధిత అధికారులకు ఆమె సూచించారు.

## కంబాలరాయుడుపేటలో రూ.20 లక్షలతో నూతన హెల్త్ సెంటర్ను ప్రారంభించిన ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస ప్రజావాణి ప్రతినిధి** పలాస నియోజకవర్గం, వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేట గ్రామంలో ఎనర్జీ ఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన నూతన హెల్త్ సెంటర్‌ను పలాస శాసన సభ్యులు శ్రీమతి గౌతు శిరీష గారు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నూతన హెల్త్ సెంటర్ అందుబాటులోకి రావడంతో కంబాలరాయుడుపేటతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే



పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పుచ్చ ఈశ్వర రావు ,కర్ని రమణ,



గోవింద పాప రావు , లండ దానేష్ స్థానిక ప్రజలు మహిళలు వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ



**తవణంపల్లి, ఆగస్టు 24 ప్రజావాణి** :తవణంపల్లి మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల తవణంపల్లి నందు, అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో సిడిపిఓ నిర్మల, సూపర్వైజర్ నాగరత్న లావణ్య, పాల్గొనడం జరిగింది, అనంతరం సమావేశంలో సిడిపిఓ నిర్మల మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు, పోషకాహారం, ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే పూర్వ ప్రాథమిక విద్య, పోషకాహారం, ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా తీసుకోవాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా పిల్లల ఎదుగుదల, ఆరోగ్యం, పోషణకు సంబంధించిన అంశాలను వివరించారు.అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు తమ పరిధిలోని పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పీ. లావణ్య, ఎస్.సి. రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తవణంపల్లి మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్





**తవణంపల్లి, ఆగస్టు 24 (ప్రజావాణి):** తవణంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా తహసీల్దార్ మాధవరాజు ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. పట్టాదారు పాసుపుస్తకాలు, భూముల వివరాలు, తవణంపల్లి కాలనీలో అంగన్వాడీ భవనానికి స్థలం కేటాయింపు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. దీంతో వినతిదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

## పలాస నియోజవర్గములో వెనుకబడుతున్న ఇంటింట తెలుగు దేశము కార్యక్రమం

- మందస మండలం లో ముందుకు సాగుతున్న దేశము ఇంటింట ప్రచారము
- పలాస రూరల్ లో అంతంత మాత్రమ సాగుతున్నా. ఇంటింట తెలుగు దేశము ప్రచారము
- వజ్రపు కొత్తూరు మండలంలో కూడా ఇంటింట ప్రచారము చెప్పుకోదగ్గ స్థాయిలో లేదు
- రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు







**పలాస ప్రజావాణి ప్రతినిధి** తెలుగు దేశము పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింట తెలుగు దేశము పార్టీ కార్యక్రమం పలాస నియోజకవర్గం లో మమా గా సాగుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నికల్లో కూటమి సర్కారుకు విజయము సాధించడం లో మందస మండలం ప్రదము స్థానము లో ఉందని అదే పార్టీ పెద్దలు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అలాగే రెండవ స్థానంలో వజ్రపు కొత్తూరు మండలం రెండవ స్థానంలో ఉంది అని లెక్కలు చెబుతున్నారు. అయితే ఆనాటి ఎమ్మెల్యే, ఎంపీ లను గెలిపించేందుకు కృషి చేసినా వారిలో మార్పు వచ్చిందని ఇక్కడ చర్చ జరుగుతుంది.ప్రభుత్వము ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినా ఇంటింటి సర్వే తెలుగు దేశము పార్టీ కార్యక్రమం ఇక్కడ అనుకున్నత స్థాయిలో జరగడము లేదని పలువురు పేర్కొంటున్నారు. పలాస నియోజకవర్గం లో ఇంటింట తెలుగు దేశము పార్టీ ప్రచారము మందస మండలంలోని ముందుకు సాగుతుంది, పలాస రూరల్, వజ్రపు కొత్తూరు మండలంలో అంత అంత మాత్రమే కార్యక్రమం సాగుతుందని రాజకీయ పరి పరిశీలకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.పార్టీ ఆదేశాలు అమలు లో అలక్ష్యం వల్ల స్థానిక సంస్థలు ఎన్నికల్లో నష్టము జరుగుతుంది ?..తెలుగు దేశము సర్కారు రెండేళ్ళు పాలనలో చేసిన అభివృద్ధి కు సంబంధించిన ఇంటింట తెలుగు దేశము ప్రచారము ఇక్కడ మమా అనే మాదిరిగా సాగుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.కొందరు మీడియా ప్రచారము పేరుతో అదికార పార్టీ కు తప్పుడు సంకేతాలు చేస్తున్నారని పలువురు ఆరోపణలున్నాయి. ఇప్పటి కైన తెలుగు దేశము పార్టీ అధిష్టానం దృష్టి సారించాలని ఇక్కడ చర్చ జరుగుతుంది..

## కూటమి సర్కారు పాలనలో పెరుగుతున్న నిత్యవసర సరుకులు ధరలు

- చెక్కరకు చేదు చేసారు.. వంటింట్లో మంటలు రేపుతున్న ఉల్లి ధరలు...
- భారీగా పెరుగుతున్న నిత్యవసర సరుకులు ధరలు
- పెరిగిన ధరలతో సామాన్య మధ్య తరగతి వర్గాలపై భారీ ఆర్థిక భారం
- ధరలను నియంత్రించేది ఎవరు ?







**పలాస ప్రజావాణి ప్రతినిధి** కొత్తగా ఏర్పడినా కూటమి సర్కారు అధికారము లోకి వచ్చాక నిత్యవసర సరుకులు ధరలు భారీగా పెరిగాయి. పెరిగిన ధరలను నియంత్రించేది ఎవరు అని ఇక్కడ చర్చ జరుగుతుంది. ఎన్నడు లేని విధంగా చేదెక్కిన చక్కెర..! వంటింట్లో తీపినిచ్చే చక్కెర ఇప్పుడు పెరిగిన ధరతో చేదెక్కింది.. మరోవైపు రుచినిచ్చే ఉల్లిగడ్డ పెరిగిన ధరతో ఘాటెక్కింది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో అల్లాడుతున్న సామాన్యులు.. ఇప్పుడు చక్కెర, ఉల్లి ధరలు అమాంతం పెరగటం మరింత ఆర్థిక భారాన్ని మోయాల్సిన పరిస్థి

కిలో రూ.75కి రిటైల్ అమ్మకాలు

ఘాటెక్కిన ఉల్లిపాయ..

బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధర కిలో రూ.50

పది రోజుల్లోనే 20 శాతం పెరుగుదల

సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న ధరలు

కృత్రిమ కొరత సృష్టించేందుకు అక్రమ నిల్వలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి పలాస మున్సిపాలిటీ లో ఉల్లి,చక్కెరను బ్లాక్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నడు లేని విధంగా వంటింట్లో తీపినిచ్చే చక్కెర ఇప్పుడు పెరిగిన ధరతో చేదెక్కింది.. మరోవైపు రుచినిచ్చే ఉల్లిగడ్డ పెరిగిన ధరతో ఘాటెక్కింది. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో అల్లాడుతున్న సామాన్యులు.. ఇప్పుడు చక్కెర, ఉల్లి ధరలు అమాంతం పెరగటం మరింత ఆర్థిక భారాన్ని మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారం రోజుల్లోనే చక్కెర, ఉల్లిపాయ ధరలు ఒక్కసారిగా 20శాతం వరకు పెరిగాయి. ప్రస్తుతం జద్పర్ల మార్కెట్‌లో కిలో చక్కెర రూ. 75 నుంచి రూ. 80కి ధర పలుకుతుంది. అలాగే కిలో ఉల్లిపాయలు



రూ.45 నుంచి రూ. 70 రూపాయలు వరకు పెరిగింది. దేనికి తోడు బియ్యము ధరకు రెక్కలు వచ్చాయి. ఇప్పటికైన పెరిగిన ధరలను తగ్గించాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు..

## కూనవరం మండల ఆదివాసీ గిరిజన సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివాసీ హక్కులు, చట్టాల పరిరక్షణకు ఉద్యమాలు చేపడతాం

- 12 గ్రామాలకు భూమి ప్యాకేజీ, ఆర్అండ్ఆర్ వెంటనే కల్పించాలి




**ప్రజావాణి ప్రతినిధి కూనవరం మండలం, ఆగస్టు 24,** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ కూనవరం మండలం కూటూరు గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో 21 మందితో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తెల్లం తమ్మయ్య, కార్యదర్శిగా సున్నం వెంకటేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా తొమ్మిది మందిని ఎన్నుకున్నారు.ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్, శీలం సురేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పులి సంతోష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల హక్కులు, చట్టాలపై పాలక ప్రభుత్వాలు అనేక రకాలుగా దాడులు చేస్తున్నాయని అన్నారు. ఆదివాసీ హక్కులను కాపాడేందుకు నూతన కమిటీ ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలకు రావాల్సిన 100 శాతం ఉద్యోగ రిజర్వేషన్లు, 1/70 చట్టం, పీసా చట్టం వంటి హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడాలని అన్నారు.మహాసభలో ఆమోదించిన ప్రధాన తీర్మానాలు: 1. ఆదివాసీ హక్కుల పరిరక్షణకు 1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం తదితర చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. 2. జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలి. లేకపోతే దాని స్థానంలో ప్రత్యేక జీవో తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించి ఆదివాసీలకు 29 రకాల ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి. 3. ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ కట్టడాలు, భూ అక్రమాలను అరికట్టాలి. 4. గిరిజన గ్రామాలకు త్రాగునీరు, రోడ్లు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి. 5. గిరిజన ప్రాంతంలో వైద్యం, విద్య, ఉపాధి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి .6.ఆదివాసీ భాష, సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను పరిరక్షించాలి. 7.కూనవరం మండలంలోని ప్రభావిత 12 గ్రామాలకు వెంటనే భూమి ప్యాకేజీ, ఆర్అండ్ఆర్ పునరావాసం కల్పించాలి. 8.మండలంలోని ముంపు ప్రభావిత గ్రామాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతకు కట్‌ఆఫ్ తేదీతో సంబంధం లేకుండా ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో ఉపాధి, పునరావాస ప్రయోజనాలు కల్పించాలి.కూనవరం మండలంలో మొత్తం 56 గ్రామాలు ఉండగా, 48 గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉన్నప్పటికీ, కాంటూరు లెక్కల పేరుతో తప్పుడు నివేదికలు చూపిస్తూ ఆదివాసీలను మోసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మహాసభ ఆవేదన వ్యక్తం చేసింది.ముంపు ప్రభావిత గ్రామాలకు త్వరితగతిన భూమి ప్యాకేజీ, ఆర్అండ్ఆర్, ఇంటి నిర్మాణ విలువ, యువతకు పునరావాస ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే మండల వ్యాప్తంగా ప్రజలను ఐక్యం చేసి ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం చేపడతామని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆదివాసీ గిరిజన సంఘం నూతన కమిటీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది.నూతన మండల కమిటీ సభ్యులు బొగ్గ రామారావు, సోడే శంకర్, బాబు బొర్రయ్య, నూప రాజు, ధర్ముల



అమ్మాజీ, జోడే రాజు, మడకం పొద్ద య్య, కొమరం మోహన్, బొగ్గ సమ్మక్క, మోసం హరీష్, శీలం పిచ్చయ్య, బొగ్గ వెంకయ్య, చిచ్చడి సత్యనారాయణ, మడకం శిరమయ్య, పైదా శ్రీకాంత్, పైద వెంకమ్మ, కుంజ సుధాకర్, గుండం బాబురావు, వుయిక కన్నయ్య తదితరులు నూతన కమిటీలో ఎన్నికయ్యారు.

## పోలవరం జిల్లా ఏటిఏ (ATA) అధ్యక్షులుగా సరియం అనిల్ కుమార్ ఎన్నిక

**ప్రజావాణి ప్రతినిధి కూనవరం మండలం ఆగస్టు 24** పోలవరం జిల్లా చింతూరు డివిజన్ కూనవరం మండలం రంపచోడవరం నందు జరిగిన ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ విస్తృతస్థాయి జిల్లా సమావేశంలో పోలవరం జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది.ఈసందర్భంగానూతన కమిటీ లో అధ్యక్షులుగా కూనవరం మండలం నకు చెందిన సరియం అనిల్ కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సరియం అనిల్ కుమార్ మాట్లాడుతూ “ఏజెన్సీ ప్రాంతం ప్రత్యేక ఉద్యోగ నియామక చట్టం” చేయడం ద్వారా మాత్రమే ఏజెన్సీ ప్రాంతంలో ఐదవ షెడ్యూల్ అనుసరించి వివిధ రకాల పోస్టులను ఏజెన్సీ వాసులతో భర్తీ చేయడానికి వీలవుతుందని తెలియజేశారు. ఇప్పటికే వివిధ శాఖల్లో బక్తిలను జీవనం రాత్రి కొట్టి వేయడం ద్వారా ఆదివాసీలు నష్టపోయారని తక్షణమే న్యాయం చేసే విధంగా ప్రభుత్వాన్ని చట్టం చేయాలని కోరారు.అదేవిధంగా నూతన పోలవరం జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యలపై నిత్యం పోరాడేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆధునిక విద్యావ్యవస్థలో వచ్చేటటువంటి వివిధ మార్పులను ప్రభుత్వం తెచ్చే సంస్కరణలకు అనుగుణంగా ఉపాధ్యాయులను చైతన్యపరిచి ఆదివాసీ ప్రాంతాలలో మెరుగైన విద్య బోధన జరిగేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.



# స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి పరుగులు
- బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ప్రాధాన్యం
- ఆలూరు అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వచ్చే ఏడాది నుంచి ఆలూరులో బీసీ ద గురుకులం ప్రారంభం
- ప్రజల మెప్పు పొందుతున్న కూటమిపై జగన్ ది ఓర్వలేనితనం
- మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు
- గత ప్రభుత్వ ఇరిగేషన్ మంత్రులకు సాగునీటి రంగంపై అవగాహనే లేదు : మంత్రి సవిత
- ఆలూరులో మంత్రులు సవిత, రామానాయుడు పర్యటన
- టీడీపీ శ్రేణులతో భేటీ

**అనంత పురం బ్యూరో ఆగస్టు 24 మన ప్రజా వాణి** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజక వర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. నియోజక వర్గంలో పరిశ్రమలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి ఆలూరులో బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పనిచేసిన ఇరిగేషన్ శాఖ మంత్రులకు పోలవరం సహా ఇతర సాగునీటి ప్రాజెక్టులకుపై కనీసం అవగాహన సైతం లేదన్నారు. ప్రజల మెప్పు పొందేలా పాలిస్తున్న కూటమి ప్రభుత్వంపై జగన్, ఆయన బ్యాచ్ ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగకపోయినా బురద జల్లుతున్నారని మండిపడ్డారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలూరు నియోజక వర్గంలో కూటమి అభ్యర్థుల విజయానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులకు, కార్యకర్తలకు మంత్రిసవిత దిశానిర్దేశం చేశారు.





రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి కర్నూలు జిల్లా ఆలూరు నియోజక వర్గంలో మంత్రి సవిత సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీలకతీతంగా ఆలూరు నియోజక వర్గంలో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఒకవైపు సూపర్ సిక్స్ పథకాలు, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే నియోజక వర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, కాలువల సహా ఇతర మౌలిక సదుపాయాలను విస్తృతంగా నిర్మిస్తున్నామన్నారు.

ఆలూరులో బీసీ గురుకులం

బీసీల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో అత్యధిక శాతం లబ్ది పొందుతున్నది బీసీలేనన్నారు. నియోజక వర్గంలో అత్యధిక మంది బీసీలు ఉన్నారని, వారి బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడానికి స్థానిక టీడీపీ నియోజక వర్గ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి కోరారన్నారు. ఆమె వినతి మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆలూరులో బీసీ గురుకుల పాఠశాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, అందులో భాగంగా ఆలూరులో టెక్స్ టైల్స్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి సవిత హామీ ఇచ్చారు.

ఆ మంత్రులకు ఇరిగేషన్ పై అవగాహనే లేదు..

రాష్ట్రంలో ఒక వైపు సంక్షేమంతో పాటు అభివృద్ధిని సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టుల పనులు విస్తృతంగా సాగుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే, రాయలసీమకు తాగు, సాగునీరు పుష్కలంగా లభిస్తుందన్నారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులను నిర్మించిన ఘనత సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. గత ప్రభుత్వంలోని జలవనరుల శాఖ మంత్రులకు పోలవరం సహా ఇతర సాగునీటి ప్రాజెక్టులపై అవగాహన లేదన్నారు. అటువంటి వారు రాయలసీమ ఎత్తిపోతల పథకం, ఇతర సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని మంత్రి సవిత విమర్శించారు.

ఓర్వలేకే మెగా డీఎస్సీపై విమర్శలు

రాష్ట్ర ప్రజల మెప్పు పొందేలా కూటమి ప్రభుత్వం పాలిస్తుండడంతో జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. మాట్లాడడానికి ఏ అంశమూ లేకపోవడంతో, మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీ అంటే చంద్రబాబు అని, చంద్రబాబు అంటే డీఎస్సీ అని అన్నారు. త్వరలో మరో డీఎస్సీ కూడా నిర్వహించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు.

ఆలూరులో కూటమిదే విజయంలి

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలూరు నియోజక వర్గంలో కూటమిదే విజయమని మంత్రి సవిత ధీమా వ్యక్తంచేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా, సమన్వయంతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు టీడీపీ నియోజక వర్గ ఇన్చార్జి వైకుంఠం జ్యోతి నాయకత్వంలో పసుపు శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. అంతకుముందు ఆలూరుకు వచ్చి మంత్రి సవిత... మంత్రి నిమ్మల రామానాయుడితో కలిసి శంకులమ్మ దేవస్థానంలో పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకుని పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు కార్పొరేషన్ చైర్మన్లు బొజ్జమ్మ సావిత్రి, పార్థమ్మ, దేవేంద్రప్ప పార్టీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఆదినారాయణ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలోని నేడే దర్శనం మరియు ఆర్జితసేవలు టికెట్లు విడుదల

**నంద్యాల జిల్లా శ్రీశైలం ఆగస్టు 24 ( ప్రజావాణి)**సెప్టెంబరు నెలకు సంబంధించి శ్రీస్వామివారి స్పర్శదర్శనం, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాలు మరియు ఆర్జితసేవా టికెట్లు ఈ నెల 25న విడుదల రాష్ట్ర ప్రభుత్వ మనమిత్ర వాట్సప్ ద్వారా టికెట్లు పొందే అవకాశం ఏ.పి.టి.ఎస్ వారి వెబ్సైట్ ఘఘఘ.ఎం.ఖజూ.స్త్రశీజ.ఱఅ ద్వారా కూడా టికెట్లు పొందే సదుపాయం.టికెట్ల లభ్యతను బట్టి ఒక గంట ముందువరకు కూడా ఆర్జితసేవా టికెట్లు పొందే ఏర్పాటు కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు సెప్టెంబరు మాసానికి సంబంధించి శ్రీస్వామివారి స్పర్శదర్శనం, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనం మరియు ఆర్జితసే వాటికెట్లను నేడే విడుదల చేయను న్నట్లు కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు తెలిపారు.భక్తులు సులభంగా ఆయా టికెట్లు పొందేందుకు వీలుగా 90శాతం టికెట్లను రాష్ట్ర ప్రభుత్వ మనమిత్ర వాట్సప్ ద్వారా పొందే అవకాశం కల్పించడం జరుగుతోందన్నారు.మిగిలిన 10 శాతం టికెట్లను ఏ.పి.టి.ఎస్ వారి వెబ్సైట్ www.tms.ap.gov.in ద్వారా పొందవచ్చునని అన్నారు. అలాగే పరోక్షసేవాటికెట్లను కూడా మనమిత్ర వాట్సప్ మరియు ఆన్లైన్ ద్వారా పొందవచ్చునన్నారు. శ్రీశైలానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా సేవలను పరోక్షంగా జరిపించుకునే వీలుగా దేవస్థానం ఈ పరోక్షసేవలను నిర్వహించడం జరుగుతోందన్నారు.ఇంకా వారు మాట్లాడుతూ ఆయా పౌరసేవలను సమర్థవంతంగా, వేగంగా, పారదర్శకంగా అందించేందుకు వీలుగా వచ్చిన ఈ వాట్సాప్ గవర్నెన్స్ విధానంలో పౌరులు పలు శాఖలకు సంబంధించిన ఆయా



సేవలను పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.ఆయా సేవలను సులభతరంగా అందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం మనమిత్ర వాట్సాప్ నెంబరును 9552300009 అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు.స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్గా ఈ వాట్సాప్ విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందన్నారు కాగా ఈ మనమిత్ర వాట్సాప్ ద్వారా దేవదాయశాఖ పరిధిలోని పలు ఆలయాల దర్శనం టికెట్లు, ఆర్జితసేవాటికెట్లు, ప్రసాదాల టికెట్లు మరియు విరాళాలను చెల్లించే విధానాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు.ఈ క్రమములో వాట్సాప్ ద్వారా శ్రీశైలదేవస్థానం నందలి శ్రీస్వామివారి స్పర్శదర్శనం,శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం టికెట్లను పొందవచ్చునని తెలియజేశారు. అదేవిధంగా శ్రీస్వామివారి ఆర్జిత గర్భాలయఅభిషేకం,ఆర్జితసామూహిక అభిషేకం, కుంకుమార్చన, గణపతిహోమం, రుద్రహోమం, మహామృత్యుం జయహోమం, చండీహోమం, కల్యాణోత్సవం, అన్నప్రాశన, అక్షరాభ్యాసం మొదలైన ఆయా 14 రకాల ఆర్జితసేవలకు సంబంధించిన సేవా టికెట్లను కూడా పొందవచ్చునని పేర్కొన్నారు.ఆన్లైన్ ద్వారా కూడా దర్శనం మరియు ఆర్జితసేవాటికెట్లను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.తదుపరి వారాంతపు రోజులు, సెలవురోజులు మరియు సోమవారం, ఇతర పర్వదినాలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ రోజులలో ముందస్తు టికెట్లు దొరకని భక్తులు టికెట్ అందుబాటులో ఉండే మంగళ, బుధ, గురు, శుక్రవారాలలో ఆయా టికెట్లను పొందవచ్చు.ఆయా సేవాటికెట్లు పొందినవారు విధిగా మనమిత్ర లేదా ఆన్లైన్ ద్వారా పొందిన టికెట్ కాపీని ( హార్డుకాపీ) మరియు ఆధార్ కార్డు ఒరిజినల్ లేదా జిరాక్స్ కాపీని తప్పని సరిగా తెచ్చుకోవలసివుంటుందన్నారు.ఆయా సేవాటికెట్లను స్కానింగ్ జరిపి సంబంధిత టికెట్లను ఒరిజినల్ ఆధార్ గుర్తింపు కార్డుతో సరిచూసిన తదుపరే భక్తులను ఆయా ఆర్జిత సేవలకు అనుమతించడం జరుగుతుందన్నారు. భక్తుల కోరిక మేరకు మరియు భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ఆర్జితసేవల ప్రారంభ సమయానికంటే ఒక గంట ముందు వరకు కూడా అందుబాటును బట్టి భక్తులు మనమిత్ర మరియు ఆన్లైన్లో టికెట్లను పొందే అవకాశం కల్పించడం జరిగిందన్నారు.భక్తుల సౌకర్యార్థం దేవస్థానం పలుచోట్ల మనమిత్ర వాట్సాప్ సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇక యథావిధిగా ప్రతీరోజు ఉదయం గం.4.30లనుంచి సర్వదర్శనం (ఉచిత దర్శనం)ఉంటుందన్నారు.

# డయాబెటిస్ లేకపోయినా షుగర్ లెవల్స్ పెరుగుతాయా.. నిపుణులు ఏం చెబుతున్నారు..?

భోజనం చేసిన తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు కొంత పెరగడం సహజమే. అయితే అది ఎంత మేర పెరిగింది, ఎంతసేపు ఎక్కువగా ఉంది, ఎంత తరచూ జరుగుతోంది, ఆ తర్వాత మళ్లీ సాధారణ స్థాయికి వస్తుందా అనే విషయాలను పరిశీలించడం ముఖ్యం. ఒక్కసారి బ్లడ్ షుగర్ పెరిగినంత మాత్రాన డయాబెటిస్ ఉందని నిర్ధారించలేం. ఆహారం, శారీరక శ్రమ, నిద్ర, ఒత్తిడి వంటి అనేక అంశాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలని తాత్కాలికంగా ప్రభావితం చేస్తాయి. మనం కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు జీర్ణవ్యవస్థ వాటిని గ్లూకోజ్గా విడగొడుతుంది. ఈ గ్లూకోజ్ రక్తంలోకి చేరడంతో బ్లడ్ షుగర్ పెరుగుతుంది. దీనికి ప్రతిస్పందనగా క్లోమం ఇన్సులిన్ను విడుదల చేస్తుంది. ఇన్సులిన్ రక్తంలోని గ్లూకోజ్ను కండరాలు, ఇతర కణజాలాల్లోకి చేరేలా చేస్తుంది. సాధారణంగా డయాబెటిస్ లేని వారిలో ఈ ప్రక్రియ కొంత సమయం తర్వాత రక్తంలో చక్కెరను సాధారణ స్థాయికి తీసుకువస్తుంది.ఆహారాలను బట్టి మార్పులు..అయితే ప్రతి ఆహారం రక్తంలో చక్కెరను ఒకే విధంగా పెంచదు. తెల్ల బియ్యం, ఆలుగడ్డలు, చక్కెర కలిగిన పానీయాలు, స్వీట్లు వంటి ఆహారాలు గ్లూకోజ్ను వేగంగా పెంచుతాయి. మరోవైపు కూరగాయలు, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, అధిక ఫైబర్ ఉన్న కార్బోహైడ్రేట్లతో కూడిన ఆహారం రక్తంలో గ్లూకోజ్ పెరుగుదల వేగాన్ని తగ్గిస్తుంది. తీసుకునే ఆహారం పరిమాణం కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తుంది. తీవ్రమైన ఒత్తిడి ఉన్న సమయంలో కూడా బ్లడ్ షుగర్ తాత్కాలికంగా పెరుగుతుంది. ఒత్తిడికి ప్రతిస్పందనగా శరీరంలో కార్టిసాల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు విడుదలవుతాయి. ఇవి కాలేయంలో నిల్వ ఉన్న గ్లూకోజ్ను రక్తంలోకి విడుదల చేయమని సంకేతాలు ఇస్తాయి. ఫలితంగా గతంలో బ్లడ్ షుగర్ సమస్యలు లేని వ్యక్తుల్లో కూడా కొంతకాలం గ్లూకోజ్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. అనారోగ్యం, జ్వరం లేదా శారీరక గాయం సమయంలో కూడా ఇలాంటి పరిస్థితి కనిపిస్తుంది. ఈ సమయంలో ఒత్తిడి హార్మోన్లు పెరగడంతోపాటు కొంతకాలం ఇన్సులిన్ ప్రభావం తగ్గుతుంది. అలాగే నిద్ర సరిగా లేకపోవడం కూడా ఇన్సులిన్ సెన్సిటివిటీ, ఆకలి నియంత్రణపై ప్రభావం చూపుతుంది. కాబట్టి తక్కువ గంటలు నిద్రపోయే రోజుల్లో బ్లడ్ షుగర్ ఎక్కువగా కనిపిస్తే, ఈ రెండింటి మధ్య సంబంధం ఉంటుంది.వ్యాయామం అవసరం.. వ్యాయామం కూడా బ్లడ్ షుగర్పై వివిధ రకాల ప్రభావాలు చూపుతుంది. సాధారణంగా ఏరోబిక్ వ్యాయామం కండరాలు గ్లూకోజ్ను ఉపయోగించుకునేలా చేసి బ్లడ్ షుగర్ను తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే తీవ్రమైన వ్యాయామం, ముఖ్యంగా అధిక శ్రమతో కూడిన అనెరోబిక్ వ్యాయామం సమయంలో అడ్రినలిన్ వంటి హార్మోన్ల ప్రభావంతో కాలేయం ఎక్కువ గ్లూకోజ్ను రక్తంలోకి విడుదల చేస్తుంది. దీంతో కొద్దిసేపు బ్లడ్ షుగర్ పెరిగినట్లు కనిపిస్తుంది. దీనర్థం వ్యాయామం మానేయాలని కాదు. క్రమం తప్పకుండా శారీరక శ్రమ చేయడం దీర్ఘకాలంలో ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచి శరీరం గ్లూకోజ్ను సమర్థంగా వినియోగించుకునేలా చేస్తుంది. కొన్ని మందులు కూడా రక్తంలో చక్కెర స్థాయిలను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా ప్రెడ్నిసోలోన్ వంటి కార్టికోస్టెరాయిడ్లు బ్లడ్ షుగర్ను పెంచే అవకాశం ఉంది. కొన్ని హార్మోనల్ మందులు, ఇతర ఔషధాలు కూడా గ్లూకోజ్ నియంత్రణపై ప్రభావం చూపిస్తాయి. కొత్త మందు ప్రారంభించిన తర్వాత బ్లడ్ షుగర్ పదేపదే పెరుగుతున్నట్లు గమనిస్తే, వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుడి సలహా లేకుండా మందులను స్వయంగా ఆపకూడదు. మనం ఏం తింటున్నామన్నదే కాకుండా ఎలా తింటున్నామన్నది కూడా ముఖ్యం. ఉదాహరణకు చక్కెర కలిపిన టీ, తెల్ల బ్రెడ్, జామ్తో కూడిన అల్పాహారంలో వేగంగా శోషణకు గురయ్యే కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండి ఫైబర్, ప్రోటీన్ తక్కువగా ఉంటాయి. దీనివల్ల గ్లూకోజ్ వేగంగా పెరుగుతుంది. దీనికి బదులుగా గుడ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలతో కూడిన అల్పాహారం తీసుకోవడం వల్ల గ్లూకోజ్ రక్తంలోకి చేరే వేగాన్ని తగ్గించవచ్చు.పిండిపదార్థాలను పూర్తిగా పక్కన పెట్టొద్దు.. కార్బోహైడ్రేట్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. వాటి పరిమాణంపై శ్రద్ధ పెట్టడం, ఎక్కువ ఫైబర్ ఉన్న ఆహారాన్ని ఎంచుకోవడం, కార్బోహైడ్రేట్లను ప్రోటీన్తో కలిపి తీసుకోవడం ద్వారా బ్లడ్ షుగర్ వేగంగా పెరగడాన్ని నియంత్రించడంలో సహాయపడతాయి.

# మార్కెట్లో రెండు రకాల పనీర్లు ఉంటాయని తెలుసా.. అసలైన పనీర్ను ఎలా గుర్తించాలంటే..?



భారతీయ వంటకాల్లో పనీర్కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రోటీన్తోపాటు కాల్షియం వంటి పోషకాలను అందించే పనీర్ను చాలామంది క్రమం తప్పకుండా తీసుకుంటారు. అయితే మార్కెట్లో ఫ్రెష్ పనీర్కు ప్రత్యామ్నాయంగా అనలాగ్ పనీర్ కూడా లభిస్తోంది. రెండూ చూడడానికి, రుచి, ఆకృతిలో దాదాపు ఒకేలా కనిపించినప్పటికీ, వాటి తయారీ విధానం, పోషక విలువలు, ఆరోగ్యంపై ప్రభావంలో గణనీయమైన తేడాలు ఉంటాయి. అందువల్ల పనీర్ కొనుగోలు చేసేటప్పుడు అది నిజమైన పాలతో తయారైనదా లేదా అనలాగ్ పనీరా అనే విషయాన్ని తెలుసుకోవడం ముఖ్యం. సాధారణంగా ఫ్రెష్ పనీర్ను ఆవు పాలతో తయారు చేస్తారు. దీనికి విరుద్ధంగా అనలాగ్ పనీర్లో కూరగాయల కొవ్వులు, వెజిటబుల్ ఆయిల్స్, పాలు లేదా పాల పదార్థాలు, స్టార్చ్లు, ఎమల్సిఫైయర్లు, స్టెబిలైజర్లు, ఇతర యాడిటివ్స్ వంటి పదార్థాలను ఉపయోగించి పనీర్లా కనిపించేలా తయారు చేస్తారు. తయారీదారుని బట్టి ఉపయోగించే పదార్థాల పరిమాణం మారుతుంది. అందువల్ల అనలాగ్ పనీర్కు ఒకే విధమైన స్థిరమైన పోషక విలువ ఉండదు.పోషక విలువలు ఎలా ఉంటాయి..భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) ప్రకారం 100 గ్రాముల ఫ్రెష్ పనీర్లో సుమారు 265 కేలరీలు, 18.3 గ్రాముల ప్రోటీన్, 20.8 గ్రాముల కొవ్వు, 1.2 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. అలాగే సుమారు 480 మిల్లీగ్రాముల కాల్షియం, 290 మిల్లీగ్రాముల ఫాస్ఫరస్, 0.2 మిల్లీగ్రాముల ఐరన్, 22 మిల్లీగ్రాముల సోడియం, 0.8 మిల్లీగ్రాముల జింక్ లభిస్తాయి. అనలాగ్ పనీర్లో మాత్రం తయారీ విధానాన్ని బట్టి పోషక విలువలు మారుతాయి. అందుబాటులో ఉన్న అంచనాల ప్రకారం 100 గ్రాముల అనలాగ్ పనీర్లో సుమారు 250 నుంచి 320 కేలరీలు, 6 నుంచి 15 గ్రాముల ప్రోటీన్, 18 నుంచి 25 గ్రాముల కొవ్వు, 5 నుంచి 15 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 100 నుంచి 400 మిల్లీగ్రాముల కాల్షియం ఉంటాయి. అంటే ఫ్రెష్ పనీర్తో పోలిస్తే అనలాగ్ పనీర్లో ప్రోటీన్ పరిమాణం తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఫ్రెష్ పనీర్ తయారీ ప్రక్రియ తక్కువగా ప్రాసెస్ చేసిందిగా ఉండటంతో కేసిన్, వెయ్ వంటి పాల ప్రోటీన్లు అందుతాయి. అందువల్ల ప్రోటీన్ అవసరం ఉన్నవారికి ఫ్రెష్ పనీర్ మెరుగైన ఎంపికగా ఉంటుంది. తక్కువ పరిమాణంలో తీసుకున్నా ప్రోటీన్ కారణంగా ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగించడంలో కూడా ఇది సహాయపడుతుంది.అనలాగ్ పనీర్తో ప్రతికూల ప్రభావాలు..అనలాగ్ పనీర్ తక్కువ ధర, ఒకే విధమైన ఆకృతి, ఎక్కువకాలం నిల్వ ఉండే లక్షణాల కారణంగా మార్కెట్లో ఉపయోగంలో ఉంది. అయితే ఇందులో ఎక్కువగా ప్రాసెస్ చేసిన పదార్థాలు ఉండే అవకాశం ఉండటంతో ఫ్రెష్ పనీర్తో పోలిస్తే పోషక విలువ తక్కువగా ఉంటాయి. ముఖ్యంగా ప్రోటీన్ సాంద్రత తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అనలాగ్ పనీర్ను తరచూ తీసుకోవడం వల్ల కొన్ని ప్రతికూల ప్రభావాలు ఉంటాయి. తయారీ విధానాన్ని బట్టి ఇందులో సోడియం ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అధికంగా ప్రాసెస్ చేసిన పదార్థాలు జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపిస్తాయి. అలాగే సూక్ష్మపోషకాల సాంద్రత తక్కువగా ఉండటం వల్ల ఇది పోషకపరంగా ఫ్రెష్ పనీర్ కంటే తక్కువ స్థాయిలో ఉంటుంది. ప్రోటీన్ తక్కువగా ఉంటే కడుపు నిండిన భావన కూడా తగ్గి, ఎక్కువ ఆహారం తీసుకునే అవకాశం ఉంటుంది. అనలాగ్ పనీర్ను గుర్తించడానికి ముందుగా ప్యాకెట్పై ఉన్న పదార్థాల జాబితాను పరిశీలించాలి. వెజిటబుల్ ఫ్యాట్స్, ఆయిల్స్, స్టార్చ్లు, ఎమల్సిఫైయర్లు, స్టెబిలైజర్లు వంటి పదార్థాలు ఉన్నాయా అనేది చూడాలి. కేవలం పనీర్ రంగు లేదా ఆకృతిని చూసి అది ఫ్రెష్ పనీర్ అని నిర్ణయించకూడదు.ఆకృతిలో తేడాలు..ఆకృతిలో కూడా కొంత తేడా కనిపిస్తుంది. అనలాగ్ పనీర్ సాధారణంగా కొంత గట్టిగా, ఎక్కువ ఎలాస్టిక్గా ఉంటుంది. వండినప్పుడు కూడా సులభంగా తన ఆకృతిని కోల్పోకుండా ఉండే అవకాశం ఉంటుంది. ఫ్రెష్ పనీర్ మాత్రం మరింత సహజమైన, తాజా రుచిని కలిగి ఉంటుంది. వీలైనంత వరకు రోజూ పాల ఉత్పత్తులు తయారు చేసే నమ్మకమైన డెయిరీలు లేదా విశ్వసనీయ వనరుల నుంచి పనీర్ను కొనుగోలు చేయాలి. బరువు తగ్గడం లేదా ఫిట్నెస్పై దృష్టి పెట్టేవారికి కూడా ఫ్రెష్ పనీర్ ఉపయోగకరమైన ఎంపికగా ఉంటుంది. ఇందులో ఉండే అధిక-నాణ్యత ప్రోటీన్ కండరాల పునరుద్ధరణకు తోడ్పడుతుంది. తక్కువ పరిమాణంలో తీసుకున్నా ప్రోటీన్ కారణంగా కడుపు నిండిన భావన కలిగిస్తుంది. అయితే మొత్తం కేలరీలు, కొవ్వు పరిమాణం, తీసుకునే పరిమాణం వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అనలాగ్ పనీర్ విషయంలో మాత్రం దాని కచ్చితమైన పోషక విలువ తయారీదారు ఉపయోగించిన పదార్థాలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల ప్యాకెట్పై ఉన్న ఫుడ్ లేబుల్ను పూర్తిగా చదివిన తర్వాతే కొనుగోలు చేయడం మంచిది. కేవలం తక్కువ ధర లేదా ఎక్కువకాలం నిల్వ ఉండటం వంటి కారణాలతో దానిని తరచూ తీసుకోవడం కంటే, అందులో ఉపయోగించిన పదార్థాలను పరిశీలించడం ముఖ్యం.వివరాలను పరిశీలించాలి..పిల్లలు, క్రీడాకారులు, వృద్ధులు, ఎక్కువ ప్రోటీన్ అవసరమయ్యే వారు, అనారోగ్యం నుంచి కోలుకుంటున్న వారు తదితర వర్గాలకు ఫ్రెష్ పనీర్ మెరుగైన ఎంపికగా నిలుస్తుంది. ముఖ్యంగా పెరుగుతున్న వయసులో ఉన్నవారు లేదా ఎక్కువగా ప్రాసెస్ చేసిన ఆహారాన్ని జీర్ణించుకోవడంలో ఇబ్బంది ఉండే వారు ఫ్రెష్ పనీర్ను ఎంచుకోవడం మంచిది. ఫ్రెష్ పనీర్, అనలాగ్ పనీర్ రెండూ ఒకేలా కనిపించినప్పటికీ వాటి తయారీ విధానం, ప్రోటీన్, కొవ్వు, కాల్షియం వంటి పోషకాల పరిమాణం భిన్నంగా ఉంటుంది. అందువల్ల పనీర్ కొనుగోలు చేసే ముందు లేబుల్ను చదవడం, పదార్థాలను పరిశీలించడం, విశ్వసనీయ వనరుల నుంచి కొనుగోలు చేయడం చాలా ముఖ్యం. రోజువారీ ఆహారంలో పనీర్ను చేర్చుకునే వారు సాధ్యమైనంత వరకు ఫ్రెష్ పనీర్కు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా అధిక ప్రాసెసింగ్కు గురైన ప్రత్యామ్నాయాలను తగ్గించవచ్చు.

# క్యాప్సికమ్ను ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే అద్భుతమైన లాభాలివే.. రంగులోనే ఉన్నదంతా..

మనం ఆహారంగా తీసుకునే ఆకుపచ్చ క్యాప్సికమ్తో పోలిస్తే ఎరుపు, పసుపు క్యాప్సికమ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, కెరోటినాయిడ్లు, పాలీఫినాల్స్ వంటి రక్షణాత్మక పోషకాలు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని కణాలను ఆక్సిడేటివ్ నష్టం నుంచి కాపాడటంలో సహాయపడతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే క్యాప్సికమ్ను సరైన పద్ధతిలో ఆహారంలో చేర్చుకోవడం దీర్ఘకాలిక ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటుంది. క్యాప్సికమ్ పచ్చి రంగు నుంచి పసుపు, ఎరుపు రంగులకు మారే కొద్దీ అందులోని యాంటీ ఆక్సిడెంట్ సమ్మేళనాలు పెరుగుతాయి. ముఖ్యంగా ఎరుపు క్యాప్సికమ్లో క్యాప్సాంథిన్, క్యాప్సోరుబిన్ వంటి కెరోటినాయిడ్లు ఉంటాయి. ఇవి కణాలను ఆక్సిడేటివ్ ఒత్తిడి నుంచి రక్షించడంలో, కణాల్లో జరిగే నష్టాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. పసుపు క్యాప్సికమ్లో ల్యూటిన్, వైయోలాక్సాంతిన్ వంటి కెరోటినాయిడ్లు ఉంటాయి. ఇవి కణజాల ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు శరీర రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తాయి.అనేక యాంటీ ఆక్సిడెంట్లు..ఎరుపు, పసుపు క్యాప్సికమ్లను కలిపి తీసుకోవడం ద్వారా వివిధ రకాల యాంటీఆక్సిడెంట్లను శరీరానికి అందించవచ్చు. క్యాన్సర్ను నేరుగా నివారించే ఆహారంగా క్యాప్సికమ్ను పరిగణించకూడదు. అయితే ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, మొక్కల నుంచి లభించే రక్షణాత్మక సమ్మేళనాలు ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా కణాల రక్షణకు తోడ్పడతాయి. క్యాప్సికమ్లోని పోషకాలను ఎక్కువగా పొందాలంటే వంట విధానంపైనా దృష్టి పెట్టాలి. క్యాప్సాంథిన్, లైకోపీన్, బీటా కెరోటిన్ వంటి కొన్ని కెరోటినాయిడ్లు కొవ్వులో కరిగేవి. అందువల్ల కొద్దిగా ఆరోగ్యకరమైన నూనె లేదా నెయ్యితో క్యాప్సికమ్ను తేలికగా వేయించడం వల్ల శరీరంలో వాటి శోషణ మెరుగుపడుతుంది. అయితే క్యాప్సికమ్ను ఎక్కువసేపు ఉడికించడం లేదా అధిక ఉష్ణోగ్రత వద్ద వండటం మంచిది కాదు. ఇందులోని విటమిన్ సి నీటిలో కరిగిపోయే స్వభావం కలిగి ఉండటంతో పాటు వేడికి సున్నితంగా ఉంటుంది. ఎక్కువసేపు ఉడికించినప్పుడు విటమిన్ సి కొంతమేర తగ్గిపోతుంది. అందువల్ల క్యాప్సికమ్ను తక్కువ సమయంలో స్టిర్ ఫ్రై చేయడం, తేలికగా ఆవిరిపై ఉడికించడం లేదా సలాడ్లలో పచ్చిగా తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.ఎలా తీసుకోవాలి..క్యాప్సికమ్ను కోసేటప్పుడు దాని లోపలి తెల్లని పొరను పూర్తిగా తొలగించకుండా ఉంచడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ భాగంలో కొన్ని బయోఫ్లేవనాయిడ్లు, విటమిన్ సి, ఇతర మొక్కల సమ్మేళనాలు ఉంటాయి. కాబట్టి బయటి భాగంతో పాటు లోపలి తెల్లని పొరను కూడా ఆహారంలో చేర్చుకోవచ్చు. విటమిన్ సి అధికంగా ఉండే ఎరుపు, పసుపు క్యాప్సికమ్లను పప్పులు, శనగలు, పాలకూర వంటి ఐరన్ అధికంగా ఉండే ఆహారాలతో కలిపి తినడం వల్ల మొక్కల నుంచి లభించే ఐరన్ శోషణ శరీరంలో మెరుగుపడుతుంది. ఇది సమతుల్య ఆహారంలో భాగంగా పోషకాలను సమర్థంగా పొందేందుకు సహాయపడుతుంది. అందువల్ల ఎరుపు, పసుపు క్యాప్సికమ్లను వారానికి పలుమార్లు ఆహారంలో చేర్చుకోవచ్చు. సలాడ్గా పచ్చిగా తీసుకోవచ్చు లేదా కొద్దిగా నూనెతో తేలికగా వేయించి కూరలు, స్టిర్ ఫ్రైలు, ఇతర వంటకాల్లో ఉపయోగించవచ్చు. అయితే క్యాప్సికమ్ ఒక్కటే క్యాన్సర్ను నివారిస్తుందని భావించకుండా, పండ్లు, కూరగాయలు, పప్పులు, సంపూర్ణ ధాన్యాలు వంటి విభిన్న పోషక ఆహారాలను సమతుల్య జీవనశైలిలో భాగంగా తీసుకోవడం ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

# పంత్ సరికొత్త చరిత్ర..

భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ మరో అరుదైన చారిత్రాత్మక రికార్డును సాధించాడు. విదేశాల్లో లేదా న్యూట్రల్ వేదికల్లో జరిగిన టెస్టుల్లో భారత వికెట్ కీపర్‌గా అత్యధిక పరుగులు సాధించిన లెజెండరీ క్రికెటర్ ఎంఎస్ ధోనీ పేరిట ఉన్న ఆల్ టైమ్ రికార్డును పంత్ బ్రేక్ చేశాడు. కొలంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్ట్ రెండో రోజు ఆటలో పంత్ ఈ ఘనతను నమోదు చేశాడు. ఈ విభాగంలో 2500 పరుగుల మార్కును దాటిన పంత్, ధోనీ సాధించిన 2496 పరుగుల రికార్డును అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు. ధోనీ 32.84 సగటుతో ఆ పరుగులు చేయగా, పంత్ దాదాపు 42 సగటుతో ఈ మైలురాయిని అందుకోవడం గమనార్హం. ఈ లిస్టులో ఫరూక్ ఇంజనీర్ (1209 రన్స్), సయ్యద్ కిర్మాణి (1109 రన్స్), కిరణ్ మోరే (901 రన్స్) తర్వాతి స్థానాల్లో నిలిచారు.. ఈ రికార్డు నమోదు కావడానికి ఒక రోజు ముందు పంత్ మైదానంలో తీవ్ర గాయానికి లోనయ్యాడు. మొదటి రోజు ఆట మూడో సెషన్‌లో శ్రీలంక పేసర్ లహిరు కుమార వేసిన షార్ట్ పిచ్ బంతిని పుల్ చేసే క్రమంలో పంత్ ఎడమ చేతి మణికట్టుకు గాయం అయింది. నొప్పితో విలవిల్లాడిన పంత్ కు భారత జట్టు ఫిజియో ఐస్ ప్యాక్ పెట్టి కట్టు కట్టినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ తీవ్ర అసౌకర్యంగా అనిపించడంతో 15 బంతుల్లో 3 పరుగులు చేసిన తర్వాత 58వ ఓవర్లో పంత్ రిటైర్డ్ హర్ట్ గా వెనుదిరిగాడు. గాయం తీవ్రత భయపెట్టినప్పటికీ, రెండో రోజు ఉదయం భారత్ ఆరో వికెట్ కోల్పోయిన తర్వాత పంత్ తిరిగి బ్యాటింగ్ కు వచ్చాడు. అసిథ ఫెర్నాండో, ఇతర లంక పేసర్లు వరుసగా బౌన్సర్లతో దాడి చేస్తూ అతడి భుజానికి కూడా బంతులు తాకించినా పంత్ ఏమాత్రం లెక్క చేయలేదు. నొప్పిని భరిస్తూనే మరో వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ తో కలిసి జట్టు ఇన్నింగ్స్ ను ముందుకు నడిపించాడు. ఇద్దరూ కలిసి సమయోచిత భాగస్వామ్యంతో లంక బౌలర్లను దీటుగా ఎదుర్కొని స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లారు. శ్రీలంక బౌలర్లు తీవ్రంగా ఒత్తిడి తెస్తున్న సమయంలో పంత్ చూపిన అంకితభావం జట్టుకు కొండంత బలాన్ని ఇచ్చిందనడంలో సందేహం లేదు. ఇక వీళ్లిద్దరూ సాధికారికంగా బ్యాటింగ్ చేస్తూ, అబేధ్యమైన ఏడో వికెట్ కు 112 పరుగులు జోడించారు. లంచ్ విరామ సమయానికి టీమిండియా 112 ఓవర్లలో 6 వికెట్లకు 419 పరుగులు చేసింది. పంత్ (63 బ్యాటింగ్)తో పాటు జురేల్ (59 బ్యాటింగ్) అర్థ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఫెర్నాండోకు నాలుగు వికెట్లు దక్కాయి. ఇప్పటికే గాలే టెస్ట్ లో భారత్ 165 రన్స్ తో గెలిచి సిరీస్ లో 1-0 లీడ్ లో ఉండగా, కొలంబోలోనూ పంత్ పోరాటంతో జట్టు పటిష్ట స్థితికి చేరింది.



# భారీ స్కోర్ వద్ద భారత్ డిక్లేర్డ్!

**• ధ్రువ్ జురెల్ అజేయ శతకం**

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా భారీ స్కోర్ చేసింది. ధ్రువ్ జురెల్(177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 115 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగడంతో తొలి ఇన్నింగ్స్‌ను భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్డ్ చేసింది. రిషభ్ పంత్(89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 63) హాఫ్ సెంచరీతో రాణించాడు. తొలి రోజు ఆటలో దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) సెంచరీతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/106) నాలుగు వికెట్లు తీయగా..ప్రభాత్ జయసూర్య కేశర నువాంత్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. లాహిరు కుమారాకు ఒక వికెట్ దక్కింది. అనంతరం శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా 2 బంతులు పడగానే వర్షం అంతరాయం కలిగించింది. ఆ తర్వాత ఆట తిరిగి ప్రారంభం కాగా.. శ్రీలంక 3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 8 పరుగులు చేసింది. లాహిరు ఉడారా(1) ప్రసిధ్ కృష్ణ ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(2)ను మానవ్ సుతార్ పెవిలియన్ చేర్చాడు. వర్షం కారణంగా రెండో రోజు 56 ఓవర్ల ఆటనే సాధ్యమైంది. 300/5 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓవర్‌నైట్ బ్యాటర్ సారాన్ష్ జైన్(6) రెండు పరుగులు మాత్రమే చేసి అసితా ఫెర్నాండో బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. దాంతో తొలి రోజు ఆటలో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. తనదైన శైలిలో చెలరేగిన ఈ జోడీ వేగంగా పరుగులు రాబట్టింది. ముఖ్యంగా పంత్ భారీ షాట్లతో లంకబౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో పంత్ 81 బంతుల్లో అర్థశతకం పూర్తి చేసుకోగా.. ధ్రువ్ జురెల్ 97 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. దాంతో భారత్ 419/6 స్కోర్ వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో పంత్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. భారీ సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. అయితే అతన్ని కుశార నువాంత క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో ఏడో వికెట్‌కు నమోదైన 112 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి మానవ్ సుతార్ రాగా.. ధ్రువ్ జురెల్ తన జోరును కొనసాగించాడు. ఆచితూచిన ఆడిన మానవ్ సుతార్(18)ను ప్రబాత్ జయసూర్య కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చగా.. సిరాజ్‌తో కలిసి ధ్రువ్ జురెల్ రెండో సెషన్‌ను ముగించాడు. వర్షం కారణంగా కాస్త ముందుగానే ఈ సెషన్ ముగిసింది. ఆఖరి సెషన్‌లో దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ 171 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఆ వెంటనే భారీ సిక్సర్‌తో ధ్రువ్ జురెల్ తన జోరు కనబర్చగా.. సిరాజ్(3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. దూకుడుగా ఆడిన ధ్రువ్ జురెల్ వేగంగా పరుగులు రాబట్టి జట్టు స్కోర్‌ను 500 ధాటించాడు. ఆ వెంటనే భారత్ తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్డ్ చేసింది.



# యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట!

టీమిండియా ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు భారీ ఊరట లభించింది. శ్రీలంక ప్లేయర్ అసిత ఫెర్నాండోతో గొడవ పడిన ఘటనలో ఐసీసీ జరిమానాతో సరిపెట్టింది. యశస్వి జైస్వాల్‌తో పాటు అసిత ఫెర్నాండో మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. ఈ ఘటనలో యశస్వి జైస్వాల్‌దే తప్పంటూ మాజీ క్రికెటర్లు, కామెంటేటర్లు తీర్పు ఇచ్చారు. దాంతో యశస్వి జైస్వాల్‌పై నిషేధం పడుతుందని అంతా అనుకున్నారు. కానీ మ్యాచ్ రిఫరీ లెవెల్-1 నేరంగా పరిగణించి రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నారు.

ఈ చర్యలకు సంబంధించి ఐసీసీ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'ఆదివారం కొలంబో వేదికగా మొదలైన రెండో టెస్ట్ తొలి రోజున ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ 1 రూల్‌ను ఉల్లంఘించిన శ్రీలంక పేసర్ అసితా ఫెర్నాండో, భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ల మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధిస్తూ మ్యాచ్ రిఫరీ చర్యలు తీసుకున్నారు. ఆర్టికల్ 2.12 ప్రకారం ఒక ప్లేయర్, సపోర్ట్ స్టాఫ్, అంపైర్‌తో భౌతిక ఘర్షణకు దిగడం నేరం.మ్యాచ్ ఫీజు కోతతో పాటు చెరో డీ మెరిట్ పాయింట్ కేటాయించారు. తమ తప్పులను ఫెర్నాండో, జైస్వాల్ అంగీకరించారు. దాంతో అధికారిక విచారణ అవసరం లేకుండానే ఈ శిక్షలు ఖరారు చేస్తున్నాం. లెవెల్ 1 ఉల్లంఘనకు పాల్పడినప్పుడు కనీస శిక్షగా హెచ్చరిక, గరిష్టంగా ఆటగాడి మ్యాచ్ ఫీజులో 50 శాతం, ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్స్ ఉంటాయి.'అని ఐసీసీ తమ ప్రకటనలో పేర్కొంది. కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌లో యశస్వి జైస్వాల్ దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అసిత ఫెర్నాండో వేసిన ఒకే ఓవర్లో వరుసగా మూడు ఫోర్లు బాదాడు. ఆ తర్వాత ఫెర్నాండో ఒక అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను 45 పరుగుల వద్ద క్లీన్ బౌల్డ్ చేశాడు. వికెట్ తీసిన అనంతరం ఫెర్నాండో అత్యుత్సాహంగా సెలెబ్రేట్ చేసుకున్నాడు. ఈ క్రమంలో అతను ఏదో మాట అన్నాడు. అది విన్న జైస్వాల్ ఆగ్రహంతో అతనిపైకి దూసుకెళ్లాడు. ఒకరికొకరు ఎదురెదురుగా నిలబడి నోరుపారేసుకున్నారు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. దాంతో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్ జోక్యం చేసుకొని ఇద్దర్నీ విడదీసాడు.



# సీఎస్‌కే కోచ్‌గా దినేశ కార్తీక్‌ను నియమించండి

**• ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచన**



టీమిండియా మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్‌ను చెన్నైసూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా నియమించాలని ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ సూచించాడు. ఐదు సార్లు ఛాంపియన్ అయిన సీఎస్‌కేకు విదేశీ కోచ్‌ల కంటే స్థానిక వ్యక్తులే మెరుగైన సేవలు అందించగలరని మాథ్యూ హేడెన్ అభిప్రాయపడ్డాడు.చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) హెడ్ కోచ్‌గా 18 ఏళ్ల పాటు సేవలందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ ఇటీవలే ఆ బాధ్యతల నుంచి తప్పుకున్న సంగతి తెలిసిందే. అతను ఇంగ్లండ్ టెస్ట్ టీమ్ హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టగా.. సీఎస్‌కే నయా హెడ్ కోచ్ కోసం అన్వేషణ మొదలుపెట్టింది.తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన మాథ్యూ హేడెన్.. స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను తప్పించడం సాహోసోపేతమైన నిర్ణయంగా పేర్కొన్నాడు. స్టార్ స్పోర్ట్స్ షోలో మాట్లాడిన మాథ్యూ హేడెన్.. దినేష్ కార్తీక్‌కు హెడ్ కోచ్ పదవి బాధ్యతలు ఇవ్వాలని చెప్పాడు. 'సీఎస్‌కే వంటి పెద్ద జట్టుకు విదేశీ కోచ్ కోచ్ కంటే స్థానిక నేపథ్యం ఉన్న కోచ్ మరింత అనుకూలంగా ఉంటారు. దినేష్ కార్తీక్‌కు చెన్నై క్రికెట్ సంస్కృతి బాగా తెలుసు. కాబట్టి సీఎస్‌కే హెడ్ కోచ్ పదవికి దినేష్ కార్తీక్ సరైన వ్యక్తి. ఐపీఎల్ నుంచి రిటైర్ అయిన తర్వాత దినేశ్ కార్తీక్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)కి బ్యాటింగ్ కోచ్, కన్సల్టెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మార్గదర్శకత్వంలో ఆర్‌సీబీ 2025లో తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకోవడమే కాకుండా ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ టైటిల్ నిలబెట్టుకుంది. సీఎస్‌కే హెడ్ కోచ్ పదవి చేపట్టేందుకు దినేష్ కార్తీక్ సరిగ్గా సరిపోతాడు.'అని మాథ్యూ హేడెన్ చెప్పుకొచ్చాడు. కొత్త కోచ్ ఎంపికపై సీఎస్‌కే ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రటకన చేయలేదు. కానీ పలువురు మాజీ ఆటగాళ్ల పేర్లు ప్రచారంలో ఉన్నాయి.ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ పేరు బలంగా వినిపిస్తోంది. ఫ్లెమింగ్ పర్యవేక్షణలో ఐదు టైటిళ్లు గెలిచిన సీఎస్‌కే.. గత మూడు సీజన్లలో దారుణంగా విఫలమైంది. కనీసం ప్లే ఆఫ్స్ కూడా చేరలేకపోయింది. దాంతోనే అతన్ని సీఎస్‌కే తప్పించింది.

# కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరే

**స్పష్టం చేసిన బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్**

టీమిండియా రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు నిజంగా వైరల్ ఫీవరేనని బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టం చేశాడు. అబద్ధం చెప్పి అతన్ని పక్కన పెట్టాల్సిన అవసరం తమకు లేదన్నాడు. శ్రీలంకతో కొలంబో వేదికగా ఆదివారం ప్రారంభమైన రెండో టెస్ట్‌కు కుల్దీప్ యాదవ్ దూరమైన సంగతి తెలిసిందే.వైరల్ ఫీవర్‌తోనే కుల్దీప్ యాదవ్ దూరమయ్యాడని ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు బీసీసీఐ ఓ ప్రకటనలో పేర్కొంది. 'కుల్దీప్ యాదవ్ తన వైరల్ ఫీవర్ నుంచి పూర్తిగా కోలుకోలేదు. శ్రీలంకతో రెండో టెస్ట్‌కు అతను దూరమయ్యాడు. అవసరమైతే కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా కుల్దీప్ బరిలోకి దిగగలడు.'అని తెలిపింది.అయితే ఈ ప్రకటనను మెజార్టీ అభిమానులు విశ్వసించలేదు. వైరల్ ఫీవర్ పేరిట కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టు నుంచి తప్పించారని ఆరోపించారు. తొలి టెస్ట్‌లో కుల్దీప్ యాదవ్ ప్రభావం చూపలేకపోయాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో ఒకే ఒక్క వికెట్ తీయడంతో అతన్ని తప్పిస్తారనే ప్రచారం జోరుగా సాగింది. 33 ఏళ్ల సారాన్ష్ జైన్‌కు అవకాశం ఇస్తారనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే వైరల్ ఫీవర్ అంటూ బీసీసీఐ చేసిన ప్రకటనపై నెటిజన్లు సందేహం వ్యక్తం చేశారు. తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో పాల్గొన్న సితాన్ష్ కోటక్‌ను మీడియా ప్రతినిధులు ఈ విషయంపై ప్రశ్నించగా.. తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇదేం ప్రశ్న ఇలా ఎలా ఆలోచిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'ఇది ఏ మాత్రం సందర్భోచితమైన ప్రశ్న కాదు. కుల్దీప్ యాదవ్‌కు గాలే నుంచి వచ్చేటప్పుడే వైరల్ ఫీవర్ సోకింది. జట్టుకు ఆఫ్-స్పిన్నర్ అవసరమైతే.. కుల్దీప్ యాదవ్ అనారోగ్యానికి గురయ్యాడని చెప్పాల్సిన అవసరం మాకు లేదు. అతను ఆడే స్థితిలో లేనప్పుడు ఒకవేళ ఫిట్‌గా ఉంటే ఏం చేసేవారని అడగడం సరికాదు. ఇలా ఆలోచించడం కూడా అన్యాయం'అని సితాన్ష్ కోటక్ ఘాటుగా బదులిచ్చాడు. రిషభ్ పంత్ గాయం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సీరియస్ ఇంజ్యూరీ కాదని సితాన్ష్ కోటక్ తెలిపాడు. అతను తిరిగి బ్యాటింగ్ చేస్తాడని చెప్పాడు. మైదానంలో యశస్వి జైస్వాల్, అసితా ఫెర్నాండో గొడవపై స్పందిస్తూ.. ఆటలో ఇవన్నీ సహజమని అభిప్రాయపడ్డాడు. బౌలర్ ఏదో అన్నాడని, కానీ యశస్వి జైస్వాల్ అలా దూసుకెళ్తాడని తాను అనుకోలేదని చెప్పాడు. కుల్దీప్ యాదవ్ గైర్హాజరీతో 33 ఏళ్ల సరాన్ష్ జైన్ అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 5 వికెట్లకు 300 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్(193 బంతుల్లో 12 ఫోర్లతో 117) మరో శతకంతో చెలరేగగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(108 బంతుల్లో 6 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. రవీంద్ర జడేజా(43), యశస్వి జైస్వాల్(45) తృటిలో హాఫ్ సెంచరీలు చేజార్చుకున్నారు. క్రీజులో ధ్రువ్ జురెల్(7 బ్యాటింగ్)తో పాటు సరాన్ష్ జైన్(4 బ్యాటింగ్) ఉన్నాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో మూడు వికెట్లు తీయగా.. లాహిరు కుమార, కేశర నువాంత తలో వికెట్ తీసారు.

# దేవదత్ పడిక్కల్ వరుస సెంచరీలు

శ్రీలంక పర్యటనలో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ అదరగొడుతున్నాడు. ఇటీవల గాలె వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో (167, 44) రాణించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తాజాగా కొలంబో టెస్టులోనూ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, మరో సెంచరీ నమోదు చేశాడు. అదివారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పడిక్కల్ 117 పరుగులతో రాణించాడు. దీంతో ప్రస్తుతం అందరి కళ్లు పడిక్కల్‌పై పడ్డాయి. ఛతేశ్వర్ పుజారా తర్వాత టెస్టుల్లో భారత్‌కు నెం 3 స్థానాన్ని భర్తీ చేయడం సవాల్‌గా మారింది. టెస్టుల్లో కీలకమైన ఈ వన్‌డౌన్‌లో పలువురు బ్యాటర్లను పరీక్షించి చూసింది. అయితే గతేడాది సాయి సుదర్శన్ సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేయడంతో అతడే ఆ ప్లేస్‌లో బ్యాటింగ్ చేస్తున్నాడు. అప్పట్నుంచి నెం 3 స్థానానికి మేనేజ్‌మెంట్ కూడా సుదర్శన్ పేరునే పరిశీలిస్తుంది. ఈ లంక పర్యటనలో కూడా మొదట సుదర్శన్‌నే ఎంపిక చేసింది. అయితే అతడు గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో ఆ ఛాన్స్ పడిక్కల్‌కు వచ్చింది. అలా వచ్చిన అవకాశాన్ని పడిక్కల్ పూర్తిగా సద్వినియోగం చేసుకుంటున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొని పరుగులు సాధిస్తున్నాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 167 పరుగుల భారీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. నంబర్ 3 స్థానంలో కొంతకాలంగా ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ సమర్థవంతంగా ఎదుర్కొనే టెస్టు బ్యాటర్ కోసం మేనేజ్‌మెంట్ అన్వేషిస్తోంది. అయితే ఈ సిరీస్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో సెంచరీ నమోదు చేయడంతో పడిక్కల్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. సుదర్శన్ వచ్చినా జట్టులోంచి పడిక్కల్‌ను తీసివేయొద్దంటూ ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. తన ప్రదర్శనతోనూ పడిక్కల్ సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. నిలకడగా రాణిస్తూ పరుగులు చేస్తుండడంతో ఈ ప్లేస్‌కు పడిక్కల్ సెట్ అయిపోయినట్లే అని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత టూర్‌లో రెండు సెంచరీలు సాధించినంత మాత్రాన పడిక్కల్‌ను అప్పుడే నెం 3 బ్యాటర్ అని కన్ఫర్మ్ అయిపోడానికి వీల్లేదు. ఎందుకంటే అతడికి అసలు పరీక్ష ఇప్పుడిప్పుడే మొదలవుతుంది. ఈ నిలకడను ఇలాగే కొనసాగిస్తేనే అతడికి వన్‌డౌన్‌లో అవకాశం ఉంటుంది. అంతేకానీ ఒకట్రెండు సిరీస్‌లకు మాత్రమే ఈ ప్రదర్శన పరిమితమైతే మాత్రం కనుమరుగైపోయే ప్రమాదం ఉంది. గతంలో ఎందరో క్రికెటర్లు వచ్చిన కొత్తలో అదరగొట్టేసి, ఆ తర్వాత తుస్సుమనిపించారు. వాళ్లంతా ఇప్పుడు కనుమరుగైపోయారు.



# దేవకన్యలా మెరిసిన మానస వారణాసి..





టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మానస వారణాసి ఫెమినా మిస్ ఇండియా 2020 విజేత గా నిలిచారు. 'దేవకీ నందన వాసుదేవ' తో ఎంట్రీ ఇచ్చిన ఈ భామ ఇప్పుడు తన ట్రెడిషనల్ గ్రేస్‌తో కుర్రకారు గుండెలను కొల్లగొడుతోంది. హైదరాబాద్‌కే చెందిన ఈ ముద్దుగుమ్మ మిస్ వరల్డ్ 2021 పోటీల్లో టాప్-13లో నిలిచి దేశం గర్వపడేలా చేసింది. రీసెంట్‌గా రిలీజైన 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో మంచి హిట్ కొట్టిన ఈ అందాల భామ, సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం ఫ్యాన్స్‌ని మంత్రముగ్ధులను చేస్తోంది. 'బ్రీజ్' తాకిడికి రెక్కలు విప్పుకున్న అందం: మానస వారణాసి "బ్రషెడ్ బై ది బ్రయిాజ్ "అంటూ ఇన్స్టాగ్రామ్‌లో పంచుకున్న పిక్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. లైట్‌వెయిట్, పారదర్శకమైన శారీ డ్రేప్‌లో ఆమె కనిపించిన తీరు దేవకన్యను తలపిస్తోంది. ఇక ప్లెయిన్ వైట్ స్లీవ్‌లెస్, హై-నెక్ బ్లౌజ్‌తో రూపొందించిన ఈ మోడరన్ అండ్ ట్రెడిషనల్ కాంబినేషన్ ఆమెకు ఎంతో క్లాసీ అండ్ ఫ్రెష్ లుక్‌ని ఇచ్చింది. సింపుల్ జ్యువెలరీ.. సోయగం డబుల్: ఎక్కువ హడావుడి లేకుండా మినిమల్ టచ్‌తో ఆమె చేసిన ఈ ఫొటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సంప్రదాయబద్ధమైన సిల్వర్ ఝుంకాలు, చేతికి ఒక సన్నటి బ్రాస్‌లెట్ మాత్రమే ధరించి తన సహజ సౌందర్యాన్ని ప్రదర్శించింది. ఇక కామెంట్ బాక్స్‌లో నెటిజన్లు "ఏంజెల్", "అచ్చ తెలుగు అందం", "సూపర్బ్" అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తూ లైకుల సునామీ సృష్టిస్తున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' హిట్‌తో ఫుల్ జోష్: మోడలింగ్‌లో రాణించిన మానస వారణాసి, నటనలోనూ తన మార్క్ చూపిస్తోంది. సంతోష్ శోభన్ సరసన ఆమె నటించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'కపుల్ ఫ్రెండ్లీ' బాక్సాఫీస్ వద్ద మంచి హిట్ టాక్ తెచ్చుకోవడంతో ఈ భామ ఫుల్ ఖుషీగా ఉంది. ఇక అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్‌పై వచ్చిన ఈ సినిమాతో నటిగా మానస తన స్థానాన్ని మరింత బలంగా సుస్థిరం చేసుకుంది. అందం, అభినయంతో పాటు హుందాతనంతో కూడిన సంప్రదాయ లుక్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది మానస వారణాసి. ఇక క్యూట్ అండ్ క్లాసీ ఫోజులతో కుర్రకారు మనసు దోచుకున్న ఈ తెలంగాణ బ్యూటీ, రాబోయే రోజుల్లో తెలుగు చిత్రసీమలో మరిన్ని బిగ్ ఆఫర్లతో సంచలనం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఓ ఇంటివాడైన టాలీవుడ్ నటుడు ప్రిన్స్..

## న్యూజిలాండ్ లో ఘనంగా వివాహం



టాలీవుడ్ యంగ్ హీరో ప్రిన్స్ సెసిల్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రియురాలు సాయి ప్రతిమ మెడలో మూడు ముళ్లు వేసి వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టాడు. న్యూజిలాండ్‌లోని వనాకా ప్రాంతంలో అత్యంత సుందరమైన ప్రదేశంలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో వైభవంగా జరిగింది. ఈ వేడుకకు ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.
వివాహ వేడుకలో వధువు సాయి ప్రతిమ ఎరుపు రంగు పట్టుచీర, సంప్రదాయ ఆభరణాలతో మహారాణిలా మెరిసిపోగా, వరుడు ప్రిన్స్ ఐవరీ కలర్ ప్రింటెడ్ పైజామాలో రాజకుమారుడిలా కనిపించాడు. వీరి పెళ్లికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో, అవి క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ నూతన జంటకు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు పెడుతున్నారు.వీరిద్దరి ప్రేమకథ కూడా ఎంతో ఆసక్తికరంగా మొదలైంది. ప్రముఖ నటుడు ప్రియదర్శి ద్వారా ఒక కామన్ ఫ్రెండ్ వివాహ వేడుకలో ప్రిన్స్, సాయి ప్రతిమలకు తొలిసారి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం స్నేహంగా, ఆపై ప్రేమగా మారి ఇప్పుడు పెళ్లి పీటల వరకు చేరింది.'నీకు నాకు డ్యాష్ డ్యాష్' చిత్రంతో హీరోగా పరిచయమైన ప్రిన్స్, 'బస్ స్టాప్' సినిమాతో యువతలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత 'బిగ్ బాస్ తెలుగు' మొదటి సీజన్‌లో పాల్గొని తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. ఇటీవల 'డీజే టిల్లు', 'స్కంద' వంటి విజయవంతమైన చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ నటుడిగా తనను తాను నిరూపించుకుంటున్నాడు. ప్రస్తుతం ప్రిన్స్ మరికొన్ని ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు.

# 100 కోట్ల క్లబ్ దిశగా 'ఇరుముడి'

రవితేజ అంటే చాలు మాస్ ఆడియన్స్ ఊగిపోతారు. ఆయన సినిమాలలో యాక్షన్ ఉంటుంది .. ఎమోషన్ ఉంటుంది .. తనదైన కామెడీ ఉంటుంది. రొమాంటిక్ గా సాగిపోయే సాంగ్స్ ఉంటాయి. ఫైనల్ గా వీటన్నిటికీ మాస్ టచ్ ఉంటుంది. అయితే ఈ సారి మాత్రం ఆయన కాస్త డిఫరెంట్ గా డివోషనల్ టచ్ ఇస్తూ, 'ఇరుముడి' సినిమా చేశారు. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 21వ తేదీన భారీ ఓపెనింగ్స్ తో తన ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. తొలి రోజునే ప్రపంచవ్యాప్తంగా 24 కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసింది. మొదటి రోజునే హిట్ టాక్ రావడంతో, శనివారం నుంచి థియేటర్స్ పెంచవలసిన వచ్చింది. దాంతో ఈ సినిమా మరింత దూకుడు చూపిస్తూ వెళ్లింది. అలా మొదటి మూడు రోజులలో ఈ సినిమా 75 కోట్లకు పైగా గ్రాస్ ను రాబట్టింది. రెండు రోజులలోనే బ్రేక్ ఈవెన్ ను సాధించింది, రవితేజ కెరియర్లో చాలా వేగంగా ఈ స్థాయి వసూళ్లను రాబట్టిన సినిమాగా నిలిచింది. అలాగే రవితేజ కెరియర్లో యూ ఎస్ బాక్సాఫీస్ వైపు నుంచి, తొలి మిలియన్ డాలర్ మూవీగా నిలిచింది. ఇక సోమవారం రోజున కూడా ఈ సినిమా అదే జోరును కొనసాగిస్తుండటం విశేషం. 100 కోట్ల క్లబ్ లోకి ఈ సినిమా చేసే సమయం చాలా దగ్గరలోనే ఉంది. కూతురు పట్ల ఉన్న ప్రేమ .. ఆ కూతురును ఇచ్చిన అయ్యప్పస్వామి పట్ల భక్తి రవితేజ పాత్రలో ప్రధానమైన కోణాలుగా కనిపిస్తాయి. ఆడపిల్లలకు ఒక ఆశయం ఉండాలి .. వాళ్లు ధైర్యంగా పెరగాలి .. ఆదర్శంగా నిలవాలి అనే కాన్సెప్ట్ తో రూపొందిన ఈ సినిమాకి, పాటలు అదనపు బలంగా నిలిచాయి. విలేజ్ నేపథ్యంలోని హీరోయిజం .. విలేజ్ ను అడ్డాగా చేసుకుని దుర్మార్గాన్ని సాగించాలనుకున్న విలనిజం ఆవిష్కరణ ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. రవితేజ కెరియర్ లో గొప్ప హిట్ గా ఈ సినిమా నిలుస్తుందని చెప్పచ్చు.



# వివాదంతో పెద్ద ప్రచారం కొట్టేసిన వర్ధమాన నటి



సినిమా ప్రమోషన్లలో వినూత్న పద్ధతులు పాటించడం ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. అయితే ఇటీవల కన్నప్ప, బ్లాస్ట్ చిత్రాల ద్వారా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న వర్ధమాన నటి ప్రీతి ముకుందన్ పాల్గొన్న ఓ ప్రచార కార్యక్రమం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఓ పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొనడానికి ఆమెను గ్రాండ్‌గా రథంపై ఊరేగింపుగా తీసుకెళ్లడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ ఊరేగింపు సందర్భంగా అందాల భామను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు, జనం భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయి సామాన్య ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో నెటిజన్లు మండిపడ్డారు. పబ్లిసిటీ స్టంట్ల పేరుతో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందంటూ పలువురు హితవు పలికారు ఇదే సమయంలో ప్రీతి ముకుందన్ కుటుంబ నేపథ్యం గురించి కూడా నెట్టింట ఒక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు ఈ నటి మనవరాలు (గ్రాండ్ డాటర్) అంటూ వార్తలు వస్తున్నాయి. అయితే ఇందులో నిజం లేదని.. రామానుజన్ 1920లో తన 32వ ఏటనే సంతానం లేకుండా పరమపదించారని.. కాబట్టి ఆయనకు నేరుగా వారసులు ఎవరూ లేరని స్పష్టమవుతోంది. నెటిజన్లు అనుకుంటున్నట్లు రామానుజన్‌కు ప్రీతి ప్రత్యక్ష మనవరాలు కాకపోయినా ఆమె ఆయన కుటుంబానికి చెందిన వ్యక్తి కావడం విశేషం. ప్రీతి ముకుందన్‌కు రామానుజన్ వరుసకు ముత్తాత (గ్రేట్-గ్రాండ్ అంకుల్) అవుతారు. రామానుజన్ తమ్ముడి కుమారుడే అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కర్నాటిక్ జాజ్ గిటారిస్ట్ గిటార్ ప్రసన్న (ప్రసన్న రామస్వామి) .. ఆయన సోదరి డాక్టర్ దీపా ముకుందన్. ఈ డాక్టర్ దీపా ముకుందన్ మరెవరో కాదు, హీరోయిన్ ప్రీతి ముకుందన్ తల్లే.

# నన్ను హీరోగా వద్దన్నారు..

## అయినా నా డైరెక్టర్ వినలేదు: అర్జున్ దాస్



అర్జున్ దాస్, అదితి శంకర్ జంటగా ఆగస్ట్ 28న సినిమా విడుదల

దక్షిణాదిలో వేగంగా ఎదుగుతున్న నటుడు అర్జున్ దాస్, తన కొత్త సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంటూ భావోద్వేగానికి గురయ్యాడు. అదితి శంకర్‌తో కలిసి ఆయన హీరోగా నటించిన తమిళ రొమాంటిక్ డ్రామా 'ఒన్స్ మోర్'. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మాట్లాడిన అర్జున్ దాస్, దర్శకుడు విఘ్నేశ్ శ్రీకాంత్ తనపై ఉంచిన నమ్మకాన్ని గుర్తుచేసుకున్నాడు. హీరోగా తనను తొలగిస్తే సినిమా నిర్మిస్తామని పలు నిర్మాణ సంస్థలు ముందుకు వచ్చినా, దర్శకుడు మాత్రం తన కోసమే నిలబడ్డారని వెల్లడించాడు.ఈ సందర్భంగా అర్జున్ దాస్ మాట్లాడుతూ, "చాలా కాలం క్రితం దర్శకుడు శ్రీకాంత్ ఈ కథతో నా దగ్గరకు వచ్చాడు. మా కామన్ ఫ్రెండ్, డైరెక్టర్ సూర్య నారాయణ్ మా ఇద్దరినీ పరిచయం చేశారు. శ్రీకాంత్ చెప్పిన లైన్ నాకు చాలా అందంగా అనిపించింది" అని తెలిపాడు. అయితే, ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఎదురైన సవాళ్లను దాస్ వివరించాడు."ఈ కథను చాలా నిర్మాణ సంస్థలకు శ్రీకాంత్ వినిపించాడు. కానీ వాళ్లలో చాలామంది 'హీరోని మార్చితే సినిమా చేస్తాం' అని చెప్పారు. కానీ అన్ని నిర్మాణ సంస్థలకూ శ్రీకాంత్ ఒకటే చెప్పాడు.. 'లేదు, నేను ఈ సినిమా అర్జున్ దాస్‌తోనే చేస్తాను' అని అతడు గట్టిగా చెప్పినట్లు" అర్జున్ దాస్ వెల్లడించాడు. ఎంతో కాలం ఎదురుచూసిన తర్వాత, దర్శకుడి ఆలోచనలతో ఏకీభవించిన నిర్మాత యువరాజ్ గణేశన్ ముందుకు రావడంతో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కిందని వివరించాడు.ఈ 'ఒన్స్ మోర్' చిత్రం ఈ ఏడాది ఆగస్ట్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అర్జున్ దాస్, అదితి శంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, మోడల్ సోనా ఓలికల్ ఒక కీలక పాత్రలో కనిపించనుంది. మలయాళంలో 'హృదయం', తెలుగులో 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సంచలనం సృష్టించిన హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతో తమిళ చిత్ర పరిశ్రమకు సంగీత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.

# 'శుక్రాచార్యుడి యుద్ధరావం'.. ప్రశాంత్ వర్మ 'మహాకాళి' నుంచి అక్షయ్ ఖన్నా ఫస్ట్ గ్లింప్స్

ప్రశాంత్ వర్మ క్రియేటర్‌గా, పూజ కొల్లూరు దర్శకత్వంలో నిర్మాణం బ్లాక్‌బస్టర్ చిత్రం 'హనుమాన్'తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ, తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ చిత్రాన్ని అందిస్తున్నారు. 'మహాకాళి' అనే టైటిల్‌తో రానున్న ఈ చిత్రం నుంచి 'శుక్రాచార్యుడి యుద్ధరావం' పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో రాక్షసుల గురువు శుక్రాచార్యుడి పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా నటిస్తున్నారు.



తాజాగా విడుదల చేసిన ఈ గ్లింప్స్, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. »THE END BEGINS» (అంతం మొదలవుతుంది) అనే ట్యాగ్‌లైన్‌తో, గంభీరమైన వాతావరణంలో అక్షయ్ ఖన్నా లుక్, డైలాగ్ డెలివరీ ఆకట్టుకుంటున్నాయి. హనుమాన్ ప్రపంచానికి కొనసాగింపుగా వస్తున్న ఈ చిత్రంలో అసుర గురువు శుక్రాచార్యుడి పాత్ర ఎంత కీలకంగా ఉండబోతోందో ఈ గ్లింప్స్ స్పష్టం చేస్తోంది. ప్రశాంత్ వర్మ మార్క్ విజువల్స్, సౌండ్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ కథ, కాన్సెప్ట్ అందిస్తూ క్రియేటర్‌గా వ్యవహరించగా, పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రివాజ్ రమేష్ దుగ్గల్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భూమి శెట్టి లీడ్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నాతో పాటు శ్రియా రెడ్డి, రోహిత్ సరాఫ్, సముద్రఖని, నాజర్, మురళీ శర్మ, రజత్ కపూర్ వంటి భారీ తారాగణం నటిస్తోంది. స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నారు.

ఈ చిత్రాన్ని 2027 జనవరి 8న సంక్రాంతి కానుకగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. 'హనుమాన్' విజయం తర్వాత పీవీసీయూ నుంచి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com